


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు


పండుగ వాతావరణంలో జాతీయ విద్యాదినోత్సవం
- ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం
- ఘనంగా సత్కరించిన సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్

12

# ఏపీ బడ్జెట్ రూ.2,94,427.25 కోట్లు

- సభలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్
- నాలుగు నెలల కాలానికి బడ్జెట్‌ను తీసుకొచ్చిన ప్రభుత్వం
- నీటి పారుదల, సంక్షేమం, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత
- సూపర్స్ సిక్స్ సహా పలు రంగాలకు భారీ కేటాయింపులు
- రెవెన్యూ వ్యయం అంచనా రూ.2,35,916.99 కోట్లు
- మూలధన వ్యయం అంచనా రూ.32,712.84 కోట్లు.
- రెవెన్యూ లోటు రూ.34,743.38 కోట్లు
- ద్రవ్య లోటు రూ.68,742.65 కోట్లు

2



## రైతులు ఒక్కొక్కరి ఖాతాలో రూ.20వేలు..

అన్నదాత సుఖీభవ పథకంపై మంత్రి అచ్చెన్న కీలక ప్రకటన



- సాగుకు దన్నుగా..
- అన్నదాతకు అగ్రాతాంబూలం
- రూ. 43,402 కోట్లతో వ్యవసాయ బడ్జెట్
- రైతుల సంతోషమే సీఎం చంద్రబాబు ధ్యేయం

8

## 15శాతం వృద్ధి రేటు లక్ష్యం

- అందుకు అనుగుణంగానే ప్రభుత్వ ప్రణాళికలు
- అవకాశాల కల్పనతోనే సంపద సృష్టి సాధ్యం
- స్పష్టం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047పై టాస్క్‌ఫోర్స్‌తో భేటీ
- లక్ష్య సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై లోతైన చర్చ
- విజన్ డాక్యుమెంట్‌పై మేధోమథనం

9



## ఆత్మలతో మాట్లాడి అడ్డగోలు నిర్ణయాలు!

11



- అన్ని వ్యవస్థల్లాగే విద్యారంగాన్నీ నాశనం చేశారు
- గత ప్రభుత్వంలో ప్రచారం ఎక్కువ, పని తక్కువ
- ఫీజు రీయింబర్స్‌మెంట్ సహా 6,500 కోట్ల బకాయిలు పెట్టారు
- ఐదేళ్లలో ఏపీ విద్యావ్యవస్థను నెం.1గా తీర్చిదిద్దుతాం
- ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి లోకేష్

## చట్టం తన పని తాను చేసుకుపోతుంది

- అసెంబ్లీకి జగన్ గైర్హాజరుపై స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలు

14

మంత్రి లోకేష్ సహృదయం
- సమగ్ర శిక్ష ఉద్యోగులకు సమ్మె కాలపు వేతనాలు విడుదల

13

## అసభ్య పోస్టులు.. కేరాఫ్ తాడేపల్లి

- వైసీపీ కార్యాలయంలోనే సృష్టి
- వర్రా రవీంద్రారెడ్డి, ఇతర నిందితుల వాంగ్మూలం
- కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ వెల్లడి

18

## సామాజిక ఇన్‌ఫ్లుయన్సర్లు.. టీచర్లే




- పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దే బాధ్యత గురువులదే
- విజన్ 2047ను సాకారం చేయడంలో టీచర్లే కీలకం
- ప్రతి టీచర్ విజ్ఞానగనిగా మారాలి
- మీ గౌరవాన్ని, ప్రతిష్ఠను నిలబెట్టే బాధ్యత మాది
- విజ్ఞాన కేంద్రాలుగా విశాఖ, అమరావతి, తిరుపతి
- ఐదేళ్లలో నాలెడ్జ్ ఎకానమీకి హబ్‌గా ఏపీ తయారవ్వాలి
- ఉపాధ్యాయ అవార్డుల ప్రధానోత్సవంలో సీఎం చంద్రబాబు

వివరాలు 10

చైతన్యరథం



# ఏపీ బడ్జెట్

# రూ.2.94 లక్షల కోట్లు

- ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
- సభలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్
- నాలుగు నెలల కాలానికి బడ్జెట్‌ను తీసుకొచ్చిన ప్రభుత్వం
- నీటి పారుదల, సంక్షేమం, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత
- సూపర్స్ సిక్స్ సహా పలు రంగాలకు భారీ కేటాయింపులు

**2024- 2025 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్: రూ.2,94,427.25 కోట్లు**

**రెవెన్యూ వ్యయం అంచనా రూ.2,35,916.99 కోట్లు**

**మూలధన వ్యయం అంచనా రూ.32,712.84 కోట్లు**

**రెవెన్యూ లోటు రూ.34,743.38 కోట్లు**

**ద్రవ్య లోటు రూ.68,742.65 కోట్లు**

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ రూపుదిద్దుకుంది. అసెంబ్లీలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టారు. రాష్ట్ర పునర్నిర్మాణం, పేదల సంక్షేమమే లక్ష్యంగా.. ఏపీ బడ్జెట్‌లో వివిధ రంగాలకు ప్రాధాన్యమిచ్చారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి బడ్జెట్ ఇది.. నాలుగు నెలల కోసం ఈ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టింది ప్రభుత్వం. ఈనెల 22 వరకు అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. బడ్జెట్ ఆమోదంతోపాటు కీలక బిల్లులను ప్రవేశపెట్టనుంది ప్రభుత్వం.

వైకాపా అధినేత, మాజీ సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసంతో తిరోగమనంలోకి పోయిన ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి సాధారణ స్థాయికి తీసుకొచ్చేలా 2024-25 బడ్జెట్‌ను ప్రకటించింది ఎన్డీయే ప్రభుత్వం. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత కల్పించారు. రూ.2.94 లక్షల కోట్ల బడ్జెట్‌లో ప్రాధాన్యతా ప్రాతిపదికన కీలక రంగాలకు భారీ కేటాయింపులు చేశారు. రాష్ట్ర జీఎస్డీపీలో 40 శాతానికిపైగా వాటావున్న వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.43,402 కోట్లు కేటాయించడం ద్వారా మాది రైతు సంక్షేమ ప్రభుత్వమన్న పేరుకు సార్థకత చేకూర్చారు. విద్య, వైద్య, ఇరిగేషన్, పంచాయతీరాజ్, నైపుణ్యాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధితో పాటు రాష్ట్ర రహదారుల కోసం సింహభాగం ఖర్చు చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతకు అనుగుణంగానే ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉండటం గమనార్హం.

2024- 2025 ఆర్థిక సంవత్సరానికి రూ.2,94,427.25 కోట్లతో వార్షిక బడ్జెట్‌ను సభ ముందుకు తెచ్చారు మంత్రి కేశవ్. బడ్జెట్లో రెవెన్యూ వ్యయం అంచనా రూ.2,35,916.99 కోట్లు, మూలధన వ్యయం అంచనా రూ.32,712.84 కోట్లుగా పేర్కొన్నారు. రెవెన్యూ లోటు రూ.34,743.38 కోట్లు, ద్రవ్య లోటు రూ.68,742.65 కోట్లుగా పయ్యావుల తన బడ్జెట్ ప్రసంగం ద్వారా వెల్లడించారు.

## తల్లికి వందనం.. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం

ఎన్ని సవాళ్లు ఎదురైనా ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు నాయకత్వంలో కృషి చేస్తామని మంత్రి పయ్యావుల పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 'తల్లికి వందనం' పథకానికి నిధులు కేటాయిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే 1-12వ తరగతి విద్యార్థుల తల్లులకు ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ విద్యకు దూరం కాకూడదనేది తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. తర్వాత వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వ్యవసాయ బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టారు. అనంతరం సభను ఎల్లుండికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు.

వైసీపీ ఐదేళ్ల పాలనా కాలంలో విధ్వంసానికి గురైన రాష్ట్ర పరిస్థితి.. ఎదుర్కొంటున్న సవాళ్లను ముందుగా ప్రస్తావించిన ఆర్థిక మంత్రి.. చరిత్రలో తొలిసారిగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గందరగోళంలో పడిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ప్రతికూలంగా వ్యాఖ్యానించడాన్ని ప్రస్తావిస్తూ.. నేడు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పతనం అంచున ఉందన్నారు. మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పున:ప్రారంభించి రాష్ట్ర ప్రగతిని పునర్నిర్మించడం ఇప్పుడు నేటితరం చేతుల్లో ఉందంటూనే.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రేరణే చోదక శక్తిగా చెప్పుకొచ్చారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన దిశానిర్దేశాన్ని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సందర్భోచితంగా ప్రస్తావించారు.

*"ప్రతీ సంక్షోభాన్నీ అంకితభావంలో, సృజనాత్మకతలో నిబద్ధత మరియు కృషితో అవకాశంగా మార్చుకోండి"*

## ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగ పాఠం యథాతథంగా...



*గౌరవనీయ అధ్యక్షా!*

2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను మన రాష్ట్ర వార్షిక బడ్జెటును మీ అనుమతితో గౌరవ సభ ముందు ప్రతిపాదిస్తున్నాను.

ఈ రోజు నేను ప్రవేశపెడుతున్న బడ్జెట్ ప్రతిపాదనల ప్రాముఖ్యత అంకెలకు మించినది. మన రాష్ట్రాన్ని కాపాడాలని అపూర్వమైన తీరును ఇచ్చిన ప్రజల సంకల్పానికి ఇది ప్రతిబింబం. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గత ప్రభుత్వ దుష్పరిపాలన వలన మన రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని ప్రజలకు తెలియజేయడం మా ప్రభుత్వ నైతిక కర్తవ్యం. మా ప్రభుత్వం వెలువరించిన ఏడు శ్వేతపత్రాల ద్వారా ఇది జరిగింది. సమిష్టి అవగాహనకు అవసరమైన అంశాలపై బహిరంగ చర్చను ప్రోత్సహించడం, రాష్ట్ర పునర్ నిర్మాణ ప్రక్రియలో మద్దతు కూడగట్టడం వీటి ఉద్దేశ్యం. ఈ రోజు మన రాష్ట్రం ఎదుర్కొంటున్న సవాళ్ళు:

రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల దుర్వినియోగం

రాష్ట్ర వనరుల మళ్ళింపు

లోపభూయిష్టమయిన ఎక్సైజ్ మరియు ఇసుక విధానాల వలన సహజవనరుల దోపిడీ వలన రాష్ట్ర ఆదాయానికి గండిపడడం

ప్రభుత్వ పన్నులను దారి మళ్ళించడం ద్వారా రాబోయే 25 సంవత్సరాల భవిష్యత్తు ఆదాయాన్ని గణనీయంగా తగ్గించడం

పరిమితికి మించి రుణాలను అధిక వడ్డీ రేట్లకు తీసుకోవడం

కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించి రుణాలు తీసుకోవడం

కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల మళ్ళింపు

పిల్లల పౌష్టిక ఆహారం కోసం చిక్కి వైద్య సామాగ్రి వంటి ముఖ్యమైన పథకాలకు చెల్లింపుల నిలుపుదల

స్థానిక సంస్థల నిధుల మళ్ళింపు

ఉద్యోగులకు పేరుకుపోయిన బకాయిలు

వివిధ పనులకు చెందిన బిల్లుల బకాయిలు

అన్ని ప్రాజెక్టులను స్తంభింపజేయడం ద్వారా నీటిపారుదల రంగ పతనం

ఇంధన రంగ విధ్వంసం

కొత్తగా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ ఏర్పాటు ద్వారా కార్పొరేషన్ల నిధుల మళ్ళింపు

పైన పేర్కొన్న కారణాల వలన దేశంలోనే తొలిసారిగా ఆర్థిక గందరగోళ పరిస్థితులు ఎదురయ్యాయి. కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదికలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రతికూలంగా వ్యాఖ్యానించింది. నేడు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పతనం అంచున ఉంది. మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పున:ప్రారంభించి రాష్ట్ర ప్రగతిని పునర్ నిర్మించడం ఇప్పుడు నేటితరం చేతులలో ఉంది. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రేరణే మాకు చోదక శక్తి. ఈ సందర్భంగా ఆయన మాటలను ఉదహరించాలని అనుకుంటున్నాను.

*"ప్రతీ సంక్షోభాన్నీ అంకితభావంలో, సృజనాత్మకతలో నిబద్ధత మరియు కృషితో అవకాశంగా మార్చుకోండి."*

2024 మే-జూన్ నెలలలో జరిగిన సార్వత్రిక మరియు రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో మన రాష్ట్ర ప్రజలు మా సంకీర్ణ ప్రభుత్వానికి అపూర్వమైన తీర్పునిచ్చారు. 57 శాతం ఓట్లతో, 175 సీట్లకుగాను 164 సీట్లు రావడం మాకు దక్కిన గౌరవం. అసాధారణమైన ఆధిక్యతతో 93 శాతం సీట్లను మేము గెలవగలిగాము. గత ప్రభుత్వ దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా ప్రజలు చేసిన విప్లవ ప్రకటన ఇది. అదే సమయంలో, మా ఎన్డీయే ప్రభుత్వానికి లభించిన అద్భుతమైన ఈ ఆధిక్యత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణెదల పవన్ కళ్యాణ్ మరియు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వం మరియు ప్రతిభపై ప్రజలకున్న నమ్మకానికి నిదర్శనం.


- (మిగతా వివరాలు 4లో)

### ముప్పైయేళ్ల చంద్రన్న స్మార్ట్ అండ్ హార్డ్‌వర్క్

# అభివృద్ధి.. సంక్షేమం.. సామాజిక న్యాయానికి పట్టం

సెప్టెంబరు 1, 1995న శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు ముఖ్యమంత్రిగా తొలుత బాధ్యతలు చేపట్టి
సెప్టెంబరు 1, 2024 నాటికి 30వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంలో.. మహోజ్వల విజయాలు కొన్ని.

## విజనరీ లీడర్ మన చంద్రన్న




## 12 లక్షల నాణ్యమైన ఇళ్లు నిర్మించారు మన చంద్రన్న

12 లక్షల నాణ్యమైన ఇళ్లు నిర్మించారు మన చంద్రన్న

| | |
|---|---|
| 1. గ్రామీణ ప్రాంతాలలో నిర్మించిన ఇళ్లు | 7,76, 456 |
| పట్టణ ప్రాంతాల్లో నిర్మించిన టిడ్కో ఇళ్లు | 2,62,216 |
| గతంలో ఆగిపోయినవి తిరిగి నిర్మించిన గృహాలు | 2,17, 375 |
| మొత్తం | 12,56,047 |

2. చంద్రన్న ప్రభుత్వం పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు పట్టాలిచ్చింది
3. 20 లక్షల ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది
4. సెంటు పట్టా పేరుతో జగన్ ముఠా 25 వేల కోట్లు దోపిడీ చేశారు
5. ఉమ్మడి రాష్ట్రంలో 26 లక్షల ఇళ్లు నిర్మించారు





చైతన్యరథం



# ఏపీ బడ్జెట్ రూ.2.94 లక్షల కోట్లు



(2వ పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వానికి, దూరదృష్టికి, మరియు ప్రజాసేవపట్ల ఆయనకున్న అంకితభావానికి, మన రాష్ట్ర ప్రజలు ఆయన మీద ఉంచిన అపరిమిత విశ్వాసానికి ఈ విజయం ఒక తార్కాణం. మన రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన ఎల్లప్పుడూ కృషి చేస్తూనే ఉన్నారు. తన అద్భుతమైన పనితీరు, నిజాయితీ మరియు సాంకేతికత పట్ల ఉన్న సమగ్ర అవగాహన, ఆధునికీకరణ మరియు సాంకేతిక ఆధారిత భవిష్యత్తు కోసం వారు చూపిన దార్శనికత వారి పేరుతోపాటు మన రాష్ట్ర ప్రతిష్ఠను కూడా పెంపొందింపజేసాయి. మన ముఖ్యమంత్రి 1995లోనే ఆర్థిక మంత్రిగా తన తొలి బడ్జెట్ ప్రసంగంలో ఇలా అన్నారు...

*"అభివృద్ధి సాధించాలంటే సామర్థ్యంతో కూడిన అమలు పరిచే విధానాలుంటే తప్ప ప్రయోజనం గల ఫలితాలు సాధించలేము. ప్రపంచ వ్యాప్తంగా సాగుతున్న 'సమాచార విప్లవం' వలన కలిగిన లాభాలను మరియు అవకాశాలను వినియోగించుకోవడానికి వీలుగా మా పాలనా యంత్రాంగాన్ని పునర్ వ్యవస్థీకరించాలన్నది మా ఆశయం. పరిపాలనకు చెందిన అన్ని రంగాలలోనూ కంప్యూటర్ల వినియోగానికి ఒక బృహత్ కార్యక్రమాన్ని చేపట్టాలని భావిస్తున్నాము."*

ఆయన పరిపాలనా అనుభవంలోని మైలురాయి అంశాలు ఇప్పుడు చెప్పబోయే విషయాలను నిర్ధారిస్తాయి. 1995 నుండి 1999 వరకు ముఖ్యమంత్రిగా ఆయన మొదటి పదవీకాలం గణనీయమైన ఆర్థిక సంస్కరణలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు సమాచార సాంకేతిక పరిశ్రమల అభివృద్ధితో గుర్తింపు పొందింది. ఆయన ప్రగతిశీల నాయకత్వంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దేశానికే చక్కటి అభివృద్ధి నమూనాగా నిలిచింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వ్యవసాయ ఆధారిత రాష్ట్రం నుంచి సాంకేతిక పరిజ్ఞానానికి మూల స్తంభంగా మరియు సమాచార సాంకేతిక సేవల కేంద్రంగా మార్చడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన చేపట్టిన అనేక విధానాలు మరియు పాలన కార్యక్రమాలు తర్వాతి కాలంలో జాతీయ విధానాలుగా కూడా రూపుదిద్దుకున్నాయి. 'రేపటి రోజున దేశం చేసే ఆలోచనను, ఆంధ్రప్రదేశ్ ఈ రోజే చేస్తుంది' అనే పేరును తీసుకొచ్చారు. ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న సాఫ్ట్వేర్ పరిశ్రమకు హైదరాబాద్లో అనాడే పునాది వేయడం ద్వారా హైదరాబాద్ను ప్రపంచ సమాచార సాంకేతక పటంలో అగ్ర స్థానానికి చేర్చటంలో కూడా ఆయన పాత్ర మరువలేనిది. ఇంజినీరింగ్ కళాశాలలు మరియు సమాచార సాంకేతిక రంగాలలో ఆయన చేసిన విధానపరమైన నిర్ణయాలు మన రాష్ట్ర ప్రజలకు ప్రపంచ వ్యాప్తంగా అవకాశాలు కల్పించాయి. ఈ కారణంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన సామాన్య ప్రజలు సైతం ప్రపంచవ్యాప్తంగా విజయ శిఖరాలను అధిరోహించ గలిగారు. నేడు అమెరికాతో పాటు అనేక ఇతర దేశాలలో ప్రవాసాంధ్రులు అత్యధిక తలసరి ఆదాయం కలిగినవారుగా స్థిరపడ్డారు.

2014 జూన్ నెలలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ను అన్యాయంగానూ, అశాస్త్రీయంగానూ మరియు అప్రజాస్వామికంగానూ ఒక శాశ్వత రాజధాని లేకుండా విభజించడం వలన మన రాష్ట్రం సంక్షోభంలో కూరుకుపోయి, ఆర్థికంగా నిలదొక్కుకోలేని అవశేష రాష్ట్రంగా ఉండిపోయింది. రాష్ట్ర విభజనను మన రాష్ట్ర ప్రజలపై బలవంతంగా రుద్దారని చెప్పడం ఎంత మాత్రం తప్పుకాదు. మన రాష్ట్రాన్ని పునర్నిర్మాణ దిశగా మరియు సుసంపన్నదిశగా తీసుకువచ్చే బాధ్యతను మన నాయకుడు, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు తన భుజస్కంధాలపై వేసుకున్నారు. ఆయన పరివర్తనాత్మక నాయకత్వంతో దీర్ఘకాలిక మరియు స్వల్పకాలిక ప్రణాళికలను అమలుచేసి అవశేష రాష్ట్రాన్ని విభజన దుష్ప్రభావం నుండి తప్పించి అభివృద్ధి పథంలో నడిపించారు. 7. 2014 నుండి 2019 వరకు వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు, నీటిపారుదల, రోడ్లు భవనాలు, ఉపాధి కల్పన తదితర రంగాలలో బహుముఖ వ్యూహాన్ని రూపొందించారు. కియా మోటార్స్, హీరో మోటార్స్, ఏషియన్ పెయింట్స్ వంటి భారీ పరిశ్రమలను మన రాష్ట్రం ఆకర్షించింది. పట్టిసీమ ఎత్తిపోతల పథకం దేశంలోనే రికార్డు సమయంలో అనగా కేవలం ఏడాది కాలంలోనే పూర్తి అయిన తొలి నదుల అనుసంధాన ప్రాజెక్టుగా రికార్డు సృష్టించింది. సులభతర వ్యాపార నిర్వహణా ర్యాంకింగ్లో మన రాష్ట్రం మొదటి స్థానం సాధించి ఆ ఐదేండ్లలో అగ్రస్థానంలో నిలిచింది. ఇంధన రంగంలో సంస్కరణలు తీసుకురావడంతో పాటు పునరుత్పాదక ఇంధనాన్ని ప్రోత్సహించడం ద్వారా 2018 జనవరి నాటికి మన రాష్ట్రం ఇంధన మిగులు రాష్ట్రంగా నిలిచింది. నాటి బహుముఖ వ్యూహం ఫలితంగా మన రాష్ట్రం సంక్షేమంతో కూడిన సుస్థిర ఆర్థికాభివృద్ధి పథంలో పయనించింది.

2019 తర్వాత జరిగిన పరిణామాలు మన రాష్ట్ర చరిత్రలో ఒక చీకటి దశగా చెప్పుకోవచ్చు. 2014-19 మధ్య కాలంలో జరిగిన ఆర్థికాభివృద్ధి వృధా అయింది. గత ప్రభుత్వం 2019లో తన పదవీ కాలాన్ని ఎంతో విధ్వంసకర ధోరణితో ప్రారంభించింది. ప్రజావేదికను కూల్చివేసింది. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను రద్దు చేసింది. మూడు రాజధానుల నమూనాతో ప్రజలను అయోమయానికి గురిచేసింది. పారిశ్రామిక వ్యతిరేక విధానాన్ని అనుసరించింది. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని మరియు మన రాష్ట్ర బ్రాండ్ విలువను దెబ్బతీసింది. నీటి పారుదల రంగాన్ని పూర్తిగా విస్మరించింది. కేంద్ర ప్రభుత్వ అభిప్రాయానికి విరుద్ధంగా కార్యనిర్వాహక సంస్థను మార్చడం ద్వారా పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపివేసింది. ఈ చర్యల వలన డయాఫ్రమ్ గోడకు నష్టం కలిగి ప్రాజెక్టు జాప్యానికి దారితీసింది. పన్నులు చెల్లిస్తూ మరియు ఉపాధి కల్పిస్తూ రాష్ట్రాభివృద్ధికి దోహదపడే పరిశ్రమలు మన రాష్ట్రాన్ని వదిలి వెళ్ళి పోయాయి. ఈ చర్యలు పెట్టుబడిదారులను మరియు ప్రపంచ ఆర్థిక సంస్థలను రాష్ట్రంలో స్థిరమైన పెట్టుబడులు పెట్టనివ్వకుండా చేసాయి., ఫలితంగా మన రాష్ట్ర ఆర్థికస్థితి విచ్ఛిన్నమైంది.

ఈ సందర్భంలో కౌటిల్యుడి మాటలు ఒకసారి గుర్తుచేసుకుందాం.

*"సంపదకు మూలం ఆర్థిక కార్యకలాపాలే.... అవి లేకపోవడం వనరుల సమీకరణకు ఇబ్బందులను తెచ్చిపెడుతుంది... ఫలవంతమైన ఆర్థిక కార్యకలాపాలు లేకపోతే, ప్రస్తుత శ్రేయస్సు మరియు భవిష్యత్ వృద్ధి రెండూ నాశనమయ్యే ప్రమాదం ఉంది."*

ద్రవ్యం చలామణిలో ఉన్నప్పుడే ఆర్థిక వ్యవస్థలో సంపద సృష్టి జరుగుతుంది. ఇది జరగాలంటే ప్రాజెక్టుల అమలు తప్పనిసరి. కానీ, గత ప్రభుత్వం ఉత్పాదక మూలధన వ్యయాన్ని నిలిపివేయడం ద్వారా 2014- 19 సంవత్సరాల మధ్య అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఒకటిగా ఉన్న మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 2019-24 సంవత్సరాల మధ్య గడ్డు స్థితికి చేరుకోవడానికి కారణమయింది. గత ప్రభుత్వం రాష్ట్ర వనరుల దుర్వినియోగం మరియు నిధులను ప్రక్క దారి పట్టించడం వంటి చర్యలతో పేలవమైన పాలన చేయడం జరిగింది. కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులను దారి మళ్ళించడమేకాక, అందుకు సరిపోయే రాష్ట్ర వాటాను కూడా విడుదల చేయలేదు. కార్పొరేషన్ల నిధుల మళ్ళింపు, రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల దుర్వినియోగం వంటి చర్యలు అధిక రుణ భారానికి దారితీసాయి. ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టడం, స్థానిక సంస్థల నిధుల మళ్ళింపు వంటి చర్యలకు పాల్పడటంతోపాటు బిల్లుల చెల్లింపుల కోసం ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాజ్యాలు వేయడం వలన గుత్తేదారులకు నమ్మకం లోపించి ప్రభుత్వంపై విశ్వాసం సన్నగిల్లింది. గత ప్రభుత్వం అధికారం నుండి వైదొలిగేనాటికి మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పతనం అంచున ఉంది. ఉద్యోగులకుగానూ 21,980 కోట్ల రూపాయల బకాయిలు, కేంద్ర ప్రాయోజిత పథకాలకు 4,657 కోట్ల రూపాయల బకాయిలతో సహా మొత్తం 1,35,224 కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని శ్వేతపత్రంలో ఇప్పటికే పేర్కొన్నాం. ఇవన్నీ గత ప్రభుత్వ దుష్పరిపాలనకు, వైఫల్యాలకు నిదర్శనం.

2019-24 సంవత్సరాల మధ్య కాలంలో నెలకొన్న పరిస్థితి చూస్తే మన రాష్ట్రం పటిష్టమైన ఆర్థిక సూత్రాలతో నడిచిందా? లేక వ్యక్తిగత ప్రయోజనాల కోసం లాభాపేక్షతో ఒక ప్రైవేటు సంస్థలాగా నడిచిందా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. గత ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని ప్రక్కన పెట్టి కేవలం ప్రైవేటు లాభం అనే భావనతోనే నడిచింది. సహజ వనరులను కొల్లగొట్టడం, సహజ ఖనిజాల అక్రమ తవ్వకాలతో రాష్ట్ర ఖజానాకు ఆదాయ నష్టం కలిగించడం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉద్దేశ్య పూర్వకంగా ఇసుక మరియు ఎక్సైజ్ విధానాలను రూపొందించడం జరిగింది. ఈ చర్యల వలన ఒకవైపు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ క్షీణించగా, మరోవైపు అధిక పన్నులు మరియు దుష్పరిపాలన కారణంగా రాష్ట్ర ప్రజల కష్టాలు మరింత పెరిగాయి. గత ప్రభుత్వం ప్రజాస్వామిక గొంతులను అణచివేయడం మరియు ప్రజాస్వామ్య వ్యవస్థలను దెబ్బతీయడం వంటి కక్షసాధింపు చర్యలకు పాల్పడింది.

గత ప్రభుత్వ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా వివేకవంతమైన ప్రజాస్వామిక నిర్ణయం తీసుకొని, మరోసారి రాష్ట్ర చరిత్ర గతిని సవ్యదిశగా మార్చిన మనరాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలియ జేసుకుంటున్నాను. మన రాష్ట్ర ప్రజలు విజ్ఞతతో ఇచ్చిన తీర్పు 2024లో ఎన్.డి.ఎ. కూటమి తిరిగి అధికారంలోకి వచ్చేందుకు దోహదపడింది. శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు నేడు రెట్టించిన ఉత్సాహం మరియు దృఢ సంకల్పంతో ఉన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ విజను 2024 సంవత్సరం ఒక మైలురాయి వంటిది.

మా ప్రభుత్వం ఎన్ని సవాళ్ళు ఎదురైనా ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ముఖ్యమంత్రి నాయకత్వంలో కృషి చేస్తోంది. ఈ రోజు నేను ప్రవేశపెడుతున్న బడ్జెట్ ప్రతిపాదనలు రాష్ట్ర ఆర్థిక నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మరియు ఆర్థిక పునరుజ్జీవనమే లక్ష్యంగా మరియు సంపదను సృష్టించే విధంగా అభివృద్ధి చక్రాన్ని పునఃప్రారంభించాలనే ఉద్దేశ్యంతో రూపొందించబడినవి. అన్ని శాఖలకు కేటాయింపులు ప్రతిపాదించే ముందు, మా ప్రభుత్వానికి మార్గదర్శకంగా నిలిచిన స్వర్గీయ ఎన్.టి. రామారావు మాటలను నేను గుర్తు చేసుకోవాలనుకుంటున్నాను.

*"సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు"*

## వ్యవసాయం మరియు అనుబంధ రంగాలు

ఈ సందర్భంగా నాకు తెలుగు పునరుజ్జీవనోద్యమ పితామహుడిగా పేరొందిన కందుకూరి వీరేశలింగం ఆలోచనలు గుర్తుకొస్తున్నాయి.

*"వ్యవసాయం చేసే చేతులకు మనం సాయం చేయాలి. అదే దేశ సౌభాగ్యానికి మార్గం."*

మా ప్రభుత్వానికి వ్యవసాయ రంగ అభివృద్ధి మరియు రైతుల సంక్షేమమే అత్యంత ప్రాధాన్యము. మా వ్యవసాయ శాఖా మంత్రిగారు 2024- 25 వ్యవసాయ బడ్జెట్ను ప్రవేశపెట్టేటప్పుడు వ్యవసాయాభివృద్ధికి మా ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి వివరిస్తారు.

'సూపర్ సిక్స్' హామీలలో భాగంగా మా ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ- ప్రధానమంత్రి కిసాన్ పథకం' ద్వారా అర్హులైన రైతులకు పెట్టుబడి సాయం ప్రకటించింది. మా ప్రభుత్వం రైతుల సమగ్ర అభివృద్ధికి పొలం పిలుస్తోంది, వడ్డీ లేని రుణాలు, భూసార కార్డుల పంపిణీ, వ్యవసాయ పనిముట్ల సరఫరా, భూసార పరీక్షల ప్రయోగశాలలు, పొలంబడి వంటి పథకాలను అమలు చేస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరం రబీ కాలం నుండి పంటల బీమా పథకాన్ని సవరించడం మరియు స్వచ్ఛంద నమోదు నమూనాను అవలంబించడం వలన, రైతులు వారి వారి వ్యక్తిగత అవసరాల ఆధారంగా ఈ పథకాలలో పాల్గొనే స్వేచ్ఛను మరియు వెసులుబాటును కల్పించడం జరిగింది.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ స్థూల విలువనుపెంచడంలో పశుసంవర్ధక రంగం కీలక పాత్ర పోషిస్తుంది. పశు సంపద మరియు కోళ్ళ పెంపకంలో మన రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో ఉంది. మన రాష్ట్రం గుడ్ల ఉత్పత్తిలో మొదటి స్థానంలోనూ, మాంసం ఉత్పత్తిలో 4వ స్థానంలోనూ మరియు పాల ఉత్పత్తిలో 5వ స్థానంలోనూ ఉంది. వివిధ పథకాల క్రింద పశువులకు ఆశ్రయం, గ్రాసం మరియు వైద్య సహాయం అందించడం ద్వారా పశు సంపదను పెంచుతూ పశువులకు రక్షణ మరియు సంరక్షణ కలిగించాలని మా ప్రభుత్వం తీర్మానించుకుంది. పశువుల ద్వారా జీవనోపాధి పొందుతున్న యాదవులు, కురబలు, కురుమలు మరియు ఇతర వర్గాల ఆదాయాన్ని పెంచడానికి మా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. పశు బీమా పథకాన్ని అమలు చేయడం ద్వారా ప్రభుత్వం ఈ వర్గాల జీవనోపాధికి రక్షణ కల్పిస్తోంది.

సాంప్రదాయ మత్స్యకారులు చేపల చెరువులను లీజుకు తీసుకోకుండా గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దశాబ్దాలుగా చేపల చెరువులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారుల ప్రయోజనాలను పరి-రక్షించడానికి, మా ప్రభుత్వం ఆ ఉత్తర్వులను ఉపసంహరించింది. 23 వేల చేపల వేటకు అనువైన బోట్లకు మా ప్రభుత్వం రాయితీపై డీజిలును అందిస్తోంది.

వ్యవసాయం మరియు అనుబంధ రంగాలను ప్రోత్సహించడంలోనూ మరియు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలోనూ సహకార రంగం కీలక పాత్ర పోషించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను కంప్యూటరీకరణ చేయడం ద్వారా బలోపేతం చేసి రైతుల ఆర్థిక సమీకరణను పెంచడం జరుగుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయం మరియు అనుబంధ రంగాలకు 11,855 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

## సంక్షేమం

మన ముఖ్యమంత్రి సంక్షేమం గురించి ఇలా అంటుంటారు.

*"ప్రజలు ఎల్లప్పుడూ సంక్షేమం, అభివృద్ధి మరియు సుపరిపాలనను కోరుకుంటారు. వాటిని అందిస్తున్నంత కాలం ప్రజలు మనతోనే ఉంటారు".*

సంక్షేమం మరియు అభివృద్ధిని సమతుల్యం చేయాలనే వారి విశ్వాసం మూడు దశాబ్దాల క్రితం 1995లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక మంత్రిగా ఆయన చేసిన తొలి బడ్జెట్ ప్రసంగం నుంచే స్పష్టమవుతోంది. ***"స్థూలంగా చెప్పాలంటే మా ప్రభుత్వ ప్రధాన ఆశయం పేదరిక నిర్మూలన, బడుగుల సంక్షేమమే మా పరమావధి. పేదల సంక్షేమానికి మా ప్రభుత్వం సర్వదా అంకితం. అంత మాత్రాన రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కుంటు- పడనిస్తామని అనుకోవద్దు. ఆ పని ఎప్పటికీ జరగదు. నిధుల కొరత కారణంగా ఏ అభివృద్ధి కార్యక్రమం కుంటుపడరాదన్నది మా ధ్యేయం. అలా కుంటుపడకుండా కృషి చేస్తాం."***

విద్యాభివృద్ధి, సామాజిక ఆర్థికాభివృద్ధి, సంక్షేమం మరియు హక్కుల పరిరక్షణ కోసం వివిధ పథకాలను అమలు చేయడం ద్వారా అన్ని సామాజిక వర్గాల అభివృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. సంక్షేమానికి పెద్దపీట వేస్తూ స్వర్ణాంధ్ర-2047 దిశగా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా మాప్రభుత్వం ఎన్నో పథకాలను రూపొందిస్తోంది. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టిన వెంటనే సామాజిక భద్రత పింఛన్ను 3 వేల రూపాయల నుండి 4 వేల రూపాయలకు పెంచడం జరిగింది. ఎన్.టి.ఆర్. భరోసా పింఛను పథకం ద్వారా 64.38 లక్షల మంది పింఛనుదారులకు నెలకు 4 వేల రూపాయల నుండి 15 వేల రూపాయల వరకు పింఛన్లు అందుతున్నాయి.

- (మిగతా వివరాలు 5లో)

చైతన్యరథం



# ఏపీ బడ్జెట్
# రూ.2.94 లక్షల కోట్లు



(4వ పేజీ తరువాయి)

మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ఎన్.టి.ఆర్. భరోసా పథకం క్రింద 4,400 కోట్ల రూపాయలు, అలాగే 2024 జూన్ నుండి ఇప్పటి వరకు మొత్తం 15,218 కోట్ల రూపాయలు విడుదల చేయబడ్డాయి. కళాశాలల నుంచి ధృవపత్రాలు పొందేందుకు విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు మెట్రిక్ అనంతర ఉపకార వేతనాలను (ఆర్.టి.ఎఫ్) ప్రభుత్వం నేరుగా కళాశాలల ఖాతాలలోకే విడుదల చేస్తోంది. గత ప్రభుత్వం మిగిల్చిన పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను కూడా దశలవారీగా విడుదల చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మా ప్రభుత్వ పథకాలు మాల, మాల దాసరి, మేడిగ, రెల్లి, అరుంధతీయ మరియు ఇతర షెడ్యూల్డ్ కులాల వర్గాలకు మేలు చేస్తాయి.

రజకులు, దూదేకులు, నాయీబ్రాహ్మణులు వంటి సంప్రదాయ వృత్తి సమూహాలకు ఆదునిక వృత్తి పద్ధతుల ద్వారా వారి జీవనోపాధిని పెంపొందించడానికి ఆర్థిక సహాయం అందించాలని ప్రతిపాదించబడింది. సంప్రదాయకంగా నైపుణ్యం కలిగిన నేత కార్మికులకు వారి నైపుణ్యాలను మెరుగుపరచడానికి వీలుగా ఆర్థిక సహాయం కూడా అందించబడుతోంది. మా ప్రభుత్వ పథకాలు వడ్డెర, వాల్మీకి, గౌడ, కళింగ, గవర, పద్మశాలి, బెస్త, నగర, ఉప్పర తదితర వెనుకబడిన వర్గాలకు లబ్ధి చేకూరుస్తాయి..

షెడ్యూల్డ్ తెగల కుటుంబాల సాధికారతకు మా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది. గిరిజన వర్గాల సంక్షేమం కోసం పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలు- ఆర్.టి.ఎఫ్. ఎం.టి.ఎఫ్., అంబేద్కర్ విదేశీ విద్యానిధి మొదలైన ముఖ్య పథకాలను అమలు చేయడం జరుగుతోంది. గిరిజన ప్రాంతాలలో మౌలిక సదుపాయాల అంతరాలను పూడ్చడంతో పాటు నాణ్యమైన విద్య, పౌష్టిక ఆహారం, ఆరోగ్య సంరక్షణ మరియు గిరిజన వర్గాల ఆర్థికాభివృద్ధిపై కూడా మా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించనుంది.

వివిధ పథకాల ద్వారా అల్పసంఖ్యాక వర్గాలకు ఆర్థిక కార్యకలాపాల లోనూ మరియు ఉపాధి కల్పించడంలోనూ సమాన భాగస్వామ్యం లభించేలా మా ప్రభుత్వం చూస్తోంది. వారి విదేశీ విద్యకు అలాగే ఇమామ్లకు, మౌజాములకు మరియు పాస్టర్లకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రతిపాదిస్తున్నాను.

2024-25 ఆర్థిక సంవత్సరంలో షెడ్యూల్డ్ కులాల కాంపోనెంటు 18,497 కోట్ల రూపాయలు, షెడ్యూల్డ్ తెగల కాంపోనెంటు 7,557 కోట్ల రూపాయలు, వెనుకబడిన తరగతుల కాంపోనెంటు 39,007 కోట్ల రూపాయలు, అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమానికి 4,376 కోట్ల రూపాయలను కేటాయించాలని నేను ప్రతిపాదిస్తున్నాను.

## మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమం

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మహిళా సాధికారత ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ ఇలా అన్నారు:

*"మహిళలు సాధించిన పురోగతి స్థాయిని బట్టి నేను సమాజం యొక్క పురోగతిని కొలుస్తాను."*

ముఖ్యమంత్రి కూడా ఈ ఆలోచనను గట్టిగా విశ్వసిస్తారు. ఆయన నాయకత్వంలో 1990వ దశకంలోనే మన రాష్ట్రం స్వయం సహాయక బృందాల ఉద్యమంలో దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. పొదుపు చేయడం వలన మహిళలలో వ్యవస్థాపక శక్తి పెరుగుతుందని, ఫలితంగా స్వయం ఉపాధి మాత్రమే కాకుండా సాధికారత కూడా లభిస్తుందని వారి దృఢవిశ్వాసం. విస్తృత స్థాయిలో ఒక ఉద్యమంలాగా జరుగుతున్న కార్యకలాపాలకు, నాటి ప్రభుత్వ సహకారం లభించడం వలన రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలకు విశేష ఆదరణ దక్కింది. దీని వలన మన రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచింది. నేడు మన రాష్ట్రంలో 10 లక్షలకు పైగా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి.

గర్భిణులు, బాలింతలు మరియు ఆరేళ్లలోపు పిల్లల పౌష్టికాహార స్థితిని మెరుగుపరిచేందుకు మా ప్రభుత్వం అనేక వినూత్న చర్యలు తీసుకుంటోంది. 26 జిల్లాలలోని 55,607 అంగన్వాడీ కేంద్రాల ద్వారా సమీకృత శిశు అభివృద్ధి (ఐ.సి.డి.ఎస్.) సేవలను మా ప్రభుత్వం అందిస్తోంది. పౌష్టికాహార లోపం మరియు రక్తహీనతల నివారణకు బాల సంజీవని సప్లిమెంటరీ పౌష్టికాహార కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతోంది. ఈ సరుకులన్నింటినీ టేక్ హోమ్ రేషన్ రూపంలో అందించడం జరుగుతోంది.

సూపర్ సిక్స్ వాగ్దానాలను నెరవేర్చే దిశగా, మా ప్రభుత్వం దీపం- 2 పథకాన్ని ప్రారంభించి, సంవత్సరానికి 3 ఎల్.పి.జి. సిలిండర్లను ఉచితంగా అందిస్తోంది. 2024-25లో మొదటి ఉచిత ఎల్.పి.జి. సిలిండర్ పంపిణీ కోసం 895 కోట్ల రూపాయలను విడుదల చేయడం జరిగింది. ఇందులో భాగంగా ఇప్పటికే 5 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు రాయితీ సొమ్ము అందింది. ప్రజారవాణా బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ప్రవేశపెడతామని ఇచ్చిన మరో హామీని కూడా త్వరలో అమలు చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడమే.

2024-25 ఆర్థిక సంవత్సరానికి మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖకు 4,285 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

## మానవ వనరుల అభివృద్ధి నైపుణ్యాభివృద్ధి

నైపుణ్యాభివృద్ధి ప్రాధాన్యత గురించి చైనా తత్వవేత్త లావోట్సు ఇలా అన్నారు.

*"ఒక మనిషికి ఆహారంగా ఒక చేపను ఇస్తే, ఒక రోజు ఆహారాన్ని మాత్రమే ఇచ్చినట్లు అవుతుంది. అందుకే అతనికి చేపలు పట్టడం నేర్పించు - జీవితాంతం తిండి పెట్టినట్లు అవుతుంది".*

2014-19 కాలంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నైపుణ్యాభివృద్ధి, విద్య మరియు దీర్ఘకాల పరిష్కారాల ప్రాముఖ్యతను అర్థం చేసుకొని అనేక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగింది. ఈ రోజు మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్ నైపుణ్య గణన అనే వినూత్న కాన్సెప్టుకు నాయకత్వం వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా తొలిసారిగా మా ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో నైపుణ్య గణన నిర్వహిస్తోంది. ఇది మన శ్రామిక శక్తి యొక్క నైపుణ్యాలను మరియు సామర్థ్యాలను అర్థం చేసుకోవడానికి, తదనుగుణంగా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను గుర్తించడానికి సహాయపడుతుంది. ఇది 20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అనువైన నైపుణ్యాలను అందించే కార్యక్రమాల రూపకల్పనకు దోహదపడుతుంది.

ఇదే సమయంలో మా ప్రభుత్వం 192 నైపుణ్య కేంద్రాలు, నైపుణ్య కళాశాలలు మరియు నైపుణ్య విశ్వవిద్యాలయాల ద్వారా నైపుణ్య రంగంలో మౌలిక వసరులను బలోపేతం చేస్తోంది. ప్రాధాన్య రంగాలలో విదేశీ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా చేయడమే స్కిల్ ఇంటర్నేషనల్ యొక్క తాజా ప్రయత్నం. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను నైపుణ్యాభివృద్ధి శాఖకు 1,215 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

## పాఠశాల విద్య

ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలలో ఒకటో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు చదివే పిల్లల తల్లులకు తల్లికి వందనం పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ మా ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీని నెరవేరుస్తోంది. పేదరికం కారణంగా ఏ పిల్లవాడూ విద్యకు దూరం కాకూడదు అనేది ఈ పథకం లక్ష్యం. ఇది మధ్యలోనే చదువు మానివేసే పిల్లల సంఖ్యను గణనీయంగా తగ్గించడానికి సహాయపడుతుంది.

పాఠశాలలలో మౌలిక సదుపాయాలను మరియు విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు మా ప్రభుత్వం సమగ్ర సంస్కరణలు చేపడుతోంది. మన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి మరియు విద్యావ్యవస్థలో యువ ఉపాధ్యాయుల నూతన శక్తిని నింపేందుకు, ఖాళీగా ఉన్న 16,347 పోస్టులను భర్తీ చేసే దిశగా మెగా డి.ఎస్.సి. నియామకాన్ని ప్రకటించడం జరిగింది. ఇది మా ప్రభుత్వం తీసుకున్న ప్రధాన నిర్ణయాలలో ఒకటి. ముఖ్యమైన పథకాలకు ప్రముఖ విద్యావేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్ మరియు సామాజిక కార్యకర్త డొక్కా సీతమ్మ పేర్లను మా ప్రభుత్వం పెట్టింది. ఉపాధ్యాయులు బోధనపై మరింత దృష్టి పెట్టేందుకు వీలుగా అనవసరమైన యాప్లను తొలగించడం ద్వారా ఉపాధ్యాయులపై యాప్ భారాన్ని తగ్గించడం జరిగింది. ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు మరియు బ్యాగులు అందించడం జరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పాఠశాల విద్యాశాఖకు 29,909 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

## ఉన్నత విద్య

స్వర్ణాంధ్ర విజన్-2047 లో భాగంగా, మా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయడానికి, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి, జాతీయ సంస్థాగత స్థాయి చట్రం (ఎన్.ఐ.ఆర్.ఎఫ్.)లో అత్యున్నత స్థాయి విశ్వవిద్యాలయాలుగా అవతరించడానికి చొరవ తీసుకుంటోంది. అమరావతి, తిరుపతి మరియు విశాఖపట్నంలలో కనీసం మూడు విజ్ఞాన నగరాలను ఏర్పాటు చేయాలని మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

నాణ్యమైన విద్యకు అత్యంత నైపుణ్యం కలిగిన అధ్యాపకులు అవసరమని గుర్తించి, వచ్చే మూడేళ్లలో 18 వేల మంది అధ్యాపకులకు శిక్షణాభివృద్ధి కార్యక్రమాలను ప్రతిపాదించడం జరిగింది. 2024 డిసెంబర్ నుండి 25 లక్షల మందికి పైగా విద్యార్థులకు వృత్తి శిక్షణను సులభతరం చేయడానికి నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్స్, ఎడ్యుస్కిల్స్, సేలో ఫోర్స్, మైక్రోసాఫ్ట్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలతో ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. సమాచార సాంకేతికత మరియు ఆధారిత రంగాలు, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా సేవలు, వనరులను సమకూర్చే సేవలు, చిల్లర వర్తకము మరియు ఆరోగ్య సంరక్షణ వంటి వివిధ రంగాలలో 5 వేల రూపాయల నుండి 15 వేల రూపాయల మధ్య వేతనాన్ని అందించే అప్రెంటిస్ షిప్ తో కూడిన డిగ్రీ విద్యను మా ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉన్నత విద్యా శాఖకు 2,326 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

## ఆరోగ్య సంరక్షణ

పౌరులకు సరసమైన మరియు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను సకాలంలో అందించడం మా ప్రభుత్వం యొక్క మొదటి ప్రాధాన్యత. 'అందరికీ ఆరోగ్యం' లక్ష్యంగా మా ప్రభుత్వం ఆరోగ్య రంగంలో సమగ్ర సంస్కరణలు చేపడుతోంది. హృదయ సంబంధ వ్యాధులు పెరుగుతున్న దృష్ట్యా, అవసరమైన పరికరాలు మరియు మానవ వనరుల శిక్షణను అందించడం ద్వారా "స్టెమి' ప్రోగ్రాము ప్రారంభించాలని యోచిస్తున్నాము. రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించడం ద్వారా క్యాన్సర్ కేసులను గుర్తించి, వైద్య కళాశాలలలో వైద్యం కోసం చేరే సౌకర్యం కల్పించింది. పాఠశాల ఆరోగ్య కార్యక్రమం క్రింద, అంగన్వాడీ పిల్లలకు మరియు 18 సంవత్సరాలలోపు ఉన్న పాఠశాల విద్యార్థులకు పుట్టుకతో వచ్చిన లోపాలు, పోషకాల లోపం వలన వచ్చే వ్యాధులు, మందకొడి అభివృద్ధి మరియు వైకల్యం అనే నాలుగు రకాల లోపాలను గుర్తించడం కోసం పరీక్షలు చేయబడుతున్నాయి. రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి సాధారణ ఆస్పత్రుల వరకు అన్ని రకాల వైద్య సదుపాయాలను మెరుగుపరచడం జరుగుతోంది.

మా ప్రభుత్వం 'డాక్టర్ ఎన్.టి.ఆర్ వైద్య సేవా ట్రస్ట్' వంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలు, 108 మరియు 104 ఆరోగ్య సేవల పునరుద్ధరణ మరియు జాతీయ ఆరోగ్య మిషన్ క్రింద కుటుంబ సంక్షేమ కార్యక్రమాలను సమగ్రంగా అమలు చేయడం జరుగుతోంది. మాతాశిశు ఆరోగ్య సంరక్షణలో జాతీయ సగటు కంటే మన రాష్ట్ర సగటు మెరుగ్గా ఉంది. తల్లులు మరియు పిల్లల శ్రేయస్సును పెంచే కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా దీనిని మరింత మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటున్నాము. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను వైద్య, ఆరోగ్య శాఖ కోసం 18,421 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

## పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి

మహాత్మాగాంధీ ఇలా అన్నారు...

*"భారతదేశ ఆత్మ గ్రామాలలో ఉంటుంది."*

ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ సమర్ధ నాయకత్వంలో, స్థానిక స్వపరిపాలనను నిజమైన స్ఫూర్తితో ప్రోత్సహించడం ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకురావడానికి ఇప్పటికే మా ప్రభుత్వం చాలా కార్యక్రమాలు చేపట్టింది. ప్రణాళికా ప్రక్రియలో భాగంగా అన్ని గ్రామపంచాయితీల క్రియాశీలక భాగస్వామ్యంతో ఉపాధి హామీ పథకం ఆమోదం కోసం ఆగస్టు 23న ఒకే రోజులో 13,326 గ్రామ పంచాయతీలలో ప్రత్యేక గ్రామసభలను నిర్వహించడం అనేది ప్రపంచ రికార్డు. మన రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో సిమెంట్ రహదారులు ప్రారంభించడంతో కార్యాచరణ ప్రణాళిక అమలు ప్రారంభమైంది. స్వాతంత్ర్య దినోత్సవం మరియు గణతంత్ర దినోత్సవాల నిర్వహణ ఖర్చుల నిమిత్తం చిన్న పంచాయితీలకు 100 రూపాయల నుండి 10 వేల రూపాయలకు, పెద్ద పంచాయితీలకు 250 రూపాయల నుండి 25 వేల రూపాయలకు పెంచి సర్పంచుల ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించటం జరిగింది. స్వర్ణ పంచాయితీల కార్యక్రమం క్రింద పంచాయితీల అభివృద్ధికి ప్రభుత్వం దార్శనిక ప్రణాళికను చేపట్టింది. 2024 మార్చి నుంచి పంచాయితీరాజ్ సంస్థలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులలో 998 కోట్ల రూపాయలను ప్రభుత్వం 2024 ఆగస్టులో విడుదల చేయడం జరిగింది.

గ్రామీణ పేదలకు సుస్థిర జీవనోపాధిని అందించడానికి మరియు గ్రామీణ ప్రాంతాలలో మన్నికైన ఆస్తులను సృష్టించడానికి మా ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద 16 శాఖల సమన్వయంతో వివిధ వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోంది. 2024-25 సంవత్సరంలో ఇప్పటివరకు 1.2 మిలియన్లకు పైగా కుటుంబాలు 100 రోజుల వేతన ఉపాధిని పొందాయి. ఉద్యానవనం, సేద్యపు కుంటలు, పశు సంవర్ధక ఆవాసాలు వంటి ప్రాజెక్టులతో పాటు పైకప్పు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతలు, చెక్ డ్యాంలతో సహా సహజ వనరుల నిర్వహణ ప్రాజెక్టులను చేపట్టడం జరిగింది.

గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి పేద కుటుంబాన్నీ పేదరికం నుండి బయటపడేటట్లు చేసేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం, ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార సంస్థల అధికారీకరణ, ప్రధానమంత్రి స్వనిధి పథకం మరియు ప్రధాన మంత్రి విశ్వకర్మ వంటి వివిధ

- (మిగతా వివరాలు 6లో)



# ఏపీ బడ్జెట్ రూ.2.94 లక్షల కోట్లు



(5వ పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వ రాయితీ పథకాలతో అనుసంధానం చేయడం ద్వారా స్వయం సహాయక బృంద సభ్యుల జీవనోపాధికి మా ప్రభుత్వ కార్యక్రమాలు మద్దతును ఇస్తున్నాయి. ఈ వినూత్న కార్యక్రమాల అమలు ద్వారా స్వయం సహాయక బృంద సభ్యుల ఆదాయాన్ని పెంచడంతోపాటు, అనధికారిక ఉపాధి అవకాశాలను పెంచడం కూడా మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అదనంగా, ఓపెన్ నెట్ వర్క్ డిజిటల్ కామర్స్ (ఒ.ఎన్.డి.సి.)ని ప్రోత్సహించడం ద్వారా, మా ప్రభుత్వం స్వయం సహాయక బృంద మహిళలకు వారి వ్యాపారాలను విస్తరించుకోవడానికి వీలు కల్పిస్తోంది. వారి ఉత్పత్తులను మార్కెట్లకు చేర్చడానికి విస్తృతంగా అవకాశాలను కల్పిస్తూ మరియు వారి అమ్మకాల సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో ఇది వారికి సహాయపడుతుంది. ఈ వ్యూహాత్మక విధానంలో ఆర్థిక సహాయం, నైపుణ్యాభివృద్ధి మరియు డిజిటల్ అవుట్ రీచ్ లు మిళితం అవడంవలన స్వయం సహాయక బృంద సభ్యులు స్థిరమైన ఆదాయ వృద్ధిని పెంపొందించకోగలుగుతారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారుల అనుసంధాన ప్రాజెక్టు ద్వారా 1,574 పనులను పూర్తి చేయడం జరిగింది. ఈ ప్రాజెక్టు 2,134 ఆవాసాలను 2,855 కిలోమీటర్ల రహదారులతో కలుపుతుంది. అదనంగా 164 రహదారులు మరియు వంతెనల ప్రాజెక్టులు కూడా కొనసాగుతున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 16,739 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

## పట్టణాభివృద్ధి

గత ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రాంతాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా పురపాలక సంఘాలలో పారిశుధ్య లోపం మరియు వ్యర్థాల నిర్వహణా లోపం వలన టన్నుల కొద్దీ వ్యర్థాలు మరియు పూడిక పేరుకుపోయాయి. నేడు మా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా సుస్థిర పట్టణాభివృద్ధికి కట్టుబడి ఉంది. విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు తదితర ప్రధాన నగరాలను అభివృద్ధి చేయనున్నాము. 50 వేల నుంచి 99,999 మంది జనాభా ఉన్న రెండో తరగతి పట్టణాలకు భౌగోళిక సమాచార వ్యవస్థ (జి.ఐ.ఎస్.) ఆధారిత బృహత్తర ప్రణాళికల రూపకల్పనకు శ్రీకారం చుట్టడం జరిగింది. అమృత్ 2.0 క్రింద జలవనరుల పునరుద్ధరణ, మురుగు నీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించుకోవడం, వర్షపు నీటి సంరక్షణతోపాటు ప్రజలందరికీ సురక్షిత నీటిని సరఫరా చేయాలని మా ప్రభుత్వం భావిస్తోంది. అన్ని పట్టణ ప్రాంతాలలో పట్టణ మౌలిక సదుపాయాలు మరియు అత్యవసర సేవలకు సేవా స్థాయి ప్రమాణాలను సాధించడానికి ప్రణాళికలు రూపొందించబడ్డాయి.

ఐదేళ్లుగా కనుమరుగైన మన రాష్ట్ర కలల రాజధాని అమరావతి నేడు రూపుదిద్దుకుంటోంది. ప్రపంచ స్థాయిలోనే అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు మరియు ఉద్యోగాలకు ప్రపంచ గమ్యస్థానంగా అమరావతి మారబోతుంది. అత్యంత నివాసయోగ్యమైన, సమర్థవంతమైన మరియు సుస్థిరమైన హరిత నగరంగా అమరావతిని తీర్చిదిద్దేందుకు మా ప్రభుత్వ ప్రణాళికలు దోహదపడ్డాయి. రాజధాని నగరంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి మా ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ద్వారా బహుళపాక్షిక నిధుల సంస్థల నుండి 15 వేల కోట్ల రూపాయల నిధులను పొందడం జరిగింది.

పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్న నిరుపేదలకు సరసమైన ధరలకు ఆహారాన్ని అందించడానికి మా ప్రభుత్వం మొత్తం 123 పట్టణ ప్రాంతాల పరిధిలో 204 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామీణ ప్రాంతాలలో కూడా 158 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధచేయడం జరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు 11.490 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

## గృహనిర్మాణం

2029 నాటికి అందరికీ ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని మా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. 'ప్రధానమంత్రి ఆవాసయోజన (పి.ఎం.ఎ.వై.)- ఎన్.టి.ఆర్. నగరాలు' పథకం క్రింద ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 25 లక్షల ఇళ్ళు/ఇళ్ళ పట్టాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగింది. ఈ నిర్ణయం ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమ కార్యక్రమంగానే కాకుండా రాష్ట్ర ఆర్థిక కార్యకలాపాలకు కూడా ఊతమిస్తోంది. ఈ కార్యక్రమం క్రింద ఇంటి స్థలంకానీ, పక్కా ఇళ్ళు కానీ లేని వారికి ఇళ్ళ స్థలాల పట్టాలు జారీ చేయడం జరుగుతోంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పి.ఎం.ఎ.వై.) (నగరం) క్రింద 6.9 లక్షల ఇళ్ళు ప్రధానమంత్రి ఆవాసయోజన (పి.ఎం.ఎ.వై.) (గ్రామీణ) క్రింద 1.79 లక్షల గ్రామీణ ఇళ్ళను పూర్తి చేయాలని ప్రతిపాదించడం జరిగింది. ప్రధానమంత్రి-జన్ మన్ పథకం క్రింద నిస్సహాయ గిరిజన సమూహాల కోసం 15 వేలకు పైగా గృహాలను పూర్తి చేయాలని ప్రతిపాదించడం జరిగింది. అన్ని శాఖల సమన్వయంతో హౌసింగ్ లేఅవుట్లలో మౌలిక సదు- పాయాలను అభివృద్ధి చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గృహనిర్మాణ శాఖకు 4,012 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

## జలవనరుల నిర్వహణ

సాగునీటి రంగాన్ని గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. వంశధార స్టేజ్-2 (2వ దశ), హంద్రీనీవా సుజల స్రవంతి 2వ దశ, వెలిగొండ ప్రాజెక్టు, తోటపల్లి బ్యారేజీ, గజపతినగరం బ్రాంచ్ కెనాల్, చింతలపూడి ఎత్తిపోతల పథకం, పులిచింతల, గుండ్లకమ్మ రిజర్వాయర్, సోమశిల- స్వర్ణముఖి లింక్ కెనాల్ వంటి సాగునీటి ప్రాజెక్టులలో ఏ ఒక్కదానిలోనూ పురోగతి లేదు. పోలవరం విషయంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు చెందిన పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సలహాలను పట్టించుకోకుండా నిర్మాణం కీలక దశలో ఉన్నప్పుడు ఏజెన్సీని హఠాత్తుగా మార్చడం వలన డయాఫ్రమ్ గోడ కూలి ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగింది. ప్రాజెక్టు ప్రయోజనాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ఆంధ్ర, ఉత్తరాంధ్ర మరియు రాయలసీమ వాసులను ఈ జాప్యం కలవరపెట్టింది.

మా ప్రభుత్వం సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తూ ప్రతి పొలానికీ నీటిని తీసుకెళ్లాలనే లక్ష్యంతో సమగ్ర నూతన జల విధానాన్ని రూపొందించడం జరుగుతోంది. రాష్ట్రాన్ని కరవు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్ది త్రాగు, సాగు మరియు పారిశ్రామిక అవసరాలకు నీటి భద్రతను కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడం జరిగింది. పోలవరం జాతీయ నీటిపారుదల ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడం మా ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత. చింతలపూడి ఎత్తిపోతల పథకం, బొడ్డేపల్లి రాజగోపాలరావు వంశధార ప్రాజెక్టు 2వ దశ, పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు, టి.బి.పి.-హెచ్.ఎల్.సి. వ్యవస్థ మెరుగుదల, చిన్న నీటిపారుదల, వాటర్ షెడ్, భూగర్భ జలాల నిర్వహణలతో సహా నిర్మాణంలో ఉన్న అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. వీటితోపాటు అదనంగా భవనాసి చెరువు మార్పిడి ప్రాజెక్టును మరియు మహేంద్రతనయ ఆఫ్ షోర్ ప్రాజెక్టను చేపట్టాలని మా ప్రభుత్వం భావిస్తోంది. గోదావరి-పెన్నా, నాగావళి-వంశధార నదులను అనుసంధానం చేయటం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నీటి భద్రత కల్పించాలని భావిస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జలవనరుల శాఖకు 16,705 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

## పరిశ్రమలు మరియు వాణిజ్యం

పారిశ్రామికాభివృద్ధికి అనువైన వాతావరణాన్ని కల్పించడంపై మా ప్రభుత్వం దృష్టి సారించింది. పెట్టుబడిదారులను మరియు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించి తద్వారా వివిధ రంగాలలో ఉపాధిని కల్పించే దిశగా నూతన విధానాలను రూపొందించడం జరిగింది. మా ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి పాలసీ 4.0 తీసుకొని రావడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా అభివృద్ధి పాలసీ 4.0 తక్షణమే ఉపయోగించుకునేటట్లుగా (ప్లగ్ అండ్ ప్లే) ప్రైవేట్ పారిశ్రామిక వాడల ఏర్పాటుకు ఒక ప్రత్యేక విధానం, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0 లను మా ప్రభుత్వం తీసుకురావడం జరిగింది. ఈ విధానాలలో పోటీతత్వ ప్రోత్సాహక పద్ధతిని ప్రవేశపెట్టగా, దీనికి పారిశ్రామిక రంగం నుండి సానుకూల స్పందన వచ్చింది. మన రాష్ట్రాన్ని పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చేందుకు పెట్టుబడిదారులలో మా ప్రభుత్వం మళ్ళీ ఆసక్తిని పెంచింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పరిశ్రమలు, వాణిజ్య శాఖకు 3,127 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

## ఇంధన రంగం

గత ప్రభుత్వ విధ్వంస చర్యల ఫలితంగానే ఇంధన రంగం నాశనమైంది. గత ప్రభుత్వం ప్రమాణ స్వీకారోత్సవ వేదిక నుంచే విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించటం ద్వారా ఈ విధ్వంసం ప్రారంభమైనది. ఈ చర్య రాష్ట్ర ఇంధన రంగ పునాదులను కదిలించింది. అంతేకాక ఇంధన రంగ విస్తరణ ప్రణాళికలను విచ్ఛిన్నం చేయడం ద్వారా విద్యుత్ కొరతకు కారణం అయ్యింది. తత్ఫలితంగా అధిక ధరలతో విద్యుత్ను కొనుగోలు చేయవలసి వచ్చింది. అంతిమంగా గత ప్రభుత్వ తప్పిదాల వలన నేడు వినియోగదారులు ట్రూ అప్ ఛార్జీల పేరుతో విద్యుత్ కోసం అధిక ధర చెల్లించాల్సి వస్తోంది.

ఈ నష్టాన్ని పూడ్చడానికి, వినియోగదారులకు తక్కువ ఖర్చుతో, వారంలో అన్ని రోజులూ 24 గంటలపాటు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ను సరఫరా చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. రాష్ట్రంలో సుస్థిరత, ఇంధన పరివర్తన మరియు క్లీన్ ఎనర్జీ సాంకేతికతలను ప్రోత్సహించేందుకు నూతన సమగ్ర ఆంధ్రప్రదేశ్ సమీకృత క్లీన్ ఎనర్జీ విధానం-2024ను ప్రకటించడం జరిగింది. పునరుత్పాదక ఇంధనం, పంప్డ్ స్టోరేజ్ పవర్, హరిత హైడ్రోజన్ మరియు దాని ఉత్పన్నాలను ప్రోత్సహించడానికి కొత్త విధానం మార్గాన్ని సుగమం చేస్తుంది. అంతేగాక రాష్ట్రాన్ని పెట్టుబడులను ఆకర్షించే గమ్యస్థానంగా కూడా మారుస్తుంది. మా ప్రభుత్వం ఆక్వా రైతులకు తక్కువ ధరకే విద్యుత్ను సరఫరా చేస్తూ, షెడ్యూల్డ్ కులాల మరియు షెడ్యూల్డ్ తెగల వారి కాలనీలలో ప్రతి ఇంటికీ నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ను అందిస్తోంది. ధోబీ ఘాట్లకు అలాగే దారిద్ర్యరేఖకు దిగువనున్న రజక సామాజిక వర్గము వారు నిర్వహిస్తున్న లాండ్రీలకు, దారిద్ర్యరేఖకు దిగువనున్న నాయీబ్రాహ్మణుల క్షౌరశాలలకు, దారిద్ర్యరేఖకు దిగువనున్న స్వర్ణకారుల దుకాణాలకు, దారిద్ర్యరేఖకు దిగువనున్న అత్యంత వెనుకబడిన కులాలకు మరియు చేనేత కార్మికులకు ఉచితంగా లేదా రాయితీపై విద్యుత్ అందించ బడుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఇంధన శాఖకు 8,207 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

## రవాణా, రోడ్లు మరియు భవనాలు

రహదారుల నిర్వహణ మరియు మరమ్మత్తుల విషయంలో గత పాలకులు నిర్లక్ష్యం వహించడం వలన రాష్ట్రంలో రహదారుల కంటే గుంతలే ఎక్కువగా ఉన్నాయి. ఏళ్ల తరబడి నడుస్తున్న మౌలిక సదుపాయాల పురోగతికి విఘాతం కలిగింది. ఒకప్పుడు 2019 నాటికి నాణ్యమైన రహదారుల అనుసంధానత ఉన్న మన రాష్ట్రం, 2024 నాటికి గుంతల మయమైన రహదారులతో సతమతమవుతోంది. సంక్రాంతి నాటికి రాష్ట్రంలోని అన్ని రహదారులు గుంతలు లేకుండా ఉండాలనే లక్ష్యంతో, మన ముఖ్యమంత్రి గుంతలు లేని రహదారుల ఆంధ్ర అనే మిషన్కు శ్రీకారం చుట్టారు. వీటి పునర్నిర్మాణ ప్రయత్నాలు జరుగుతున్నాయి. అనుసంధానతను మరింత బలోపేతం చేయడానికి, గతి శక్తి కార్యక్రమానికి అనుగుణంగా రాష్ట్ర రహదారి మౌలిక సదుపాయాలను జాతీయ గ్రిడ్తో మా ప్రభుత్వం అనుసంధానం చేస్తోంది.

అమరావతి అవుటర్ రింగు రోడ్డు ప్రాజెక్టు గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయింది. 189 కిలోమీటర్ల పొడవైన అమరావతి అవుటర్ రింగు రోడ్డు ఎక్స్ప్రెస్-వే పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు రాజధానిని రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానిస్తుంది. ఈ ప్రాజెక్టు మన రాష్ట్రంలో ప్రాంతీయ అనుసంధానతను మరియు ఆర్థిక అభివృద్ధిని పెంచుతుంది.

మన రాష్ట్రంలో 687 కిలోమీటర్ల మేర ఆరు వరుసల జాతీయ రహదారి ప్రాజెక్టుల పనులు ఎంతో పురోగతిలో ఉన్నాయి. వీటిలో బెంగళూరు-కడప-విజయవాడ, రాయపూర్ - విశాఖపట్నం, చిత్తూరు-థాట్పూరు, రేణిగుంట- నాయుడుపేట, విజయవాడ పశ్చిమ బైపాస్, నాయుడుపేట- తుర్పు కనుపూరు వంటి ముఖ్యమైన రహదారులు ఉన్నాయి. వీటితో పాటు నాలుగు వరుసల జాతీయ రహదారులైన హైదరాబాద్- విశాఖపట్నం, బెంగళూరు - చెన్నై ఎక్స్ప్రెస్ రహదారులలో 165 కిలోమీటర్ల మేర పనులు పురోగతిలో ఉన్నాయి.

న్యూ డెవలప్ మెంట్ బ్యాంక్ ఆర్థిక సహకారంతో మండల అనుసంధానత మరియు గ్రామీణ అనుసంధానత అభివృద్ధి ప్రాజెక్టు మరియు ఆంధ్రప్రదేశ్ రహదారులు మరియు వంతెనల పునర్నిర్మాణ ప్రాజెక్టులను మా ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ ప్రాజెక్టులు జిల్లా ప్రధాన కేంద్రాలు మరియు మండల కేంద్రాల మధ్య, అదేవిధంగా అన్ని మండల కేంద్రాల మధ్య రెండు వరసల రహదారుల అనుసంధానతను కల్పించడానికి 2,522 కిలోమీటర్ల రహదారులను ఈ పరిధిలోనికి తీసుకువస్తాయి.

వాహనాలు త్వరితగతిన నడిచేందుకు వీలుగా ప్రధానమైన జిల్లా రహదారుల ఉపరితలాన్ని మెరుగుపరచడానికి 2,199 కిలోమీటర్ల మేర పనులను మంజూరు చేయడం జరిగింది. వీటిని 2025 మార్చి నాటికి పూర్తి చేయాలని మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గిరిజన ప్రాంతాలలో అనుసంధానతను మెరుగుపరచడం కోసం మరియు వరదల వలన దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేయడం కోసం, 99 రాష్ట్ర రహదారులు మరియు 134 జిల్లా ప్రధాన రహదారులను జాతీయ వ్యవసాయ మరియు గ్రామీణ అభివృద్ధి బ్యాంకు (నాబార్డు) నిధులతో పూర్తి చేయడానికి మా ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోంది.

2024 జూన్ నుంచి మా ప్రభుత్వం రహదారుల రంగానికి 600 కోట్ల రూపాయలు విడుదల చేసింది. రాష్ట్ర విపత్తు నివారణ నిధి (ఎస్.డి.ఆర్.ఎఫ్.) మరియు రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధుల (ఎస్.డి.ఎమ్.ఎఫ్.) క్రింద కేటాయింపులతో సహా 2024-25 ఆర్థిక సంవత్సరానికి రవాణా, రోడ్లు మరియు

- (మిగతా వివరాలు 7లో)



# ఏపీ బడ్జెట్ రూ.2.94 లక్షల కోట్లు



(6వ పేజీ తరువాయి)

భవనాల శాఖకు 9,554 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

## యువజన, పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ, క్రీడలు

మన రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్నారు. మా ప్రభుత్వం క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలలో 3 శాతం రిజర్వేషన్లను ప్రకటించింది. ఇది దేశంలోనే అత్యధికం. మా ప్రభుత్వం ప్రతిపాదించిన ఆర్థిక ప్రోత్సాహకాలు కూడా దేశంలోనే అత్యధికం. అందరికీ క్రీడలు, ప్రతిభను పెంపొందించడం, స్పోర్ట్స్ ఎకోసిస్టమ్, క్రీడా సంస్కృతిని మరియు పర్యావరణ వ్యవస్థను క్షేత్రస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు బలోపేతం చేయడం అనే నాలుగు వ్యూహాత్మక స్తంభాలతో కొత్త క్రీడా విధానాన్ని 2024-29 కాలానికి మా ప్రభుత్వం తీసుకువస్తోంది. ఆర్థిక మరియు సామాజిక అభివృద్ధి కోసం క్రీడలను ప్రోత్సహించడం మరియు ఆరోగ్యకరమైన జీవనం కోసం క్రీడలను ప్రజా ఉద్యమంగా మార్చడంపై మా ప్రభుత్వ క్రీడల విధానం దృష్టి సారిస్తుంది.

ముఖ్యమంత్రి పర్యాటక రంగానికి పరిశ్రమ హెూదాను కల్పించారు. ఇది ఒక చారిత్రాత్మక చర్య. ఇది ప్రైవేట్ పెట్టుబడులను గణనీయంగా ఆకర్షించే విధంగా రాష్ట్ర సామర్థ్యాన్ని మరింత పెంచింది. మన రాష్ట్రంలోని పర్యాటక రంగం ఉద్యోగాల కల్పనకు ఒక గొప్ప వరం. ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యాటక రంగాన్ని అభివృద్ధిచేయడానికి మా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. పర్యావరణ మరియు వివిధ పర్యాటక ప్రదేశాలను ఏకకాలంలో అనుసంధానించే విధంగా పరిక్రమ పర్యాటక రంగాన్ని, సముద్రతీర పర్యాటక కేంద్రాలను, ఆరోగ్య పర్యాటక కేంద్రాలను మరియు చారిత్రక వారసత్వ ప్రదేశాలను అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడాన్ని మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి యువజన, పర్యాటక మరియు సాంస్కృతిక శాఖకు 322 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

## పోలీస్ శాఖ

గత అయిదేళ్లలో పోలీసు శాఖను నిర్లక్ష్యం చేయడంవలన, ఆ శాఖ నైతిక స్థయిర్యం మరియు నిర్వహణ సామర్థ్యం తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా తగినన్ని అలవెన్సులు లేకపోవడం వలన మరియు ఉద్యోగుల బకాయిలను చెల్లించకపోవడం వలన, పోలీస్ శాఖ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురిఅయ్యారు. వాహనాల లభ్యత తక్కువగా ఉండటం, గస్తీ వాహనాలకు నిర్వహణ లేకపోవడం మరియు పోలీసు బలగాలను తక్కువ వనరులతో నడిపించడం వలన, వారు ఎంతో ఒత్తిడికి లోనయ్యారు. ఇది ప్రజా అవసరాల కోసం వేగంగా మరియు సమర్థవంతంగా స్పందించే వారి సామర్థ్యానికి ఆటంకం కలిగించింది. సి.సి. కెమెరాల నిర్వహణ వంటి సాధారణ పనులకు కూడా గత ప్రభుత్వం నిధులను అవసరమైనంత మేరకు విడుదల చేయలేదు. ఈ క్లిష్టమైన సమస్యలను గుర్తించిన మా ప్రభుత్వం ఆధునికీకరణ మరియు సమకాలీన సవాళ్ళకు ధీటుగా పోలీస్ శాఖను సన్నద్ధం చేయడంపై దృష్టి సారించి ఈ శాఖ సామర్థ్యాలను పునరుద్ధరించడానికి మరియు పెంచడానికి నిర్ణయాత్మక చర్యలు చేపట్టింది.

నూతన వాహనాలు మరియు అధునాతన పరికరాల కొనుగోలుకు, మౌలిక వసతుల కల్పనకు మరియు పోలీసు బలగాల ఆధునీకరణకు మా ప్రభుత్వం 62 కోట్ల రూపాయల నిధులను విడుదల చేసింది. పోలీస్ శాఖకు పూర్వ వైభవం తీసుకురావడానికి గౌరవ ముఖ్యమంత్రిగారు సమూల మార్పునకు ఆమోదం తెలిపారు. శ్రీకాకుళం, చిత్తూరు, ప్రకాశం మరియు రాజమహేంద్రవరంలలో కొత్తగా నాలుగు ప్రత్యేక పోలీస్ బెటాలియన్లను ఏర్పాటు చేయడం జరుగుతోంది. అంతేగాక 300 మంది మహిళా సహాయ డెస్క్ ను మరియు సైబర్ నేరాలను అరికట్టడానికి ప్రతీ జిల్లాలో సైబర్ పోలీస్ స్టేషన్లను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరుగుతోంది. మాదకద్రవ్యాల కేసుల సత్వర పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా 13 ఫాస్ట్ ట్రాక్ ఎన్.డి.పి.ఎస్. కోర్టులను ఏర్పాటు చేస్తున్నాము. ఆధునికీకరించబడిన మరియు తక్షణమే ప్రతిస్పందించగలిగే సమర్థవంతమైన పోలీసు దళాలను పునర్నిర్మించే దిశగా చేపట్టిన ఈ చర్యలు మా ప్రభుత్వపు నిబద్ధతను సూచిస్తాయి.

గత ప్రభుత్వ హయాంలో యువతలో గంజాయి వాడకం విపరీతంగా పెరిగింది. ఆ సమయంలో దేశంలో పట్టుబడిన మాదకద్రవ్యాల మూలాలు మన రాష్ట్రంలో ఉండటం సిగ్గుచేటు. అధ్యక్షా! మాదకద్రవ్యాల విస్తృత వినియోగ వ్యతిరేక కార్యక్రమాలలో భాగంగా మా ప్రభుత్వం మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక టాస్క్ ఫోర్స్ను ఏర్పాటు చేసింది. విద్యార్థులు గంజాయి మరియు పొగాకు వాడకుండా ఉండేందుకు వారిలో అవగాహన పెంచే సమగ్ర కార్యక్రమాలను ప్రవేశపెట్టడం జరిగింది. ఈ మాదకద్రవ్యాలు మరియు పొగాకు వ్యతిరేక కార్యక్రమాలలో క్రియాశీలక పాత్ర పోషించేందుకు ఉన్నత విద్యా సంస్థలలోని 3,172 యూనిట్లకు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని సభకు తెలియచేస్తున్నాను. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను పోలీస్ శాఖకు 8,495 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

పర్యావరణం, అటవీ మరియు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం

జాతీయ ప్రమాణాలకు దీటుగా పచ్చదనాన్ని మెరుగుపరచడం ద్వారా పౌరులకు సుస్థిర జీవన ఆవాసాల కల్పనకు మా ప్రభుత్వం కృషిచేస్తోంది. ఈ దిశగా వనం-మనం, ప్రకృతి పిలుస్తోంది. తీర ప్రాంత ఆవాసాల అభివృద్ధికి మడ అడవుల పెంపకం మొదలైన పథకాల ద్వారా స్థిరమైన ఆదాయ కల్పన జరుగుతోంది. అన్ని శాఖల మరియు వివిధ వర్గాల ప్రజల భాగస్వామ్యం మరియు కేంద్ర, రాష్ట్ర పథకాల నిధుల సమీకరణ ద్వారా ఇది జరుగుతోంది. పరిశుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన నగరాల కోసం బహిరంగ ప్రదేశాలలో పచ్చదనాన్ని ఇచ్చే నగర వనాలను నిర్వహించడం మరియు విస్తరించడం ద్వారా వాతావరణ మార్పులను తట్టుకునే నగరాలను అభివృద్ధి చేయడానికి నగరవనం పథకాన్ని మా ప్రభుత్వం అమలు చేస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను పర్యావరణ, అటవీ, శాస్త్ర, సాంకేతిక శాఖకు 687 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

## 2022-23 ఖాతాలు:

ఆంధ్రప్రదేశ్ అకౌంటెంట్ జనరల్ ఖరారు చేసిన ఆర్థిక లెక్కల ప్రకారం 2022-23 ఆర్థిక సంవత్సరానికి రెవెన్యూ లోటు 43,488 కోట్ల రూపాయలు మరియు ద్రవ్యలోటు 52,509 కోట్ల రూపాయలుగా పేర్కొంది. రెవెన్యూ లోటు మరియు ద్రవ్యలోటు వరుసగా 3.3 శాతంగానూ, 3.98 శాతంగానూ ఉన్నాయి.

## 2023-24 సవరించిన అంచనాలు

సవరించిన అంచనాల ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరానికి రెవెన్యూ వ్యయం 2,12,450 కోట్ల రూపాయలు కాగా మూలధన వ్యయం 23,330 కోట్ల రూపాయలు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటు దాదాపు 38,682 కోట్ల రూపాయలు కాగా, ఇదే కాలానికి ద్రవ్యలోటు దాదాపు 62,720 కోట్ల రూపాయలు. ఇవి రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పత్తి (జి.ఎస్.డి.పి.) లో వరుసగా 2.65 శాతంగానూ మరియు 4.30 శాతంగానూ ఉన్నాయి.

## 2024-25 బడ్జెట్ అంచనాలు

2024-25కు సంబంధించి నేను 2,94,427.25 రూపాయల వ్యయాన్ని ప్రతిపాదిస్తున్నాను. ఇందులో రెవెన్యూ వ్యయం అంచనా 2,35,916.99 కోట్ల రూపాయలు మరియు మూలధన వ్యయం అంచనా 32,712.84 కోట్ల రూపాయలు. అదే కాలానికి రెవెన్యూ లోటు 34,743.38 కోట్ల రూపాయలు మరియు ద్రవ్య లోటు 68,742.65 కోట్ల రూపాయలుగా ప్రతిపాదిస్తున్నాను. రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పత్తి (జి.ఎస్.డి.పి.) లో రెవెన్యూ లోటు 4.19 శాతంగానూ మరియు ద్రవ్యలోటు 2.12 శాతంగానూ ఉండవచ్చు.

## ముగింపు

నేను ముందే చెప్పినట్లుగా మన రాష్ట్ర ప్రగతి పునఃప్రారంభానికి మరియు పునర్నిర్మాణానికి ఈ బడ్జెట్ తొలి మెట్టు. తమతమ కుటుంబాలలోని ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం, విద్య, జ్ఞానం, నైపుణ్యం మరియు సంపదలు కలగాలని

ప్రతి కుటుంబం కలలు కంటుంది. ఈ కలలు సాకారం అవ్వడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. మన రాష్ట్ర ప్రజలు వారి ఆశలు నెరవేర్చు-కునేటందుకు అపూర్వమైన తీర్పును ఇచ్చారు. ప్రజలు మేము ఇచ్చిన హామీలపై నమ్మకం ఉంచారు. ఈ హామీలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మా ప్రభుత్వంపై ఉంది. మా ప్రభుత్వం ముందున్న ఈ సవాళ్లను గౌరవ ముఖ్యమంత్రిగారి నాయకత్వంలో మేము అధిగమించగలమని విశ్వసిస్తున్నాము. స్వర్ణాంధ్రలో జీవించాలనే ప్రజల ఆశలను సాకారం చేయడానికి మా ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాను.

'సరళమైన ప్రభుత్వం - ప్రభావవంతమైన పాలన' అనే సూత్రంతో పాలనను క్రమబద్ధీకరించడమే మా ప్రభుత్వ లక్ష్యం. స్వామి వివేకానందుడి స్ఫూర్తిదాయకమైన మాటలతో నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను.

*"మనం ఎలా ఉన్నామో దానికి మనమే బాధ్యులం. మనం ఎలా ఉండాలనుకున్నా అలా మనల్ని మనం తయారుచేసుకునే శక్తి మనకుంది. మనం ఇప్పుడు ఉన్నది మన గత చర్యల ఫలితమైతే, భవిష్యత్తులో మనం ఏమి కావాలనుకుంటున్నామో అది మన ప్రస్తుత చర్యల ద్వారా ఖచ్చితంగా నిర్ణయించబడుతుంది. కాబట్టి ఎలా నడుచుకోవాలో మనం తెలుసుకోవాలి."*

ఈ మాటలతో నేను ఇప్పుడు బడ్జెట్ను సభామోదం కోసం సమర్పిస్తున్నాను.




ఏపీ వార్షిక బడ్జెట్ 2024-25 : రెవెన్యూ వ్యయం అంచనా

**రూ.2.34 లక్షల కోట్లు**

| | |
|---|---|
| మూలధన వ్యయం అంచనా | రూ.32,712 కోట్లు |
| రెవెన్యూ లోటు | రూ.34,743 |
| ద్రవ్యలోటు | రూ.68,743 కోట్లు |
| జీఎస్డీపీలో రెవెన్యూ లోటు అంచనా | 4.19 శాతం |
| జీఎస్డీపీలో ద్రవ్య లోటు అంచనా | 2.12 శాతం |
| ఉన్నత విద్య | రూ.2,326 కోట్లు |
| ఆరోగ్య రంగం | రూ.18,421 కోట్లు |
| పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి | రూ.16,739 కోట్లు |
| పట్టణాభివృద్ధి | రూ.11,490 కోట్లు |
| గృహ నిర్మాణం | రూ.4,012 కోట్లు |
| జలవనరులు | రూ.16,705 కోట్లు |
| పరిశ్రమలు, వాణిజ్యం | రూ.3,127 కోట్లు |

| | |
|---|---|
| ఇంధనరంగం | రూ.8,207 కోట్లు |
| రోడ్లు, భవనాలు | రూ.9,554 కోట్లు |
| యువజన, పర్యాటక, సాంస్కృతికశాఖ | రూ.322 కోట్లు |
| పోలీసు శాఖ | రూ.8,495 కోట్లు |
| పర్యావరణం, అటవీశాఖ | రూ.687 కోట్లు |
| ఎస్సీ సంక్షేమం | రూ.18,497 కోట్లు |
| ఎస్టీ సంక్షేమం | రూ.7,557 కోట్లు |
| బీసీ సంక్షేమం | రూ.39,007 కోట్లు |
| మైనార్టీ సంక్షేమం | రూ.4,376 కోట్లు |
| మహిళ, శిశుసంక్షేమం | రూ.4,285 కోట్లు |
| నైపుణ్యాభివృద్ధి శాఖ | రూ.1215 కోట్లు |

చైతన్యరథం

# రైతులు ఒక్కొక్కరి ఖాతాలో రూ.20వేలు..

## అన్నదాత సుఖీభవ పథకంపై మంత్రి అచ్చెన్న కీలక ప్రకటన

- సాగుకు దన్నుగా..
- అన్నదాతకు అగ్రతాంబూలం
- రూ. 43,402 కోట్లతో వ్యవసాయ బడ్జెట్
- రైతు కుటుంబాల్లో సంతోషమే సీఎం చంద్రబాబు ధ్యేయమని ఉద్ఘాటన



అమరావతి (చైతన్యరథం): దేశానికే అన్నపూర్ణగా పేరుగాంచిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నూ, దన్నూ వ్యవసాయమే. 62 శాతం జనాభాకు వ్యవసాయం, అనుబంధ రంగాలే ఆధారం. గత ప్రభుత్వం వ్యవసాయాన్ని గాలికొదిలేయగా కూటమి ప్రభుత్వం మాత్రం అన్నదాతకు బాసటగా నిలుస్తోంది. సోమవారం శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి చేసిన కేటాయింపులు అందుకు అద్దం పడుతున్నాయి. ఏపీ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సోమవారం ముందుగా ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రూ.2.94 లక్షల కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. తరువాత రూ.43,402.33 కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టారు. ప్రముఖ కవి గుర్రం జాషువా రైతు గురించి రాసిన పద్యంతో వ్యవసాయ బడ్జెట్ ప్రసంగం ప్రారంభించిన మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంతో వ్యవసాయ రంగానికి సీఎం చంద్రబాబు నాయుడు పెద్దపీట వేస్తున్నారన్నారు. రైతు కుటుంబాల్లో సంతోషం నింపేందుకు ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. అందుకు నిర్దిష్ట ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధే.. లక్ష్యంగా వ్యవసాయ బడ్జెట్ రూపొందించామని తెలిపారు. రైతుల పరిస్థితి మారాలని, రైతే రాజు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షిస్తున్నారన్నారు. ఆరుగాలం ఇంటిల్లిపాదీ శ్రమించి ప్రపంచానికి అన్నం పెట్టే రైతన్నకు మనసా, వాచా, కర్మణా శిరస్సు వంచి పాదాభివందనం జేస్తున్నా. అంధకారం అనే అగాధంలో పడిపోతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నడిపించేందుకు దార్శనికత కలిగిన నాయకుడు కావాలనే ప్రజలు చంద్రబాబును గెలిపించారన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో సంకీర్ణ ప్రభుత్వం 'సూపర్ సిక్స్' కార్యక్రమం కింద రైతులకు 'అన్నదాత సుఖీభవ.. పీఎం కిసాన్ పథకం'లో ఏడాదికి రూ. 20 వేల చొప్పున (పీఎం కిసాన్ పథకం కింద కేంద్రం అందించే రూ. 6000 ప్రయోజనంతో కలిపి)ఆర్థిక సహాయం ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ పథకం అమలుకు రూ.4,500 కోట్లు ప్రతిపాదించామన్నారు రాష్ట్రంలోని భూమిలేని సాగుదారులందరికీ ఆర్థిక సహాయం సంవత్సరానికి రూ.20 వేల చొప్పున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపు నుంచి అందిస్తామన్నారు. ఈ అన్నదాత సుఖీభవ పథకం విధివిధానాలు, మార్గదర్శకాలపై ప్రభుత్వం త్వరలో ఆదేశాలు జారీ చేస్తుందని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వ్యవసాయం వెన్నెముక లాంటిది. ఏపీలో వ్యవసాయం, అనుబంధ రంగాలపై 62 శాతం మంది ప్రజలు ఆధారపడ్డారు. గత ఐదేళ్లపాటు భూసార పరీక్షలను వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. కనీసం రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందించలేదు. వైసీపీ హయాంలో పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వలేదు. రైతులకు అండగా నిలవాల్సిన సమయంలో బాధ్యతను గాలికి వదిలేశారు. గతేదాది కరవు ప్రాంతాల్లో పంటల బీమా అందించేందుకు కూడా వైసీపీ ప్రభుత్వానికి మనసు రాలేదని అచ్చెన్నాయుడు అన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రైతు అభ్యున్నతే లక్ష్యంగా భావించింది. అందుకే వ్యవసాయ రంగం మేలుకు సంబంధించి అనేక చర్యలు చేపట్టింది. భూసార పరీక్షా పత్రాల జారీ, పొలం పిలుస్తోంది వంటి కార్యక్రమాలు చేపట్టాం. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన, శిక్షణ కల్పిస్తున్నాం. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశాం. వడ్డీ లేని రుణాలు, భూసార పరీక్షలకు ప్రాధాన్యమిస్తాం. రిమోట్ సెన్సింగ్ సాంకేతికతతో భూసార పరీక్షలు నిర్వహిస్తాం. అలాగే మట్టి నమూనాల కోసం ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తాం. సాగుకు సూక్ష్మ పోషకాలు అందిస్తాం. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం.. వ్యవసాయ రంగానికి నిర్దిష్ట ప్రణాళిక అవసరం. ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షాలు బాగా కురిసి పంటలు దెబ్బతిన్నాయి. పంట నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీ సాయం పెంచాం. రైతులకు నెల రోజుల్లోనే నగదు చెల్లించేందుకు కంటీ మీద కునుకు లేకుండా పని చేశాం. పెట్టుబడి సాయం పెంచి నెల రోజుల్లోనే రైతులకు అందించామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు.

వ్యవసాయ బడ్జెట్‌లో డిజిటల్ వ్యవసాయానికి రూ.44.77 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.187.68 కోట్లు, వడ్డీలేని రుణాలకు రూ.628 కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.4500 కోట్లు, రైతు సేవా కేంద్రాలకు రూ.26.92 కోట్లు కేటాయించారు. భూసార పరీక్షలకు రూ.38.88 కోట్లు, విత్తనాలు పంపిణీకి రూ.240 కోట్లు, ఎరువుల సరఫరాకు రూ.40 కోట్లు, పొలం పిలుస్తోందికి రూ.11.31 కోట్లు, ప్రకృతి వ్యవసాయానికి రూ.422.96 కోట్లు కేటాయించినట్లు మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు.

ప్రాథమిక పరపతి సంఘాల ద్వారా తక్కువ ధరకే ఎరువుల పంపిణీ చేస్తున్నామని వివరించారు. అలాగే 2024-25లో ప్రభుత్వం వ్యవసాయ రుణాల కోసం రూ.2,64,000 కోట్లు (పంట రుణాల కింద రూ. 1లక్ష 66 వేల కోట్లు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల కింద రూ. 98 వేల కోట్లు) అందించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇప్పటివరకు పంట రుణాల కింద రూ.1,03,649 కోట్లు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలతో సహా వ్యవసాయ టర్మ్ రుణాల కింద రూ.66,148 కోట్లు మొత్తం రూ.1,69,797 కోట్లు పంపిణీ చేశారన్నారు.

కౌలు రైతులకు తమ ప్రభుత్వం 9.08 లక్షల పంట సాగుదారుల హక్కుల కార్డుల్ని (సీసీఆర్‌సీ) జారీ చేసిందన్నారు. తద్వారా కౌలు రైతులకు 11 నెలల పాటు పంటపై హక్కులను కల్పించడం, పంట రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత పొందేందుకు వీలు కల్పించిందన్నారు. 2024-25లో సం.లో సీసీఆర్‌సీలు పొందిన కౌలు రైతులకు రూ. 1443 కోట్ల పంట రుణాలు పంపిణీ చేశామన్నారు. అలాగే అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడానికి.. అర్హులైన కౌలు దారులందరికీ కౌలుదారు గుర్తింపు కార్డులను జారీ చేసేందుకు కొత్త సాగుదారుల హక్కుల చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది అన్నారు.

రూ.3 లక్షల వరకు పంట రుణాలు పొంది, నిర్ణీత వ్యవధి ( ఒక ఏడాది)లో తిరిగి చెల్లించే అర్హులైన రైతులందరికీ 2024-25 నుంచి వడ్డీ లేని రుణాలు, పావలా వడ్డీ పథకం కింద వడ్డీ రాయితీ అందించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వడ్డీ రాయితీ నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. చిన్న సన్నకారు రైతులతో పాటు వాస్తవ సాగుదారులకు ఆర్థిక భారాన్ని తగ్గించడం, రైతులను అప్పుల ఊబిలో పడకుండా కాపాడటం ఈ పథకం ముఖ్యఉద్దేశ్యం అన్నారు.

**2024-25 వ్యవసాయ బడ్జెట్ - రూ.43,402.33 కోట్లు**

| | | |
|---|---|---|
| వ్యవసాయశాఖ | - | రూ.8,564 కోట్లు |
| అన్నదాత సుఖీభవ | - | రూ.4,500 కోట్లు |
| ఉద్యానశాఖ | - | రూ.3,469 కోట్లు |
| వ్యవసాయ యాంత్రీకరణ | - | రూ.187.68 కోట్లు |
| వడ్డీ లేని రుణాలు | - | రూ.628 కోట్లు |
| రైతు సేవా కేంద్రాలు | - | రూ.26.92 కోట్లు |
| ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్ | - | రూ.44.03 |
| పంటల బీమా | - | రూ.1,023 కోట్లు |
| పట్టు పరిశ్రమలు | - | రూ.108 కోట్లు |
| వ్యవసాయ మార్కెటింగ్ | - | రూ.314.80 కోట్లు |
| సహకార శాఖ | - | రూ.308.26 కోట్లు |
| పొలం పిలుస్తోంది కార్యక్రమం | - | రూ.11.31 కోట్లు |
| రాయితీ విత్తనాలు | - | రూ.240 కోట్లు |
| ఎరువుల సరఫరా | - | రూ.40 కోట్లు |
| ప్రకృతి వ్యవసాయం | - | రూ.422.96 కోట్లు |
| డిజిటల్ వ్యవసాయం | - | రూ.44.77 కోట్లు |
| ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ | - | రూ.507 కోట్లు |
| ఉద్యాన వర్సిటీ | - | రూ.102.22 కోట్లు |
| ఎస్వీ పశు విశ్వవిద్యాలయం | - | రూ.171.72 కోట్లు |
| మత్స్య విశ్వవిద్యాలయం | - | రూ.38 కోట్లు |
| పశుసంవర్ధకశాఖ | - | రూ.1095.71 కోట్లు |
| మత్స్యరంగ అభివృద్ధి | - | రూ.521.34 కోట్లు |
| వ్యవసాయ ఉచిత విద్యుత్ | - | రూ.7,241.30 కోట్లు |
| ఉపాధి హామీ అనుసంధానం | - | రూ.5,150 కోట్లు |



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సోమవారం భేటీ అయ్యారు. తిరుమల పవిత్రత, సంప్రదాయాల పరిరక్షణ, హైందవ ధర్మంపై చర్చించారు.



ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో మంత్రి నారా లోకేష్‌ను సోమవారం మర్యాద పూర్వకంగా కలిసిన టీటీడీ ఛైర్మన్ బి ఆర్ నాయుడు.

### మంత్రి నారాయణకు
## పట్టాభిరాం ధన్యవాదాలు

అమరావతి (చైతన్యరథం): స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులపై కొమ్మారెడ్డి పట్టాభిరాం సోమవారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి పొంగూరు నారాయణను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టాభిని మంత్రి నారాయణ అభినందించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో ఒక విభాగంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పనిచేస్తున్న విషయం తెలిసిందే.



# 15శాతం వృద్ధి రేటు లక్ష్యం

- అందుకు అనుగుణంగానే ప్రభుత్వ ప్రణాళికలు
- అవకాశాల కల్పనతోనే సంపద సృష్టి సాధ్యం
- స్పష్టం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047పై టాస్క్‌ఫోర్స్‌తో భేటీ
- లక్ష్య సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై లోతైన చర్చ
- విజన్ డాక్యుమెంట్‌పై పారిశ్రామికవేత్తలతో మేధోమథనం



స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ -2047 రూపకల్పనపై సచివాలయంలో పారిశ్రామికవేత్తలు, టాస్క్‌ఫోర్స్ సభ్యులతో సమావేశమైన సీఎం చంద్రబాబు. సమావేశంలో పాల్గొన్న సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, మంత్రులు, రాష్ట్రాధికార్లు

అమరావతి (చైతన్య రథం): రానున్న రోజుల్లో 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా ప్రభుత్వ ప్రణాళికలు అమలు చేసి ఫలితాలు సాధిస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. అవకాశాల కల్పనతోనే సంపద సృష్టి సాధ్యమవుతుందని...తద్వారా వచ్చిన సంపదను పేద వర్గాలకు పంచి ప్రజల జీవన ప్రమాణాలు పెంచవచ్చని సీఎం అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 13.5 శాతం వృద్ధి రేటు సాధించామని.. నేడు 15 శాతం వృద్ధి రేటు సాధిస్తామని సీఎం విశ్వాసం వ్యక్తం చేశారు. దీనికి అసవరమైన ప్రణాళికలు, పాలసీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047పై సచివాలయంలో పారిశ్రామికవేత్తలతో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. విజన్ 2047 లక్ష్యాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై పారిశ్రామిక దిగ్గజాలతో ముఖ్యమంత్రి మేధోమథనం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన విజన్ 2047పై ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ తొలి సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. టాస్క్ ఫోర్స్ కమిటీ చైర్మన్‌గా సీఎం చంద్రబాబు,కో ఛైర్మన్‌గా టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ ఉన్నారు. సచివాలయంలో టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశానికి రాష్ట్ర మంత్రులు, సీఐఐ ప్రతి నిధులు, రాష్ట్ర ప్రభుత్వాధికారులు, పారిశ్రామిక రంగ ప్రముఖులు హాజరయ్యారు. విజన్ 2047పై ప్రభుత్వ ఆలోచనలు, పాలసీలను చంద్రబాబువారితో పంచుకున్నారు. వివిధ రంగాల్లో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పారిశ్రామిక వేత్తల అభిప్రాయాలు, సలహాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఉత్తమ పాలసీలపై తన ఆలోచనలు, అనుభవాలు చెప్పారు. "ఇప్పుడు టెక్నాలజీ మరింత అడ్వాన్స్‌గా ఉంది. దీన్ని మనం సద్వినియోగం చేసుకోవాలి. యువతకు అవకాశాలు కల్పిస్తే తిరుగులేని ఫలితాలు వస్తాయి. ఏపీలో సహజ వనరులు, మానవ వనరులు, మౌలిక సదుపాయాలు, హైవేలు, ఎయిర్ పోర్టులున్నాయి. కొత్త ఆవిష్కరణలకు, కొత్త ఆలోచనలకు మేం వేదికగా ఉండాలి అనుకుంటున్నాం. నాడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి మాట్లాడాం... ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి మాట్లాడుతున్నాం" అని సీఎం అన్నారు. నాడు ప్రతి ఇంటి నుంచి ఒక ఐటీ ఉద్యోగి ఉండాలనే లక్ష్యంతో పని చేశామని... నేడు ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో పెట్టుబడులకు అవసరమైన భూములు, నీళ్లు, మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని... వీటికితోడు బెస్ట్ పాలసీలు కూడా ప్రకటించామని సీఎం తెలిపారు. వీటి ద్వారా పారిశ్రామికరంగంలో ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ చంద్రశేఖరన్, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ జి.ఎం రావు, ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్, టీవీఎస్ కంపెనీ చైర్మన్ వేణు శ్రీనివాసన్, అపోలో ప్రతినిధి ప్రీతారెడ్డి, పిరమల్ గ్రూప్ చైర్మన్ అజయ్ పిరమల్, రెడ్డీ ల్యాబరేటరీస్ చైర్మన్ సతీష్‌రెడ్డితో పాటు పలు ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



దేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధులు, భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 137వ జయంతి సందర్భంగా అసెంబ్లీలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, సీఎం చంద్రబాబు నాయుడు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ఎన్ ప్రసన్న కుమార్, అసెంబ్లీ సిబ్బంది తదితరులు.



అసెంబ్లీలో ఫ్లోర్ లీడర్లతో స్పీకర్ అయ్యన్న పాత్రుడు నిర్వహించిన బీఏసీకి హాజరైన సీఎం చంద్రబాబు, మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తదితరులు.



తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం.. సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ నాయుడు.

# రూ.40వేల కోట్లతో టాటా పవర్ ప్రాజెక్టులు

- సీఎం చంద్రబాబుతో చంద్రశేఖరన్ భేటీ
- కీలక సమావేశానికి హాజరైన మంత్రి లోకేష్
- రాష్ట్రాభివృద్ధిలో పాలుపంచుకుంటామన్న టాటా
- రాష్ట్రంలో 'టాటా' హోటళ్లను విస్తరిస్తాం..
- విశాఖకు కొత్త ఐటీ డెవలప్‌మెంట్ సెంటర్..
- కీలక రంగాల అభివృద్ధిపై ఇరువర్గాల చర్చ
- 'ఎక్స్' వేదికపై పోస్టు చేసిన సీఎం చంద్రబాబు



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి లోకేష్‌తో సమావేశమైన టాటా గ్రూప్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్

అమరావతి (చైతన్య రథం): ఏపీ ప్రభుత్వం, టాటా గ్రూప్ కంపెనీలు పరస్పర సహకారంతో ముందుకెళ్లాలని నిర్ణయించాయి. టాటా కంపెనీస్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ సోమవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లూకేష్‌లతో సమావేశమయ్యారు. భారతదేశ పారిశ్రామిక చిత్రపటంపై చెరగని ముద్రవేసిన దార్శనికుడు రతన్ టాటా అద్భుత వారసత్వాన్ని కొనసాగించాలన్న అంశంపై ఇరువర్గాల మధ్య అభివృద్ధి దిశగా సానుకూల చర్చలు సాగాయి. ఏపీ అభివృద్ధికి రతన్ టాటా ఎనలేని కృషి చేశారని, ఆంధ్రా అభివృద్ధిలో కీలక వాటాదారుగా టాటా గ్రూప్ కొనసాగుతోందన్న విశ్వాసంతో ఉన్నట్టు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీ వృద్ధికి సంబంధించి కీలక రంగాల్లో తన పాత్ర కొనసాగించేందుకు టాటా గ్రూప్ సిద్ధంగా ఉందని, పరస్పర సహకారంతో అభివృద్ధి దిశగా అడుగులేద్దామని టాటా గ్రూప్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ చంద్రశేఖరన్ స్పష్టం చేశారని అంటున్నారు. ఈమేరకు టాటా గ్రూప్ సంస్థల చైర్మన్ చంద్రశేఖరన్, ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ మధ్య జరిగిన భేటీలో రాష్ట్రాభివృద్ధికి ఇతోధిక సహకారం అందించే దిశగా కొంత కీలక చర్చ నడిచినట్టు తెలుస్తోంది.




రూ.40వేల కోట్ల పెట్టుబడితో టాటాపవర్ సోలార్, విండ్ ప్రాజెక్టుల ఏర్పాటుపైనా ఈ సందర్భంగా చర్చించారు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన కీలక రంగాలపై సాగిన చర్చలో.. రాష్ట్రవ్యాప్తంగా మరో 20 హోటళ్ల ఏర్పాటుకు టాటా గ్రూప్ సంసిద్ధత వ్యక్తం చేసింది. తాజ్, వివాంటా, గేట్వే, సెలెక్యూషన్స్, జింజర్ హోటళ్లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది. విశాఖలో కొత్త ఐటీ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకూ నిర్ణయించారు. ఇప్పటికే విశాఖలో టీసీఎస్ సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చిన టాటా గ్రూప్స్., ఆ కేంద్రం ద్వారా 10వేల ఉద్యోగాలు కల్పించనుండటం తెలిసిందే. కీలక భేటీ అనంతరం - చంద్రశేఖరన్‌తో సాగిన భేటీ సారాంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన 'ఎక్స్' వేదికపై పోస్టు చేస్తూ ప్రజలతో పంచుకున్నారు.

చైతన్యరథం



# సామాజిక ఇన్‌ఫ్లుయన్సర్లు.. టీచర్లే

- పిల్లల భవిష్యత్ తీర్చిదిద్దే బాధ్యత గురువులదే
- విజన్ 2047ను సాకారం చేయడంలో టీచర్లే కీలకం
- ప్రతి టీచర్ విజ్ఞాన గనిగా మారాలి
- మీ గౌరవాన్ని, ప్రతిష్టతను నిలబెట్టే బాధ్యత మాది
- విజ్ఞాన కేంద్రాలుగా విశాఖ, అమరావతి, తిరుపతి
- ఐదేళ్లలో నాలెడ్జ్ ఎకానమీకి హబ్‌గా ఏపీ తయారవ్వాలి
- ఉపాధ్యాయ అవార్డుల ప్రధానోత్సవంలో సీఎం చంద్రబాబు
- టీచర్లను సత్కరించిన సీఎం చంద్రబాబు, విద్యా మంత్రి లోకేష్



విజయవాడ (చైతన్య రథం): సమాజాన్ని ప్రభావితం చేసే శక్తి ఉపాధ్యాయులకు ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనని వ్యాఖ్యానించారు. మౌలానా ముందుచూపుతోనే నేటి యువత ఐఐటీల్లో రాణిస్తున్నారని అంటూ.. 1953లో యూజీసీ తీసుకొచ్చి విద్యా వ్యవస్థలోనే పెను మార్పులకు కారకులయ్యారని కొనియాడారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తి నుంచి ఉప రాష్ట్రపతిగా ఎదిగిన విషయాన్ని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా జరిగింది. విజయవాడ ఏ కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ముందుగా ఉపాధ్యాయ వృత్తినుంచి రాష్ట్రపతిగా ఎదిగిన భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, భారత తొలి విద్యాశాఖ మంత్రి డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటాలకు కార్యక్రమంలో నివాళి అర్పించారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ -'తల్లిదండ్రులు పిల్లలను చదివిస్తారు... కానీ విద్యార్థులు ఎక్కువ సమయం గడిపేది టీచర్లతోనే. ఇంట్లో ఉండే సమయం కంటే స్కూళ్లలో ఉండే సమయమే ఎక్కువ. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే. నాకు చిన్నతనంలో చదువు చెప్పిన గురువులు ఇప్పటికీ గుర్తున్నారు' అన్నారు.

### ఉన్నత విద్యలో విద్యారంగలో పెనుమార్పులు

'మౌలానా అబుల్ కలాం ఆజాద్ 1951లో ఐఐటీని స్థాపించారు. మన దేశంలో నేడు విద్యార్థులు ఐఐటీ చదువుకుని నాడు ప్రపంచం మొత్తం వెళ్లగలిగారంటే దానికి కారణం ఆజాద్. 1953లోనే యూజీసీ తీసు కొచ్చారు. ఐఐటీ, యూనివర్సిటీ విద్య వ్యాప్తితో పాటు పెనుమార్పులు తీసుకొచ్చింది. సర్వేపల్లి రాధాకృష్ణ... రేణిగుంటలో టీచర్‌గా పని చేశారు. సర్వేపల్లి రాధా కృష్ణన్ దేశానికి రాష్ట్రపతి కూడా అయ్యారంటే అది టీచర్లకు ఉన్న శక్తి, సామర్థ్యం. సెప్టెంబర్ 5వ జరగా ల్సిన టీచర్స్ డే వరదల వల్ల నిర్వహించలేకపోయాం. విజయవాడలో ఎప్పుడూ లేనివిధంగా వరదలు వచ్చా యి... బాధితులకు మొక్కు బడిగా సాయం చేయలేదు. రేయింబవళ్లు పని చేసి ప్రజలను సాధారణ స్థితికి 10 రోజుల్లోనే తీసుకొచ్చాం. భారతదేశం చాలా గొప్ప దేశం. సంస్కృతి, సాంప్రదాయాలకు మారుపేరు. 1991లో పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు తెచ్చారు. వాటి ద్వారా దేశం దశ దిశ మారిపోయింది. ఆ సంస్కరణలు తెచ్చిన పీవీ నరసింహారావు మన తెలుగువాడు కావడం అదృష్టం. 1995లో ఇంటర్నెట్ విప్లవం రావడంతో ఐటీకి ప్రాధాన్యం ఇచ్చాం. హైటెక్ సిటీ నిర్మించి ప్రపంచ మంతా తిరిగి ఐటీ కంపెనీలను ఆహ్వానించాం. ఇంజనీరింగ్ కాలేజీల ఏర్పాటును ప్రోత్సహించాం. అప్పటికి 25 ఉన్న ఇంజనీరింగ్ కాలేజీలు పదేళ్లలో 300 అయ్యాయి. మీరు చదవులు చెప్పిన వారు అమెరికాలో ఉంటూ డాలర్లు సంపాదిస్తు న్నారు. ఇంగ్లీష్ వస్తేనే భవిష్యత్తు ఉంటుందని ఒక కొత్త సంస్కృతికి తీసుకొచ్చారు. భాష మర్చిపోతే జాతి కనుమరుగువుతుంది. డబ్బులు సంపాదించడానికి ఇంగ్లీష్ కావాలి... జాతిని నిలుపుకోవడానికి మాతృ భాషను కాపాడుకోవాలి. తెలుగు, ఇంగ్లీష్‌ను బ్యాలెన్స్ చేసుకుని ముందుకెళ్లాలి.' అని ముఖ్యమంత్రి సూచించారు.



### విద్యా వ్యవస్థలో ఎన్నో మార్పులు తెచ్చాం

'విద్యా వ్యవస్థలో చాలా సంస్కరణలు చేపట్టాం. గతంలో ప్రాంతీయ అసమానతలు ఎక్కువ ఉండేవి. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఎక్కువ స్కూళ్లు, కాలేజీలు ఉండేవి.

తెలంగాణలో చాలా ప్రాంతాల్లో స్కూళ్లు ఉండేవి కాదు. దీంతో అధికారంలోకి వచ్చాక ప్రతి ఒక్క కి.మీ ఎలిమెంటరీ స్కూలు, ప్రతి 3 కి.మీ ఒక అప్పర్ ప్రైమరీ, ప్రతి 5 కి.మీలకు ఒక హైస్కూల్ ఏర్పాటు చేశాం. ప్రతి మండలంలో జూనియర్ కాలేజీ, ప్రతి రెవెన్యూ డివిజన్‌లో ఇంజనీరింగ్ కాలేజీ, ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ విధానాన్ని 1995లో తీసు కొచ్చాం. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో 11 డీఎస్సీలు వేసి.. 1.5 లక్షల ఉద్యోగాలిచ్చాం. నేను 8 డీఎస్సీలు నిర్వహిస్తే, ఎన్టీఆర్ 3 నిర్వహించారు. ఇప్పు డు మరో డీఎస్సీ రాబోతోంది. అధికారంలోకి వచ్చాక మొదటి సంతకం డీఎస్సీపైనే పెట్టాను.

విద్యా ప్రమాణాలు పెంచాలని 16,347 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపాం. గతంలో 33 శాతం మహిళలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాం. చదువుల్లో విద్యార్థులను ప్రోత్స హించేందుకు ప్రతిభా అవార్డులు కూడా తీసుకొచ్చాం. మెరిట్‌ను ప్రమోట్ చేశాం... తద్వారా ప్రభుత్వమే చదివించే విధానాన్ని ప్రవేశపెట్టాం.' అని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు.

### విజ్ఞాన కేంద్రాలుగా విశాఖ, అమరావతి, తిరుపతి

'ఒకప్పుడు టీచర్‌ను ఎడాపెడా జిల్లా పరిషత్ ఛైర్మన్ బదిలీ చేసేవారు. రాజకీయ నాయకులు వెళ్లి అడిగితే వెంటనే బదిలీలు చేసేవారు. టీచర్లను ఇష్టం వచ్చినట్లు ఫుట్‌బాల్ ఆడుకున్నారు. కానీ టీచర్లను గౌరవించే విధానంలో భాగంగా కౌన్సిలింగ్ విధానాన్ని తీసుకొచ్చి పనితనాన్ని బట్టి కోరుకున్న స్థానానికి బదిలీలు చేయించాం. నాలెడ్జ్ ఎకానమీకి దోహదం చేయాలన్న ఉద్దే శ్యంతో ఐఐటీ తిరుపతి,ఐఐఎం విశాఖపట్నం, ఎన్ఐటీ తాడేపల్లిగూడెం,ట్రిపుల్ ఐటీ కర్నూల్, సెంట్రల్ యూని వర్సిటీ,విజయనగరంలో గిరిజన యూనివర్సిటీ, మంగ ళగిరికి ఎయిమ్స్ తెచ్చాం. మన పిల్లలు బెస్ట్ యూని వర్సిటీల్లో చదవాలని ఆకాంక్షించాం.అమరావతికి విట్, ఎస్ఆర్ఎం, అమృత్ యూనివర్సిటీలు తెచ్చాం. త్వరలో ఎక్స్ఎల్ఆర్ఐ కూడా వస్తుంది. విశాఖ, అమరావతి, తిరుపతిని విజ్ఞాన కేంద్రాలుగా మార్చే బాధ్యత తీసు కుంటాం. పిల్లలు భవిష్యత్ తీర్చిదిద్దేవారిని గౌరవించా ల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది' అన్నారు.

### భవిష్యత్.. నాలెడ్జ్ ఎకానామీదే

నాలెడ్జ్ ఎకానామీకే భవిష్యత్ ఉంటుంది. హార్డ్ వర్క్ కాదు... స్మార్ట్ వర్క్ నేర్చుకోవాలి. మీ స్కిల్స్ కూడా పెంచుకుని విద్యార్థుల స్కిల్స్ పెంచాలి.అపార్ ఉంది... పిల్లల డేటా అప్‌డేట్ చేస్తున్నాం. 20ఏళ్ల తర్వాత ఎలాంటి రిసోర్స్ కావాలో ఇప్పుడే ప్లాన్ వేసి కరికులమ్ మార్చుకునే అవకాశం తీసుకొస్తాం. యూనివర్సిటీల్లో ప్రమాణాలు పడిపోయాయి. లెర్నింగ్, డీ లెర్నింగ్ అనేది జీవితంలో చాలా ముఖ్యం. బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్న ప్రతి ఒక్కరూ రీసెర్చ్ చేస్తూనే ఉంటారు. నేను కూడా నిత్య విద్యార్థినే.... వెళ్లేదారిలో రిక్షా కార్మికుడు మంచి మాట సలహా ఇచ్చినా అమలు చేస్తాను. ప్రజాసేవలో ఉన్నప్పుడు ఎవరు మంచి చెప్పినా తీసుకుంటా'మని చంద్రబాబు వెల్లడించారు.



## ప్రతి టీచర్ విజ్ఞాన గనిగా మారాలి

'కొందరిలో విలువలు పూర్తిగా పడిపోతున్నాయి. సోషల్ మీడియా చూస్తే భయమేస్తోంది. లెక్కలేని తనం తో ప్రవర్తిస్తున్నారు.విలువలు కాపాడేఆలోచన రావడం తోనే స్టూడెంట్స్ ఎథిక్స్, వ్యాల్యూస్ సలహా దారుగా చాగంటి కోటేశ్వరరావుని నియమించాం. విలువలు లేకుంటే ఎవరైనా పతనానికి వెళతారు. సమాజహితం, భవిష్యత్తు కోసం ప్రతిఒక్కరూ మాట్లాడాలి. మంచిని ప్రోత్సహించి విలువల కాపాడుకుంటే అవే రక్షణగా నిలుస్తాయి.రాబోయే ఐదేళ్లలో నాలెడ్జ్ ఎకానమీకి హబ్ గా ఏపీ తయారవ్వాలి. రతన్ టాటా పేరుతో అమరా వతిలో ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి టీచర్ విజ్ఞాన గనిగా తయారవ్వాలి.

మీరు మాట్లాడే ప్రతి మాట, అనుసరించే ప్రతి విధానం విద్యార్థుల్లో స్ఫూర్తినింపాలి.వినూత్న ఆలోచనలుచేసే వారే ముందు కెళ్తారు. మీ గౌరవాన్ని, ప్రతిష్టను నిలబెట్టే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుంది. అందరం కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం. ప్రపంచంలో మన దేశం, దేశంలో మన రాష్ట్రం అగ్రభాగాన ఉండేలా చేసుకుం దాం. 2047నాటికి ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా తెలుగుజాతి ఉండాలనేది నా ఆకాంక్ష.. కోరిక' అని సీఎం చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో మంత్రు లు నారా లోకేష్,కొల్లు రవీంద్ర, సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మలతో మాట్లాడి అడ్డగోలు నిర్ణయాలు!



- అన్ని వ్యవస్థల్లాగే విద్యారంగాన్నీ నాశనం చేశారు
- గత ప్రభుత్వంలో ప్రచారం ఎక్కువ, పని తక్కువ
- ఫీజు రీయింబర్స్‌మెంట్ సహా 6,500 కోట్ల బకాయిలు పెట్టారు
- గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో సర్కారు స్కూళ్లలో 4లక్షల విద్యార్థుల తగ్గుదల
- కేజీ టూ పీజీ విద్యావ్యవస్థలో సమూల ప్రక్షాళన
- ఐదేళ్లలో ఏపీ విద్యావ్యవస్థను నెం.1గా తీర్చిదిద్దుతాం
- ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి లోకేష్

అమరావతి (చైతన్యరథం): అన్ని వ్యవస్థల్ని విధ్వంసం చేసినట్టే గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను కూడా నాశనం చేసిందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ధ్వజమెత్తారు. గత పాలకులు రాత్రిపూట ఆత్మలతో మాట్లాడి, ఉదయాన్నే అడ్డగోలు నిర్ణయాలు తీసుకుని అమలు చేశారని వ్యంగ్యబాణాలు సంధించారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవాన్ని సోమవారం రాత్రి విజయవాడలోని ఏ1 ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ గత పాలకులు జీఓ.117 తీసుకొచ్చి పాఠశాలలు మూసేసారు.. ఒక్క టీచర్ పోస్టు భర్తీ చెయ్యలేదని విమర్శించారు. సరైన కసరత్తు లేకుండానే వెయ్యి పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానంలో పరీక్షలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. మేము వచ్చిన తరువాత ఆ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై పరీక్ష పెడితే 90 శాతం విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. విద్యార్థుల భవిష్యత్తుతో గత ప్రభుత్వం ఆటలాడింది. టోఫెల్, ఐబీ ప్రవేశ పెట్టడం కూడా అలాంటి నిర్ణయాలే. కనీస అవగాహన లేకుండా, ఎలాంటి సన్నద్ధత లేకుండా నిర్ణయాలు తీసుకుని అమలు చేసారని మంత్రి లోకేష్ తప్పుబట్టారు.

## విద్యావ్యవస్థలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోలేం

ఇతర శాఖల్లో తీసుకున్నట్టు విద్యా వ్యవస్థలో నిర్ణయాలు తీసుకోలేం. మనం తీసుకునే నిర్ణయం కొన్ని లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉంటుంది. అందుకే నేను ఏ నిర్ణయం తీసుకున్నా అందరితో చర్చించి, అది మనం అమలు చేయగలమా.. లేదా, విద్యార్థులు, ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారా.. లేరా అనే విషయాలు తెలుసుకొని తరువాతే నిర్ణయాలు తీసుకుంటున్నాం. గత ప్రభుత్వంలో పబ్లిసిటీ ఎక్కువ.. పని తక్కువ. ఫీజు రీయింబర్స్‌మెంట్, వివిధ బిల్లులకు సంబంధించి రూ. 6,500 కోట్లు బకాయిలు పెట్టి పోయారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 4 లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారు. గత ప్రభుత్వం తీసుకున్న అన్ని నిర్ణయాలపై సమీక్ష చేస్తున్నాం. వచ్చే విద్యా సంవత్సరం నుండి విద్యా వ్యవస్థను గాడిన పెడతామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

## విద్యార్థుల తలరాతను మార్చేది గురువు!

మనుషుల తలరాతను రాసేది బ్రహ్మ అయితే, విద్యార్థుల తల రాతను మార్చేది గురువు. విద్యార్థుల భవిష్యత్తును బంగారంగా మార్చే ఉపాధ్యాయులందరికీ పాదాభివందనం. విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిన దేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినోత్సవం సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉంది. సెప్టెంబర్‌లో వరదల కారణంగా మనం ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోలేకపోయాం. ఉపాధ్యాయ వృత్తి అంటే మనకి మొదట గుర్తొచ్చేది డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. ఆయన మైసూర్ యూనివర్సిటీ నుండి కలకత్తా యూనివర్సిటీకి వెళ్తున్నప్పుడు విద్యార్థులంతా రోడ్ల మీదకి వచ్చి పూల వర్షం కురిపించారు. ఉపాధ్యాయులకు మాత్రమే దక్కే అరుదైన గౌరవం అది. ఉపాధ్యాయులను మద్యం షాపుల ముందు నిలబెట్టే చెత్త ప్రభుత్వం పోయింది. ఉపాధ్యాయులను గౌరవించే ప్రజాప్రభుత్వం వచ్చిందని మంత్రి లోకేష్ అన్నారు.

## విద్యాశాఖ తీసుకోవద్దని సలహా ఇచ్చారు

నేను విద్యాశాఖ తీసుకుంటున్నా అని తెలియగానే ఎంతో మంది అది కష్టమైన శాఖ, అనేక సమస్యలు ఉన్నాయి, మీరు తీసుకోవద్దని సలహా ఇచ్చారు. అమెరికాలోని ప్రతిష్టాత్మక స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో ఎంబీఏ చేసిన నేను కాకపోతే ఇంకెవరు తీసుకుంటారు అని ఛాలెంజ్‌గా తీసుకున్నాను. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చెయ్యడమే నా ఎజెండా. కేజీ టూ పీజీ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నాను. ఢిల్లీ మోడల్, కేరళ మోడల్ కాదు.. ఐదేళ్లలో అందరూ ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ గురించి మాట్లాడుకునే విధంగా చేస్తాను. విలువలతో కూడిన విద్య అవసరం. మార్కులు, ర్యాంకులు ఎంత ముఖ్యమో అంతకంటే ముఖ్యమైనది విలువలు. మహిళల్ని గౌరవించడం, ఇతరులకు సహాయం చేయడం, తల్లితండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించడం లాంటివి విద్యలో భాగం కావాలి. సమాజానికి ఉత్తమ పౌరులను అందించే విధంగా మన విద్యా వ్యవస్థ ఉండాలి. ఉత్తమ పౌరులను తయారుచేసే శక్తి ఉపాధ్యాయులకు మాత్రమే ఉంది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనేది నా లక్ష్యం. నా బలం, బలగం అయిన ఉపాధ్యాయుల వల్లనే అది సాధ్యం అవుతుంది. అవుట్ కం బేస్డ్ విద్య కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలి. రాష్ట్రంలో విద్యావ్యవస్థను దేశంలోనే నెం.1 చేసేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దాం. రాబోయే రోజుల్లో ఉన్నతవిద్యలో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో రాష్ట్రానికి 3వ స్థానం సాధిస్తాం. అదేవిధంగా ప్రపంచంలోని టాప్ 100 వర్సిటీల్లో ఏపీ వర్సిటీలు ఉండేలా కృషిచేస్తామని మంత్రి లోకేష్ ఉద్ఘాటించారు.

## రాజకీయాలకు అతీతంగా ఉండాలి

విద్యా వ్యవస్థ రాజకీయాలకు అతీతంగా ఉండాలని బలంగా నమ్మే వ్యక్తిని నేను. గత ప్రభుత్వంలో పేర్లు, రంగులు, ఫోటోల పిచ్చి మీరు అందరూ చూసారు. నేను మంత్రి అయిన తరువాత ఎక్కడా నా ఫోటో పెట్టొద్దని చెప్పాను. పార్టీ రంగులు, నాయకుల పేర్లు వద్దని ఆదేశాలు జారీ చేసాను. సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ లాంటి గొప్ప వ్యక్తుల పేర్లతో పథకాలు అమలు చేస్తున్నాం. ఒక పాఠం చెప్పాలి అంటే ఎంత కష్టమో నాకు తెలుసు, అందరికీ అర్థం అయ్యేలా చెప్పడం ఇంకా కష్టం. ఉపాధ్యాయులు సన్నద్ధం కావడానికి సమయం పడుతుంది. అందుకే ఉపాధ్యాయులకు చదువు చెప్పే బాధ్యత తప్ప ఇతర పనులు పెట్టకూడదు అని నేను బలంగా నమ్ముతాను. గత ప్రభుత్వం అనేక యాప్‌లు తీసుకొచ్చి చదువు చెప్పాల్సిన ఉపాధ్యాయులతో మరుగుదొడ్ల ఫోటోలు తీయించింది. పనికిమాలిన యాప్స్ అన్నింటినీ తీసేయాలని ఆదేశించాను. ఉపాధ్యాయుల మీద భారం తగ్గించేందుకు అధికారులతో చర్చిస్తున్నాను. త్వరలోనే మెగా పేరెంట్ -టీచర్స్ మీటింగ్ (పీటీఎం)కూడా నిర్వహించబోతున్నాం. ఏడాదికి 4 సార్లు మెగా పీటీఎం నిర్వహిస్తాం. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల నుండి అందరూ భాగస్వామ్యం కావాలి. విద్యార్థుల సామర్థ్యాన్ని తల్లితండ్రులకు తెలిసేలా చెయ్యడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని మంత్రి లోకేష్ వివరించారు.

## త్వరలో మెగా డీఎస్సీ నిర్వహణ

త్వరలోనే మెగా డీఎస్సీ నిర్వహిస్తున్నాం. తరగతికి ఒక టీచర్ కచ్చితంగా ఉండాలనేది నా లక్ష్యం. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నాం. జోన్ల వారీగా పిల్లలకు నచ్చే భోజనం అందించాలని నిర్ణయం తీసుకున్నాం. నాణ్యత విషయంలో రాజీ ఉండదు. ఎక్కడైనా తప్పు జరిగితే బాధ్యులపై చర్యలు తప్పవు. చదువుతో పాటు పిల్లలకు ఆటలు, సైన్స్ పోటీలు పెట్టబోతున్నాం. గత పాలకులు నాడు- నేడు అని పబ్లిసిటీ చేసారు. అసలు కొన్ని పాఠశాలల్లో కూర్చోడానికి బల్లలే లేవు. అందుకే రాబోయే మూడేళ్లలో అన్ని స్కూల్స్‌లో కనీస సదుపాయాలైన లీక్ ప్రూఫ్ భవనాలు, తాగునీరు, మరుగుదొడ్లు, కంప్యూటర్ ల్యాబ్స్ వంటివి కల్పించాలని ఆదేశాలు జారీ చేసాను. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న అందరికీ శుభాకాంక్షలు. నేను మీనుండి కోరుకునేది ఒక్కటే. మీ సక్సెస్ స్టోరీస్ ఇతర ఉపాధ్యాయులకు షేర్ చేయండి. వచ్చే ఏడాదికి అవార్డులు అందుకునే వారి సంఖ్య రెట్టింపు కావాలి. ప్రభుత్వ ఉపాధ్యాయులు తలుచుకుంటే ప్రైవేట్ స్కూల్స్‌కి గట్టి పోటీ ఇవ్వగలరన్న నమ్మకం నాకుంది. అందరం కలిసి ప్రభుత్వ విద్యా వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకొద్దాం. విద్యార్థులను ఉద్యోగాలు వెతుక్కునే వారిగా కాకుండా ఉద్యోగాల సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. ఈ పోటీ ప్రపంచాన్ని ఛాలెంజ్ చేసే సూపర్ కిడ్స్‌ను తయారు చేద్దామని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.





# పండుగ వాతావరణంలో
# జాతీయ విద్యా దినోత్సవం




- ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం
- రాష్ట్రవ్యాప్తంగా 166 మంది ఉత్తమ అధ్యాపకులు, ఉపాధ్యాయులకు పురస్కారాలు
- ఘనంగా సత్కరించిన సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా జరిగింది. విజయవాడ ఏ కన్వెన్షన్‌లో సోమవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరయ్యారు. ముందుగా ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతిగా ఎదిగిన భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, భారత తొలి విద్యాశాఖ మంత్రి డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవంగా గురుపూజోత్సవం జరుపుకుంటూ అదే రోజు ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేస్తున్నారు. అయితే ఈ సంవత్సరం విజయవాడ వరదల నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నవంబర్ 11కు వాయిదా వేశారు. భారత తొలి విద్యాశాఖ మంత్రి డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి అయిన నవంబర్ 11న జాతీయ విద్యాదినోత్సవంగా జరుపుకుంటు న్నాం. ఈ విధంగా ఇద్దరు మహానుభావుల విద్యాసేవలను స్మరించుకుంటూ ఉత్తమ ఉపాధ్యాయులకు ఇచ్చే పురస్కారాల ప్రధానోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు.



### 166 మంది ఉత్తమ అధ్యాపకులు, ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం

రాష్ట్రస్థాయి కమిటీ ద్వారా ఎంపికైన 166 మంది ఉత్తమ అధ్యాపకులు, ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. వారిని శాలువాతో సత్కరించి మెరిట్ సర్టిఫికెట్, మెడల్, జ్ఞాపిక, 20వేల రూపాయల నగదు బహుమతి అందజేశారు. పాఠశాల విద్యాశాఖకు సంబంధించి మొత్తం 68 మంది ఉపాధ్యాయులను 2024 సంవత్సరానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు ఎంపిక చేశారు. పాఠశాల విద్య నుంచి ఇద్దరు నేషనల్ అవార్డు గ్రహీతలు, ఇంటర్మీడియట్ విద్య నుంచి 25 మంది, టెక్నికల్ ఎడ్యుకేషన్ నుంచి 16 మంది, హయ్యర్ ఎడ్యుకేషన్ కు సంబంధించి యూనివర్సిటీ ప్రొఫెసర్లు 32 మంది, డిగ్రీ కాలేజీ లెక్చరర్లు 19 మంది, ఇంజనీరింగ్, ఫార్మసీ నుంచి నలుగురిని ఎంపిక చేశారు. వీరందరినీ ఘనంగా సత్కరించారు.















# మంత్రి లోకేష్ సహృదయం

**- సమగ్ర శిక్ష ఉద్యోగులకు సమ్మె కాలపు వేతనాలు విడుదల**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మంచి మనసుతో తీసుకున్న నిర్ణయం కారణంగా సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 21 రోజు సమ్మె కాలానికి వేతనాలు విడుదలయ్యాయి. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) పనిచేస్తున్న వారితో పాటు జిల్లాలు, మండలాల్లో సమగ్ర శిక్షా అభియాన్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ గౌరవ వేతనాల పెంపు, ఇతర డిమాండ్ల కోసం గత ప్రభుత్వ హయాంలో గత ఏడాది డిసెంబరు 20 నుండి ఈ ఏడాది జనవరి 10 వరకు 21 రోజులు సమ్మెలో పాల్గొన్నారు.

ఈ సమ్మె తర్వాత కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు గౌరవ వేతనాన్ని 23% పెంచుతూ ఈ ఏడాది జనవరిలో ప్రభుత్వం మెమో జారీ చేసింది. ఆ మెమోలో 2019కు ముందు గౌరవ వేతనం పెంచని వాళ్లకు 23 శాతం పెంచినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 21 రోజులు సమ్మె కాలానికి కూడా వేతనం చెల్లించాల్సిందిగా కోరుతూ ఇటీవల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రతినిధులు కలిశారు. ఉద్యోగుల సమస్యలను పరిగణనలోకి తీసుకున్న మంత్రి లోకేష్.. వేతనాలు విడుదల చేయడానికి సహృదయంతో అంగీకరించారు. సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఈ వేతనాలు సోమవారం విడుదల చేశారు.

## మానవతా దృక్పథంతో వేతనాలపై నిర్ణయం

**- మంత్రి నారా లోకేష్**

అమరావతి (చైతన్యరథం): ప్రజా ప్రభుత్వంలో ఉద్యోగుల వినతిని మానవతా దృక్పథంతో పరిశీలించి, పరిష్కరించామని రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు.

గౌరవ వేతనాల పెంపు, ఇతర డిమాండ్ల కోసం గత ప్రభుత్వ హయాంలో 21 రోజులు సమ్మెలో పాల్గొన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) పనిచేస్తున్న వారితో పాటు జిల్లాలు, మండలాల్లో సమగ్ర శిక్షా అభియాన్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సమ్మె కాలానికి వేతనం చెల్లించాల్సిందిగా కోరారు. ఉద్యోగుల వినతిని మానవతా దృక్పథంతో పరిశీలించి సమ్మెకాలానికి వేతనాలు విడుదల చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించగా సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మాది ప్రజా ప్రభుత్వం. మా దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

### ఎమ్మెల్సీల కృతజ్ఞతలు

సమగ్రశిక్ష ఉద్యోగులకు సమ్మె కాలానికి జీతం మంజూరు చేస్తూ విద్యాశాఖ జీవో విడుదల చేయటంతో మంత్రి నారా లోకేష్‌కు శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, వేపాడ చిరంజీవిరావు కృతజ్ఞతలు తెలిపారు. 21 సమ్మె కాలానికి జీతాలు మంజూరు చేయాలంటూ మంత్రి లోకేష్‌ను గతంలో ఎమ్మెల్సీలు కూడా కోరిన విషయం తెలిసిందే. తమ వినతిని మన్నించిన మంత్రి లోకేష్‌కు ఎమ్మెల్సీలు ధన్యవాదాలు తెలిపారు.

## మౌలానా అబుల్ కలామ్‌కు మంత్రి నారా లోకేష్ నివాళులు

అమరావతి (చైతన్యరథం): భారతరత్న మౌలానా అబుల్ కలామ్ అజాద్ జయంతి సందర్భంగా ఆయన సేవలు స్మరిస్తూ రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ నివాళు లర్పించారు.

భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా సాహిత్యం, విద్యా వికాసం కోసం ఆయన ఎనలేని కృషి చేశారని కొనియాడారు. మౌలానా జయంతిని పురస్కరించుకుని జరుపుతున్న జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.



# అసెంబ్లీలో ముఖ్యమంత్రి చాంబర్‌లో సమావేశమైన రాష్ట్ర కేబినెట్

**బడ్జెట్‌కు ఏపీ కేబినెట్ ఆమోదం**



అమరావతి (చైతన్య రథం): సీఎం చంద్రబాబు అధ్యక్షతన సోమవారం ఏపీ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఇందులో 2024-25 వార్షిక బడ్జెట్‌కు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అనంతరం ఏపీ అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. అంతకుముందు వెంకటపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి సీఎం చంద్రబాబు నివాళి అర్పించారు.. మంత్రులు నారా లోకేశ్, నారాయణ, పార్థసారథి, కొండపల్లి శ్రీనివాస్, సవిత, తెదేపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళి అర్పించారు. రాజధాని రైతులను మంత్రి నారా లోకేశ్ ఆప్యాయంగా పలకరించారు. అమరావతి ఉద్యమంలో కీలక పాత్ర పోషించారంటూ అభినందించారు. సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చే దిశగా బడ్జెట్ ఉంటుందని తెదేపా నేతలు తెలిపారు.

# ఎన్నడూ లేని విధంగా పోలీసు-శాఖకు నిధులు

**- బడ్జెట్‌పై మంత్రి అనిత అభినందనలు**



అమరావతి (చైతన్యరథం): వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసంతో తిరోగమనంలోకి పోయిన ఆంధ్రప్రదేశను తిరిగి సాధారణ స్థాయికి తీసుకొచ్చే విధంగా 2024-25 బడ్జెట్ ఉందని రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖల మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో అభివృద్ధికి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత లభించిందన్నారు. రూ.2.94 లక్షల కోట్ల బడ్జెట్లో ప్రతి రంగానికి కేటాయింపులు చేశారన్నారు. రాష్ట్ర జీఎస్డీపీలో 40 శాతానికి పైగా వాటా ఉన్న వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.43,402 కోట్లు కేటాయించడం ద్వారా రైతు సంక్షేమ ప్రభుత్వం అన్న పేరుకు సార్థకత లభించిందన్నారు. విద్య, వైద్య, ఇరిగేషన్, పంచాయతీరాజ్, నైపుణ్యాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధితో పాటు రాష్ట్ర రహదారుల కోసం సింహభాగం ఖర్చు చేయాలని భావించడం ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతకు నిదర్శనమన్నారు.

గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని, వ్యవస్థలను అస్తవ్యస్తం చేసిన వైసీపీ నేతలు ఇప్పుడు మొహం చాటేశారు. రాష్ట్ర ప్రజలకు ఎంతో కీలకమైన బడ్జెట్ సమావేశాలకు కూడా రాకుండా తమ బాధ్యతారాహిత్యాన్ని బయట పెట్టుకున్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పోలీస్ శాఖకు బడ్జెట్లో రూ.8,495 కోట్లు కేటాయించారు. గత ప్రభుత్వ పాలనలో అరకొర సౌకర్యాలతో పోలీసులు ఎన్నో కష్టాలు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోలీస్ శాఖలో ప్రక్షాళన చేపట్టింది. పోలీసు శాఖలో ఆధునికీకరణ, మౌలిక వసతుల కల్పన కోసం ఇప్పటికే రూ.62 కోట్లు విడుదల చేశాం. శ్రీకాకుళం, చిత్తూరు,ప్రకాశం, రాజమహేంద్రవరంలో కొత్తగా 4 స్పెషల్ పోలీస్ బెటాలియన్లు ఏర్పాటు చేస్తాం. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రాన్ని పట్టిపీడించిన మాదకద్రవ్యాలను రాష్ట్రంలో లేకుండా చేసేందుకు నిబద్ధతతో పనిచేస్తున్నాం. దీని కోసం యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేశాం. విద్యార్థులు మత్తుకు బానిసలు కాకుండా ఉంచేందుకు ఉన్నత విద్యాసంస్థల్లో 3,172 యూనిట్లకు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని అనిత పేర్కొన్నారు.

# బీసీ సంక్షేమానికి పెద్దపీట

**బడ్జెట్ భేష్ : మంత్రి సవిత**



అమరావతి (చైతన్యరథం): సీఎం చంద్రబాబునాయుడు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ భేషుగ్గా ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత కొనియాడారు.

రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి పనులు చేపడుతూనే, బడ్జెట్లో సీఎం చంద్రబాబునాయుడు సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. రూ.2.94 లక్షల కోట్ల బడ్జెట్ లో రూ.73,720 కోట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి కేటాయించారన్నారు. అందులో బీసీ సంక్షేమానికి రూ.39 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించడంపై మంత్రి సవిత ఆనందం వ్యక్తంచేశారు. అభివృద్ధికి, సంక్షేమానికి సమపాళ్లలో ప్రాధాన్యమిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాల అమలుకు చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. బీసీ సంక్షేమానికి చరిత్రలో ఎన్నడూ లేనంతగా నిధులు కేటాయించడంపై బీసీ సంఘాల నుంచి విశేష స్పందన వస్తోందని మంత్రి సవిత తెలిపారు.

చైతన్యరథం

# చట్టం తన పని తాను చేసుకుపోతుంది

- అసెంబ్లీకి జగన్ గైర్హాజరుపై స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలు
- నేడు ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు, కూటమి శాసనసభా పక్ష సమావేశం
- 22 వరకూ అసెంబ్లీ సమావేశాలు
- శనివారం కూడా సభ నిర్వహణ, అవసరమైతే రెండుపూటలా



అమరావతి (చైతన్యరథం): జగన్ అసెంబ్లీకి రాకపోతే చట్టం తన పని తాను చేసుకుపోతుందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. శాసనసభ సమావేశాలు సీరియస్‌గా జరగాలన్నారు. అసెంబ్లీలో తనకు ప్రతిపక్ష నేత హెూదా ఇవ్వలేదని, మైక్ ఇస్తే కట్ చేస్తారని, సాధారణ ఎమ్మెల్యేగా రెండు నిమిషాలు మాట్లాడేందుకు అసెంబ్లీకి వెళ్లడం ఎందుకని పులివెందుల ఎమ్మెల్యే జగన్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై సోమవారం జరిగిన అసెంబ్లీ బీఏసీ మీటింగ్‌లో శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు స్పందించారు. జగన్ అసెంబ్లీకి రాకపోతే చట్టం తన పని తాను చేసుకుపోతుందని వ్యాఖ్యానించారు. ఈ నెల 22వరకూ అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయని, అసెంబ్లీ సమావేశాలను సీరియస్‌గా తీసుకోవాలని స్పష్టం చేశారు. శనివారం కూడా సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. బిల్లులు, చర్చలకు అనుగుణంగా కొన్ని రోజులు రెండు పూటలా అసెంబ్లీ నిర్వహిస్తామని అన్నారు. 8 బిల్లులతో పాటు ప్రభుత్వ పాలసీలకు ఆమోదం తెలపాలని నిర్ణయించినట్లు స్పీకర్ తెలిపారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు బడ్జెట్‌పై అవగాహన పెంచుకోవాలని 39 శాఖలకు సంబంధించిన ప్రతిపాదనల గురించి తెలుసుకోవాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. ఎమ్మెల్యేలు బడ్జెట్‌పై అధ్యయనం చేసి సభలో చర్చించాలన్నారు. మంగళవారం ఉదయం అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఎమ్మెల్యేలందరికీ శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం కూటమి శాసనసభాపక్ష సమావేశం జరుగుతుంది. ఎమ్మెల్యేలు తమ వెంట అనుచరుల్ని అసెంబ్లీకి తీసుకుని రావటం మానుకోవాలని హితవు పలికారు.

### ఫిర్యాదులు ఎందుకొచ్చాయి

అసెంబ్లీ క్యాంటీన్‌లో భోజనంపై స్పీకర్ అయ్యన్న పాత్రుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒక్క ఎమ్మెల్యే అయినా భోజనం బాగుందని చెబుతున్నారా అంటూ అధికారులపై మండిపడ్డారు. సభ్యులకు వేరుగా, ఇతరులకు వేరుగా భోజనం పెట్టడం ఏమిటని నిలదీశారు. అందరికీ ఒకేలా భోజనం పెట్టామని అధికారులు చెప్పగా, ఒకేలా భోజనం పెడితే తానెందుకు నిలదీస్తానన్న సభాపతి ప్రశ్నించారు. తనకు ఫిర్యాదులు ఎందుకొచ్చాయో సమాధానం చెప్పాలన్నారు. అసెంబ్లీ అంటే తమాషా అనుకుంటున్నారా అంటూ అధికారులు, కాంట్రాక్టర్‌పై సభాపతి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఓ రోజు రుషికొండ పర్యటన చేపట్టాలి

తాను స్పీకర్‌గా ఉన్న సమయంలో సభలో చంద్రబాబు హుందాతనం చూశానని బీఏసీ సమావేశంలో జనసేన పక్షనేత నాదెండ్ల మనోహర్ గుర్తు చేశారు. కనీసం 15 రోజులైనా అసెంబ్లీ జరగాలని బీజేపీ పక్ష నేత విష్ణుకుమార్ రాజు ఆకాంక్షించారు. ప్రజాధనం దుర్వినియోగంతో కట్టిన రుషికొండ భవనాలపై చర్చ జరగాలన్నారు. ఎమ్మెల్యేలంతా ఓ రోజు ఋషికొండ పర్యటన చేపట్టాలని విష్ణుకుమార్ రాజు కోరారు.

# అసెంబ్లీకి వెళ్లనంటే.. ఎమ్మెల్యేగా ఎందుకు?

సోమవారం నుండి ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ హాజరుకాకపోవడం బాధ్యతా రాహిత్యం. అసెంబ్లీలో ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికితెచ్చి పరిష్కారానికి కృషి చేయాల్సిన వైసీపీ సభ్యులు సభకి దూరంగావుండి బయట తమ భజన మీడియా ముందు మాట్లాడే మాటలకు విలువ వుంటుందా? తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వనందుకు నిరసనగా అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించిన పులివెందుల ఎమ్మెల్యే జగన్‌మోహన్ రెడ్డి.. తన నివాసం నుండే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాననడం విడ్డూరంగా వుంది. ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్వరాలు ఉండకూడదా? ఏపీలో ప్రజాస్వామ్యం బతికే ఉందా? అంటూ ఆస్కార్ లెవల్లో రంకెలు వేస్తున్న జగన్‌రెడ్డి.. అసెంబ్లీకి వెళ్లి ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించరు? జనం ఇవ్వని ప్రతిపక్ష హోదా పదవి ఇస్తేనే సభకు వెళ్తాననడం జగన్ అసంబద్ధ నిర్ణయం. ప్రతి విషయం ఆయన చెప్పినట్లే జరగాలనుకోవడం ఇది రాచరికం కాదు. అసెంబ్లీకి వెళ్ళి ప్రభుత్వాన్ని ప్రశ్నించే, నిలదీసే ధైర్యంలేక సాకులు వెతుకుతున్నారన్న అనుమానం కలుగుతుంది. తనకు మైక్ ఇవ్వాల్సి వస్తుందనే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని పలాయన వాదన వినిపిస్తున్నారు. ప్రజా సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి నిర్ణయాలు చేయాల్సిన అసెంబ్లీ సమావేశాలకు జగన్ దూరంగా ఉండటం ఇదే మొదటిసారి కాదు. అసెంబ్లీని ఏనాడూ గౌరవించలేదు. ప్రతిపక్ష నాయకుడిగా మూడేళ్లు నిండకుండానే అసెంబ్లీని బాయ్‌కాట్ చేసి తన బాధ్యతను విస్మరించారు. అసెంబ్లీలో ప్రతిపక్షం అడిగే ప్రశ్నలకు, వాటికి ప్రభుత్వం ఇచ్చిన సమాధానాలు అధికారికంగా రికార్డు అవుతాయన్న విషయం మరచి.. జగన్‌రెడ్డి తన నివాసం నుండే ప్రశ్నిస్తాననడమంటే ఆయనకి అసెంబ్లీపట్ల ఎంత బాధ్యత వుందో అర్థమవుతుంది. ప్రజలపట్ల, వారి సమస్యలపట్ల భాధ్యతవుంటే ప్రతిపక్ష హోదాతో సంబంధం లేకుండానే సమావేశాలకు హాజరై ప్రజల పక్షాన నిలబడి పోరాడటం చెయ్యడం జగన్ బాధ్యత. ఆ బాధ్యత నుంచి తప్పుకుని సమావేశాలు బహిష్కరించడమంటే అసెంబ్లీకి వెళ్లే ధైర్యం లేక పారిపోవడమే అవుతుంది. తనకోసం తప్ప సామాన్య జనం కోసం ఆయనెప్పుడూ ఆలోచించరు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తేందుకే జనం ఎమ్మెల్యేగా గెలిపించి పంపారు. సోషల్ మీడియా యాక్టివిస్టులను అరెస్టు చేస్తే ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తారా? అంటూ వీరంగాలు వేశారే. మరి అసెంబ్లీకి వెళ్లకుండా బహిష్కరించడం ప్రజాస్వామ్యాన్ని కూనీ చెయ్యడం కాదా?

సభలో పార్టీ సభ్యుల సంఖ్యాబలం ప్రకారమే విపక్ష నేత హెూదా లభిస్తుందని తెలిసీ నాటకాలాడుతూ సాకులు చెబుతున్నారు. గత అసెంబ్లీలో సంఖ్యాబలం ఆధారంగానే తెలుగుదేశం సభ్యులకు సభలో సమయం కేటాయించిన విషయం తెలియదా?. ఇప్పుడు సభ్యులతో సంబంధం లేకుండా సభలో సీఎం చంద్రబాబుతో సమానంగా మాట్లాడేందుకు సమయం, మైకు ఇవ్వాలని కోరడం ఇదేం పద్ధతి? అసెంబ్లీ సమావేశాలకు వెళ్లకుండానే.. మైకు ఇవ్వరని వెళ్ళడం లేదని సాకులు చెప్పడమేమిటి? మైకు ఇవ్వకపోతే సభలో నిరసన తెలిపే హక్కు సభ్యులకు వుంది. ఐదేళ్లూ తాను చేసిన పాపాలను కూటమి ప్రభుత్వం బయట పెడుతుందన్న భయంతో అసెంబ్లీకి వెళ్ళడం లేదని అర్థమవుతుంది. ధైర్యంవుంటే అసెంబ్లీకి వెళ్ళాలి.. ప్రభుత్వంపై పోరాటం చెయ్యాలి. అసలు అసెంబ్లీకి వెళ్లకుండానే మైకు ఇవ్వరనడం సరికాదు. హెూదాలతో పనిలేదు. సభకు వచ్చి ప్రజాసమస్యలు ప్రభుత్వం దృష్టికి తేవడానికి ఇబ్బంది లేదు. అసెంబ్లీలో వైసీపీ ఒక్కటే కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్థానంలో ఉంది. చట్టసభలకు ఎన్నికైన వారు అసెంబ్లీకి వెళ్లి సమస్యలను ప్రస్తావించాలి. ప్రజాసమస్యలను ప్రశ్నించడానికి అసెంబ్లీకి వెళ్లనపుడు.. ఎమ్మెల్యేలుగా వుండటానికి, జీతం మరియు ఇతర అలవెన్సులు తీసుకోవడానికి ఎలా అర్హులు? ప్రజల పట్ల బాధ్యత లేని వారు రాజీనామా చేయాలి. అసెంబ్లీని గౌరవించని వ్యక్తులు ఎమ్మేల్యేలుగా ఉండటం ప్రజాస్వామ్యంలో మంచిది కాదు. ప్రజలు ఎన్నుకున్న చట్టసభ ప్రతినిధులుగా సభకు వెళ్లాలి. తమ అభిప్రాయం చెప్పాలి. సభను గౌరవించే లక్షణం లేనప్పుడు సభ్యులుగా కొనసాగడం ఎందుకు? అసెంబ్లీకి హాజరై ప్రజల సమస్యలపై చర్చించి పరిష్కారానికి ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావడమే ఎమ్మెల్యేల పని. అంతేతప్ప రాజ్యాంగంలో ఎమ్మెల్యేలకు ప్రత్యేకంగా వేరే పనులు కేటాయించలేదు. అసెంబ్లీకి వెళ్లడం మాని తమ భజన మీడియాలో తమ వాదనలు వినిపిస్తామనడం సరైంది కాదు.

తమ జీవితాలను నాశనం చేసిన జగన్‌రెడ్డికి, తమ సమస్యలు లేవనెత్తడానికి కూడా అర్హత లేదని ప్రతిపక్ష హెూదా దక్కకుండా తీర్పు ఇచ్చారు ప్రజలు. ప్రతిపక్ష హెూదా రాద్ధాంతమంతా తన హెూదా కోసమే తప్ప జనం కోసం కాదు. అధికారంలో వున్నప్పుడు బాధ్యత లేకుండా పాలన చేసిన జగన్‌రెడ్డికి, ప్రతిపక్ష హెూదా కూడా అక్కర లేదని ప్రజలు చిత్తుగా ఓడించి 11సీట్లకే పరిమితం చేశారు. నిజంగా పార్లమెంటు, అసెంబ్లీ సంప్రదాయం ప్రకారం రాజకీయ పార్టీకి ప్రతిపక్ష హెూదా ఇవ్వాలంటే ఎన్నికల్లో పది శాతం సీట్లు రావాలి. కౌల్ అండ్ షక్దర్ రూల్స్ పుస్తకంలో కూడా ప్రతిపక్ష నేత హెూదా ఇవ్వాలంటే ఆ పార్టీకి పది శాతం సభ్యులు ఉండాల్సిందేనని చెబుతున్నది. జగన్‌కి ప్రతిపక్ష హెూదా దక్కాలంటే పదిశాతం సీట్లు అంటే, 18 మంది ఎమ్మెల్యేల బలం ఉండాలి. మరి జగన్‌తో సహా 11మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. జగన్ తన స్వప్రయోజనాల కోసమే శాసనసభలో ప్రతిపక్ష నేత హెూదా కావాలని కోరుతున్నారు. సభలో ప్రజా సమస్యలు లేవనెత్తాలంటే ప్రతిపక్ష నేత హెూదానే అక్కరలేదు. ఎమ్మెల్యే అయినా చాలు. కానీ జగన్ తన స్వార్థం కోసం, క్యాబినెట్ ర్యాంక్ మంత్రి పదవికి సమానమైన పదవి కోసం, వ్యక్తిగత భద్రత కోసం. ప్రతిపక్షనేత హెూదాతో తన దర్పం వెలగబెట్టడం కోసం పాకులాడుతున్నాడు తప్ప ప్రజల కోసం మాత్రం కాదు. సాధారణ ఎమ్మెల్యేగా మిగిలి పోవాల్సి వస్తుందని ఆయన హెూదా రాద్ధాంతం చేస్తున్నారు.

గత ఐదేళ్లు అసెంబ్లీలో గీత దాటితే వేటు వేస్తామని ప్రతిపక్షాన్ని జగన్ బెదిరించారు. అసెంబ్లీని తన జాగీరుగా భావించి సభలో సమస్యలపై చర్చలకు పట్టుపట్టిన ప్రతిపక్ష తెలుగుదేశం సభ్యులను నిత్యం సస్పెండ్ చేసి సభాకార్యక్రమాలు జరుపుకున్నారు. చర్చలు లేకుండానే చట్టాలు రూపొందించారు. సభలో ప్రతిపక్షం మాట్లాడటానికి కూడా కనీసం మైకు ఇవ్వకుండా వారి ప్రాథమిక హక్కుని కాలరాసారు. శాసన సభలో మంత్రులు, శాసన సభ్యులు వాడిన భాష శాసన సభ ప్రతిష్ఠనే మసక బార్చింది. ప్రతిపక్ష నాయకుడుని టార్గెట్ చేసి ప్రతి అంశంపై విమర్శలతో, వెక్కిరింతలతో హేళన చేస్తూ అవమానించారు. చట్ట సభలంటే జగన్మోహన్ రెడ్డికి ఏనాడూ గౌరవంలేదు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై అసలే నమ్మకం లేదు. ఇప్పుడు సంప్రాదాయాలకు విరుద్ధంగా జగన్‌కి ప్రతిపక్ష నేత హెూదాను కట్టబెడితే, ఆయన ఆ హెూదాను ఉపయోగించి ప్రభుత్వాన్ని, సీయం చంద్రబాబుపై బురద జల్లడానికే దుర్వినియోగపరుస్తారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక ఉన్మాదిగా వ్యవహరించినందుకే ప్రజలు ప్రతిపక్ష హెూదా దక్కకుండా చేశారు. ఇప్పుడు నవ్విపోదురుగాక నాకేమి సిగ్గు అన్న చందంగా సంప్రదాయానికి భిన్నంగా ప్రతిపక్ష నేత హెూదా కోసం చెప్పే సాకులన్నీ జగన్‌రెడ్డి కోసమే తప్ప జనం కోసం మాత్రం కాదు. సమస్యలు చర్చించి పరిష్కారం చూపడానికి శాసనసభ ఒక వేదిక. కానీ జగన్ దురదృష్ట వశాత్తు శాసనసభకే వెళ్ళనని చెప్పడమంటే ప్రజాప్రాతినిధ్య వ్యవస్థపై అలుముకొన్న చీకట్లకు అద్దం పడుతుంది. ఏదేమైనా నిజంగా జగన్ ప్రజాహితం కోరితే ఈ విధంగా వ్యవహరించరు. శాసనసభ సమావేశాల ద్వారానే ప్రజలకు ప్రభుత్వం జవాబుదారీ అవుతుందని జగన్ గుర్తించాలి. అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించిన వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామాలు చెయ్యాలి. సోషల్ మీడియా యాక్టివిస్టులను అరెస్టు చేస్తే ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తారా? అంటూ వీరంగాలు వేశారే. మరి అసెంబ్లీకి వెళ్లకుండా బహిష్కరించడం ప్రజాస్వామ్యాన్ని కూనీ చెయ్యడం కాదా?

- నీరుకొండ ప్రసాద్
అమరావతి

# రాష్ట్ర బడ్జెట్‌లో వివిధ శాఖలకు కేటాయింపులు




## విద్యారంగం

**పాఠశాల విద్య-రూ.29,909 కోట్లు.**

**ఉన్నత విద్య-రూ.2,326 కోట్లు.**

**స్కిల్ డెవలప్‌మెంట్-రూ.1,215 కోట్లు.**

సూపర్ సిక్స్‌లో భాగంగా ఏ పిల్లవాడు విద్యకు దూరం కాకూడదు అనే నదుద్దేశ్యంతో ప్రభుత్వ, ప్రైయివేట్ పాఠశాలలో ఒకటి నుంచి పన్నెండో తరగతి వరకు చదివే పిల్లలకు తల్లికి వందనం పథకం.

యువతకు ఉపాధి కల్పనకు, విద్యావ్యవస్థను యువ ఉపాధ్యాయులతో అభివృద్ధి చేసేందుకు 16,347 పోస్టులతో మెగా డీఎస్సీకి ప్రణాళికలు.

ముఖ్యమైన పథకాలకు ప్రముఖ విద్యావేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్, సంఘ సేవకురాలు డొక్కా సీతమ్మ పేర్లు.

ఉపాధ్యాయులు బోధనపై మరింత దృష్టి పెట్టేందుకు వీలుగా అనవసరమైన యాప్‌లను తొలగించడం ద్వారా ఉపాధ్యాయులపై పని భారాన్ని తగ్గించడం.

ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, బ్యాగులు.

స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల బలోపేతానికి ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రణాళిక.

జాతీయ సంస్థాగత స్థాయి చట్టం (ఎన్.ఐ.ఆర్.ఎఫ్.)లో భాగంగా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను అత్యున్నత స్థాయిలో నిలబెట్టేందుకు చర్యలు.

అమరావతి, తిరుపతి, విశాఖపట్నంల్లో కనీసం మూడు విజ్ఞాన నగరాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

నాణ్యమైన విద్యకు అత్యంత నైపుణ్యం కలిగిన అధ్యాపకులు అవసరమని గుర్తించి, వచ్చే మూడేళ్లలో 18 వేల మంది అధ్యాపకులకు శిక్షణాభివృద్ధి కార్యక్రమాల ప్రతిపాదన

2024 డిసెంబర్ నుండి 2.5 లక్షల మందికి పైగా విద్యార్థులకు వృత్తి శిక్షణను సులభతరం చేయడానికి నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్స్, ఎడ్యుస్కిల్స్, సేల్‌ఫోర్స్, మైక్రోసాఫ్ట్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలతో ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు

సమాచార సాంకేతికత ఆధారిత రంగాలు, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా సేవలు, వనరులను సమకూర్చే సేవలు, చిల్లర వర్తకం, ఆరోగ్య సంరక్షణ వంటి వివిధ రంగాల్లో 5- 15 వేల రూపాయల మధ్య వేతనాన్ని అందించే అప్రెంటిషిప్‌తో కూడిన డిగ్రీ విద్యను ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

192 నైపుణ్య కేంద్రాలు, కళాశాలల ఏర్పాటు..

ప్రాధాన్య రంగాలలో విదేశీ ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యంగా స్కిల్ ఇంటర్నేషనల్.

## యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ

2024-25 ఆర్థిక సంవత్సరానికి యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖకు రూ.322 కోట్ల కేటాయింపు.

పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించి, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడంతో రాష్ట్ర సామర్థ్యం పెరుగుతోంది.

ఆధ్యాత్మిక పర్యాటక ప్రోత్సాహకంతో పాటు పర్యావరణం, సముద్రతీర, ఆరోగ్యం, చారిత్రక ప్రదేశాలను సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం.

## క్రీడారంగం

*క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలలో 3శాతం రిజర్వేషన్ ..ఇది దేశంలోనే అత్యధికం*

*2024-25 ఆర్థిక సంవత్సరానికి క్రీడా రంగానికి రూ.100 కోట్లు కేటాయింపు*

*2019-24లో వైసీపీ ప్రభుత్వం క్రీడారంగానికి రూ. 814 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది.*

*ఆడుదాం ఆంధ్ర పేరుతో వైసీపీ నాయకులు రూ.120కోట్లు దోచుకున్నారు.*

*2014-19లో టీడీపీ ప్రభుత్వం క్రీడారంగానికి రూ. రూ.1,139 కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి బాటలు వేసింది.*

## పంచాయితీరాజ్ శాఖ

*కూటమి ప్రభుత్వంలో పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్వవైభవం.*

*పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 16,739కోట్లు కేటాయింపు*

*2019-24లో వైసీపీ ప్రభుత్వం రూ. 65,974.17 కోట్లు కేటాయించి రూ. 58,456 కోట్లు ఖర్చు చేసింది.*

*2014-19లో టీడీపీ ప్రభుత్వం రూ.77,190 కోట్లు కేటాయించి రూ.93,569.34 కోట్లు ఖర్చు చేసింది.*

*కూటమి ప్రభుత్వం ఆగస్టు 23న ఒకే రోజు 13,326 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలను నిర్వహించి ప్రపంచరికార్డు సాధించింది.*

*చిన్న పంచాయతీలకు రూ.100 నుంచి రూ. 10వేలు, పెద్ద పంచాయతీలకు రూ.250 నుండి రూ. 25వేలకు పెంచి సర్పంచుల ఆత్మగౌరవం పునరుద్ధరణ.*

*పంచాయతీరాజ్ సంస్థలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.998 కోట్లు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం.*

*2024-25 సంవత్సరంలో ఇప్పటివరకు 1.2 మిలియన్‌లకు పైగా కుటుంబాలు 100రోజుల వేతన ఉపాధిని పొందాయి.*

*ఉద్యానవనం, సేద్యపుకుంటలు, పశుసంవర్థక ఆవాసాలు వంటి ప్రాజెక్టులతో పాటు మైకప్పు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతలు, చెక్ డ్యాంలతో సహాసహజ వనరుల నిర్వహణ ప్రాజెక్టులను చేపట్టింది.*

*ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారుల అనుసంధాన ప్రాజెక్టు ద్వారా 1,574 పనులను పూర్తి.*

## సంక్షేమం

*2024-25 ఆర్థిక సంవత్సరంలో షెడ్యూల్డ్ కులాల కాంపోనెంట్‌కు రూ.18,497 కోట్లు.*

*షెడ్యూల్డ్ తెగల కాంపోనెంట్‌కు రూ.7,557 కోట్లు.*

*వెనుకబడిన తరగతుల కాంపోనెంట్‌కు రూ.39,007 కోట్లు.*

*అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమానికి రూ.4,379 కోట్లు కేటాయించాలని ప్రతిపాదన*

*కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమానికి పెద్దపీట వేసింది.*




*మొదటి నెలలోనే ఎన్టీఆర్ భరోసా పథకం కింద రూ.4,400 కోట్లు, అలాగే 2024 జూన్ నుంచి ఇప్పటి వరకు మొత్తం రూ.15,218 రూపాయలు విడుదల.*

*గత ప్రభుత్వం మిగిల్చిన పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూడా దశలవారీగా విడుదల చేసేందుకు ప్రయత్నాలు.*

*రజకులు, దూదేకులు, నాయీబ్రాహ్మణులు వంటి సంప్రదాయ వృత్తి సమూహాలకు ఆర్థిక సాయం అందించాలని ప్రతిపాదన.*

*గిరిజన వర్గాల సంక్షేమం కోసం పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాలు*

*గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నాణ్యమైన విద్య, పౌష్టిక, అహారం, ఆరోగ్య సంరక్షణ, గిరిజన వర్గాల ఆర్థికాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి.*

*అల్ప సంఖ్యాక వర్గాలకు ఆర్థిక కార్యకలాపాలలోనూ, ఉపాధి కల్పించడంలోనూ సమాన భాగస్వామ్యం లభించేలా కృషి.*

*విదేశీ విద్య, ఇమామ్‌లకు, మౌజాములకు, పాస్టర్‌లకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రతిపాదన.*

## ఎస్సీ, ఎస్టీ, మున్సిపల్ శాఖల బడ్జెట్




**పురపాలిక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.11,490కోట్ల కేటాయింపు.**

**ఎస్సీ కాంపోనెంట్ : రూ.18,497కోట్లు**

**ఎస్టీ కాంపోనెంట్ : రూ.7,557కోట్లు**

**అంబేద్కర్ విదేశీవిద్యా నిధి పథకం అమలు.**

**ఆర్.టి.ఎఫ్, ఎం.టి.ఎఫ్ పథకాలు**

*గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ, గిరిజన వర్గాల ఆర్థికాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ.*

*విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు, తదితర ప్రధాన నగరాల అభివృద్ధి.*

*అమృత్ 2.0 క్రింద జలవనరుల పునరుద్ధరణ, మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించుకోవడం, వర్షపు నీటి సంరక్షణతో పాటు ప్రజలందరికీ సురక్షిత నీటిని సరఫరా చేయాలని నిర్ణయం.*

*అన్ని పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అత్యవసర సేవలకు ప్రణాళికలు.*

*రాజధాని నగరంలో మౌలిక సదుపాయాలు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.15వేల కోట్ల రూపాయల నిధుల సాధన*


*పట్టణ ప్రాంతాల్లో 204 అన్న క్యాంటీన్లు ఏర్పాటు.*

*గ్రామీణ ప్రాంతాల్లో కూడా 158 అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం.*

*అమరావతిలో 189 కిలోమీటర్ల అవుటర్ రింగ్ రోడ్డు ఎక్స్ ప్రెస్ హైవే పునరుద్ధరణకు కేంద్రం ఆమోదం.*



# రాష్ట్ర బడ్జెట్‌లో వివిధ శాఖలకు కేటాయింపులు







## హోంశాఖ బడ్జెట్

### పోలీస్‌శాఖ-రూ.8,495 కోట్లు

*నూతన వాహనాలు, అధునాతన పరికరాల కొనుగోలుకు, మౌలిక వసతుల కల్పనకు మరియు పోలీసు బలగాల ఆధునీకరణకు రూ.62 కోట్ల రూపాయల నిధులు విడుదల*

*శ్రీకాకుళం, చిత్తూరు, ప్రకాశం, రాజమహేంద్రవరంలో ప్రత్యేక పోలీస్ బెటాలియన్లు ఏర్పాటు.*

*300 మహిళా సహాయ డెస్కులు*

*ప్రతి జిల్లాలో సైబర్ పోలీస్ స్టేషన్లు.*

*13 ఫాస్ట్‌ట్రాక్ ఎస్.డి.పి.ఎస్. కోర్టులు ఏర్పాటు.*

*మాదకద్రవ్యాల విపరీత వాడకానికి చెక్ పెట్టేందుకు టాస్క్ ఫోర్స్, అవగాహన కార్యక్రమాలు, విద్యార్థుల కోసం 3,172 యూనిట్ల శిక్షణ ప్రణాళికలు.*

## వైద్య రంగం

2024-25 బడ్జెట్ లో వైద్య, ఆరోగ్యశాఖకు రూ. 18,421 కోట్లు కేటాయింపు

ప్రజారోగ్యంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఈ కేటాయింపులు నిదర్శనం.

వైద్య రంగంలో నవశకం ప్రారంభమైంది. గత ప్రభుత్వ అసమర్థత వల్ల నిర్వీర్యమైన వైద్య రంగాన్ని గాడిలో పెట్టేందుకు చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఎంతటి ప్రాధాన్యత ఇస్తోందో బడ్జెట్ కేటాయింపులను బట్టి చూస్తే అర్థమవుతుంది.

గత ప్రభుత్వం అరకొర బడ్జెట్ కేటాయింపులతో వైద్య రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేయడంతో పేదలకు వైద్యం అందని ద్రాక్షే అయింది. కానీ కూటమి ప్రభుత్వం అందరికీ ఆరోగ్యమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

2014-19 మధ్య ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా కోటి 30 లక్షలమందికి ఉచిత వైద్య సేవలు అందాయి. గడిచిన ఐదేళ్లలో ఆరోగ్యశ్రీ పేరుతో హడావుడి చేశారు. నెట్ వర్క్ ఆస్పత్రులకు కోట్ల బకాయిలు పెట్టి పేదలకు కార్పొరేట్ వైద్యం దూరం చేశారు.

కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా మారుమూల ప్రాంతాలకు సైతం వైద్య సేవలు అందించబోతోంది. అలాగే వైసీపీ హయాంలో నిర్వీర్యమైన 108, 104 సర్వీసులను పునరుద్ధరించడం శుభ పరిణామం.

స్టెమి కార్యక్రమం ప్రారంభించేందుకు సమగ్ర కార్యాచరణ రూపకల్పన, క్యాన్సర్ నివారణకు చర్యలు, అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం వంటి వాటికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వడం ప్రజారోగ్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది.

## ఇంధన రంగం

గత ప్రభుత్వ విధ్వంస చర్యలు, ప్రమాణ స్వీకారోత్సవ వేదిక నుంచే విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం ద్వారానే ఇంధన రంగం విధ్వంసానికి గురయింది.

గత ప్రభుత్వ తప్పిదాల వల్లనే నేడు వినియోగదారులు ట్రూ అప్ ఛార్జీల పేరుతో విద్యుత్ కోసం అధిక ధర చెల్లించాల్సి వస్తోంది.

ఈ నష్టాన్ని పూడ్చడానికి, వినియోగదారులకు తక్కువ ఖర్చుతో 24 గంటలు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.

రాష్ట్రంలో సుస్థిరత, ఇంధన పరివర్తన, క్లీన్ ఎనర్జీ సాంకేతికతలను ప్రోత్సహించేందుకు "నూతన సమగ్ర ఆంధ్రప్రదేశ్ సమీకృత క్లీన్ ఎనర్జీ విధానం - 2024" ప్రకటన.

పునరుత్పాదక ఇంధనం, పంప్డ్ స్టోరేజీ పవర్, హరిత హైడ్రోజన్ ఉత్పత్తుల ప్రోత్సాహకానికి కొత్త విధానం.

ఆక్వా రైతులకు తక్కువ ధరకే విద్యుత్ సరఫరా.

షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల కాలనీల్లో ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్.


లాండ్రీలకు, దారిద్ర్యరేఖకు దిగువనున్న నాయీబ్రాహ్మణుల క్షౌరశాలలకు, దారిద్ర్యరేఖకు దిగువనున్న అత్యంత వెనుకబడిన కులాలకు, చేనేత కార్మికులకు ఉచితంగా లేదా రాయితీపై విద్యుత్.

2024-25 ఆర్థిక సంవత్సరానికి ఇంధన శాఖకు రూ.8,207 కోట్ల కేటాయింపు.










## పర్యావరణ, అటవీ, శాస్త్ర, సాంకేతిక శాఖ

**2024-25**లో పర్యావరణ, అటవీ, శాస్త్ర, సాంకేతిక శాఖకు రూ.**687** కోట్ల కేటాయింపు కల్పించారు. పచ్చదనం మెరుగుపరచి సుస్థిర జీవన ఆవాసాలను అందించడానికి కృషి.

వనం-మనం, ప్రకృతి పిలుస్తోంది, మడ అడవుల పెంపకం వంటి పథకాలతో ఆదాయం పెరుగుతోంది. అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో కేంద్ర-రాష్ట్ర పథకాల సమన్వయం.

పచ్చదనాన్ని పెంపొందించేందుకు నగరవనం పథకాన్ని అమలు చేస్తూ వాతావరణ మార్పులకు తట్టుకునే నగరాల అభివృద్ధి.

## గత ప్రభుత్వ పాలనలో అరాచకాలపై ఫిర్యాదుల వెల్లువ

# పేదలపై వైసీపీ నేతల దౌర్జన్యం

- చంపుతామంటూ బెదిరింపులు
- ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇప్పిస్తామంటూ భారీ టోకరా
- గ్రీవెన్స్‌లో బాధితులు మొర
- చదువు లేదని మరదలి ఇంటిని, పొలాన్ని కాజేసేందుకు బావ కుట్ర
- పలు సమస్యలపై నేతలకు అర్జీదారుల వినతి
- పరిష్కరించాలని వేడుకోలు



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ సెల్‌కు బాధితులు అర్జీలు సమర్పించడానికి ఎగబడ్డారు. ఉదయం ఆరు గంటలకే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్యాలయానికి చేరుకున్నారు. దీనితో కార్యాలయం కిటకిటలాడింది. సాయంత్రం వరకు ఇదే పరిస్థితి కనిపించింది.

తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వమని అడిగితే తన కాళ్లు నరికించి మనిషిని పెట్టి చంపిస్తానని తుళ్లూరు మండలానికి చెందిన వైసీపీ నాయకుడు ఆలోకం సురేష్ అనే వ్యక్తి బెదిరిస్తున్నాడని గుంటూరు జిల్లా రాయపూడి గ్రామానికి చెందిన కె. కొండలరావు తన ఆవేదనను వ్యక్తం చేశాడు. బెదిరింపులపై ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేస్తానని చెప్పగా ప్రజాదర్బార్‌లో కాకుంటే ఎవరికైనా చెప్పుకోమని దారుణంగా దూషించాడని ఆరోపించాడు. తనను ఎవరూ ఏమి చేయలేరని ఇంకోసారి తన కంటికి కనిస్తే ప్రాణాలు దక్కవని హెచ్చరించాడని వాపోయాడు. అతనిపై చర్యలు తీసుకోవాలని నేతలు మాజీ మంత్రి కేఎస్ జవహర్, టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చిరాంప్రసాద్, AP MARKFED ఛైర్మన్ కర్రోతు బంగార్రాజులకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశాడు. తనకు రావాలసిన డబ్బులు ఇప్పించాలని వేడుకున్నాడు.

పల్నాడు జిల్లా మాచర్ల మండలం రాయవరం గ్రామానికి చెందిన కామిశెట్టి లక్ష్మీ నరసమ్మ తన భూమిలో పత్తి పంటను నాశనం చేసి తమను చంపి తమ భూమిని కొట్టేసేందుకు వైసీపీ నేతలు కుట్ర చేస్తున్నారని ఫిర్యాదు చేసింది. వారిపై చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.

కడప జిల్లా రైల్వే కోడూరు మండలం రామచంద్రానగర్ కు చెందిన లింగమయ్య, రామాంజనమ్మలు విజ్ఞప్తి చేస్తూ గండికోట రిజర్వాయర్ మునక ప్రాంతంలో తమ గ్రామం ఉందని అయితే తమకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ చెక్కులు రాకపోవడంతో వాటిని ఇప్పిస్తానని చెప్పి కడప జిల్లా ఆఫీసులో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ నరేంద్ర సింహాద్రిపురం మండల తహశీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న గంగరాజులు తమ వద్ద రూ. 7,50,000 నగదు తీసుకుని మోసం చేశారని ఫిర్యాదు చేశారు. వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

తనకు చదువురానికి కారణంగా తనతో తన బావ దొంగ సంతకాలు పెట్టించుకుని తన పొలాన్ని ఇంటిని కాజేసేందుకు కుట్ర చేస్తున్నాడనినంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం కరివేన గ్రామానికి చెందిన తిప్పగారి లక్ష్మమ్మ తన వినతి పత్రంలో వాపోయారు. పొలంలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నాడని దీనిపై విచారించి తనకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని నేతలకు విన్నవించుకొన్నారు.



కర్నూలు జిల్లా కోడుమూరు మండలం అమడగుంట్ల గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేస్తూ పల్లెవెలుగు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణంకు తీర్మానం చేయగా మంజూరైన సిమెంట్ రోడ్లను అవసరం ఉన్న చోట కాకుండా ఇదివరకు వేసిన సిమ్మెంట్ రోడ్లపైనే మళ్లీ నిర్మించేందుకు అధికారులు, సర్పంచ్ శంకుస్థాపనలు చేశారని ఫిర్యాదు చేశారు. దానిని అడ్డుకోవాలని లేదంటే నిధులు దుర్వినియోగం అవుతాయని వాపోయారు. అవసరమైన చోట్ల సిమెంట్ రోడ్లను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరి రక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ ఏపీ రజక ఎస్సీ సాధన చైతన్య సమితి సభ్యులు పలువురు కోరారు.



తమ వద్ద పొలాన్ని కౌలుకు తీసుకుని కౌలు సమయం ముగిశాక భూమిని తమకు అప్పగించకుండా అనంతకోటి శ్రీ హరి అనే వ్యక్తి తమను ఇబ్బంది పెడుతున్నాడని ఏలూరు జిల్లా టి. నరసాపురం మండలం కొత్త గూడెం గ్రామానికి చెందిన మాధవరావు, ప్రసాద్ లు విజ్ఞప్తి చేశారు. ఇతను వైసీపీకి చెందిన వ్యక్తి అని అధికారుల కూడా అతనికే సహకరిస్తున్నారని తమ భూమిని తమకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని వేడుకున్నాడు.













# బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా డీఎస్సీ ఉచిత కోచింగ్

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత వెల్లడి
- ఈ నెల 16 నుంచి ప్రారంభం
- నెలకు రూ.1500ల స్టయిపండ్.. మెటీరియల్‌కు అదనంగా మరో రూ.వెయ్యి
- 18న రాష్ట్ర పండుగగా గురు కనకదాస జయంతి



అమరావతి (చైతన్యరథం) : బీసీ స్టడీల్ల సర్కిళ్ల ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లు ప్రారంభించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళిశాఖల మంత్రి ఎస్.సవిత తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమయ్యే బీసీ అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఈ నెల 16 నుంచి బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లు రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభిచనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 26 జిల్లా కేంద్రాల్లోనూ బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో డీఎస్సీ కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గుంటూరులో డీఎస్సీ కోచింగ్ సెంటర్లను తాను ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో కోచింగ్ సెంటర్‌లో 200 మంది అభ్యర్థులకు కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,200 మందికి కోచింగ్ ఇవ్వనున్నామన్నారు. బీసీలకు 66 శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 14 శాతం చొప్పున సీట్లు కేటాయించామన్నారు. వారితో పాటు ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 520 సీట్లు అదనంగా కేటాయించామన్నారు. 2 నెలల పాటు ఇవ్వనున్న ఉచిత డీఎస్సీ కోచింగ్ సమయంలో నెలకు 1500 రూపాయి చొప్పున స్టయిపండ్ అందజేస్తామన్నారు. మెటీరియల్ కోసం అదనంగా మరో రూ.1000 ఇవ్వనున్నామన్నారు. నిష్ణాతులైన అధ్యాపకులతో ఆయా సబ్జెక్టులపై బోధన అందిస్తామన్నారు.

**ఆన్ లైన్లోనూ కోచింగ్..**

ఆఫ్ లైన్ తో పాటు ఆన్ లైన్‌లోనూ డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇవ్వనున్నామని మంత్రి సవిత తెలిపారు. ఆసక్తి చూపిన వారందరికీ శిక్షణ ఇస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేక యాప్ రూపకల్పన చేశామన్నారు. ఈ యాప్ లో సబ్జెక్టుల వారీగా నిపుణులైన వారితో క్లాసుల నిర్వహిస్తున్నామన్నారు. క్లాసులతో ఈ యాప్ లో పాత క్వశ్చన్ పేపర్లు, మోడల్ పేపర్లు కూడా అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. బీఈడీ అర్హతతో పాటు టెట్ లో ఉత్తీర్ణత సాధించిన వారికే ఆన్ లైన్, ఆఫ్ లైన్ కోచింగ్ ఇవ్వనున్నామన్నారు. ఆన్ లైన్ అభ్యర్థులకు తమకిష్టమైన సమయాల్లో యాప్‌ను ఓపెన్ చేసుకుని క్లాసులు వినే అవకాశం ఉంటుందన్నారు. ఆన్ లైన్ కోచింగ్ తో గృహిణులకు, ప్రైవేటు, ప్రభుత్వ రంగంలో పనిచేసే పార్ట్ టైమ్ ఉద్యోగులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఆఫ్ లైన్...ఆన్ లైన్...ఏదో ఒకే విధానంలో మాత్రమే అభ్యర్థులకు ఉచిత కోచింగ్ అవకాశం ఇవ్వనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు.

**రాష్ట్ర పండుగగా కనకదాస జయంతి..**

ఈ నెల 18న గురు కనకదాస జయంతిని రాష్ట్ర పండగగా నిర్వహించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. తన కీర్తనలు, సాహిత్యంతో సమాజ అసమానతలపై గొంతెత్తిన సాహిత్యకారుడు, సంఘ సంస్కర్త గురు కనకదాస అన్నారు. కర్నాటకలో జన్మించిన కనక దాస...రాయలసీమలోనూ కుల వ్యవస్థ, అసమానతల కు వ్యతిరేకంగా పోరాడారన్నారు. ఇటువంటి మహనీ యుని జయంతిని రాష్ట్ర పండగగా నిర్వహించాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారన్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల, పంచాయతీ స్థాయిల్లోనూ కనకదాస జయంతి నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందన్నారు. ప్రధాన కార్యక్రమం అనంతపురంలో నిర్వహించనున్నామని మంత్రి తెలిపారు. బీసీలను, వారి సంస్కృతీ సంప్రదాయాలను గౌరవిస్తూ... వారి ఉన్నతి కోసం సీఎం చంద్రబాబునాయుడు ఎంతో ప్రాధాన్యతమి స్తున్నారన్నారు. ఇటీవలే వాల్మీకి జయంతిని, విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండగలుగా జరుపుకున్నామన్నారు. ఇపుడు గురు కనకదాస జయంతిని కూడా రాష్ట్ర పండుగగా జరుపుకోబోతున్నామని మంత్రి సవిత తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి పోలా భాస్కర్, కమిషనర్ కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలను ముంచేసిన గత పాలకులు

- మంత్రి నారాయణ ధ్వజం
- కానూరులో సిద్ధార్థ ఫ్లై ఓవర్ ప్రారంభించిన మంత్రి



అమరావతి (చైతన్యరథం): గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీలను నిలువునా ముంచేశారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి పొంగూరు నారాయణ విమర్శించారు. విజయవాడ శివారు తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని కానూరులో సిద్ధార్థ ఫ్లై ఓవర్‌ను సోమవారం మంత్రి నారాయణ ప్రారంభించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఐదేళ్లుగా ప్రారంభానికి నోచుకోని ఫ్లై ఓవర్‌లో మిగిలిన కొద్దిపాటి పనులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చకచకా పూర్తిచేసింది. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెనమలూరు ఎంఎల్‌ఏ బోడే ప్రసాద్ విజ్ఞప్తి మేరకు ఫ్లై ఓవర్ నుంచి జాతీయ రహదారికి వెళ్ళే 3.5 కి.మీ రొడ్డును సీఆర్డీఏ నిధులతో నిర్మిస్తామని మంత్రి నారాయణ హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ సిద్ధార్థ ఫ్లై ఓవర్ ను తన చేతుల మీదుగా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఖజానాలో పైసా లేదు. సీఎం చంద్రబాబుకున్న అనుభవంతో ఆర్థిక పరిస్థితి ని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసింది. మున్సిపాలిటీల్లో ప్రజలు కట్టిన పన్నుల నిధులను పక్కదారి పట్టించారు. మున్సిపల్ శాఖలో రూ.3200 కోట్ల నిధులు పూర్తిగా వాడేశారు, అయితే ఈ నిధులు ఎందుకు ఉపయోగించారో మాత్రం తెలియటం లేదు. 2019 ఫిబ్రవరిలో ఆసియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ బ్యాంక్ కేటాయించిన రూ.5300 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వ వాటా విడుదల చేయలేదు. 2020లో కేంద్రం అమృత్ పథకం నిధులు మొదటి విడత విడుదల చేసినా కేంద్రం రాష్ట్ర వాటా ఇవ్వలేదు. స్వచ్ఛ భారత్ ద్వారా కేంద్రం ఇచ్చే నిధులకు కూడా మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వలేదు. కేంద్ర నిధులు విడుదలై ఉంటే అన్ని మున్సిపాలిటీల్లో డ్రైనేజీ, తాగునీటి సమస్య పరిష్కారం అయ్యేది. తాడిగడప మున్సిపాలిటీలో డ్రెయిన్ల పరిస్థితి దారుణంగా ఉంది. ఖచ్చితంగా అన్ని డ్రెయిన్లు బాగు చేసి మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి నారాయణ హామీ ఇచ్చారు.

## అసభ్య పోస్టులు.. కేరాఫ్ తాడేపల్లి

- వైసీపీ కార్యాలయంలోనే పోస్టుల సృష్టి
- డిజిటల్ కార్పొరేషన్ ఉద్యోగులూ వైసీపీ సేవలోనే
- వర్రా రవీంద్రారెడ్డి, ఇతర నిందితుల వాంగ్మూలం
- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు
- కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ వెల్లడి

కడప (చైతన్యరథం): సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డి, నేరస్థుడని తెలిసి కూడా అతడికి ఆశ్రయం కల్పించిన మరో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కర్నూల్ రేంజి డీఐజీ కోయ ప్రవీణ్, కడప జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ వీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. అసభ్యకర పోస్టుల కేసులో అరెస్టయిన వర్రా రవీంద్రరెడ్డితోపాటు మరో ఇద్దరు నిందితులు సుబ్బారెడ్డి, ఉదయ్‌లను పోలీసులు మీడియా ముందు ప్రవేశపెట్టారు. కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు వివరాలు వెల్లడించారు.

కడప జిల్లా వేముల మండలం, కొంద్రెడ్డి పల్లి గ్రామానికి చెందిన వర్రా రవీంద్రారెడ్డి(38) గత ఆరేడు సంవత్సరాల నుండి వాట్సాప్, ఫేస్ బుక్, ఇతర సోషల్ మీడియా ద్వారా వైసీపీకి వ్యతిరేకులైన వివిధ పార్టీల నాయకులపైన, మహిళల పైన అబద్ధపు, అశ్లీల మార్ఫింగ్ ఫోటోలు, వ్యాఖ్యలు పెడుతూ వారి ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా కుట్రపూరితంగా వ్యవహరించాడు. వివిధ కులాలు, వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి సమాజంలో అశాంతిని, శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తున్నాడు.

ఇందు కోసం కొందరు ప్రముఖులు వ్యవస్థగా ఏర్పడి అసాంఘిక శక్తులతో పనిచేయించుకుని, ధన సహాయం చేస్తూ వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్నారు. ఈ మేరకు వచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఆదివారం మార్కాపురం సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నామని డీఐజీ ప్రవీణ్ తెలిపారు.



వైసీపీ సోషల్ మీడియా ఆధ్వర్యంలోనే..

నిందితులు వాడిన భాష అసభ్యకరంగా ఉంది. అరబ్ దేశాల్లో అయితే తీవ్ర శిక్షలు ఉంటాయి. సీఎం, డిప్యూటీ సీఎం కుటుంబాలపై తీవ్రమైన దూషణలు చేశారు. వర్రా రవీంద్రరెడ్డి గతంలో భారతి సిమెంట్‌లో పనిచేశాడు. మరో ఇద్దరు కూడా వైసీపీ సోషల్ మీడియాలో పనిచేస్తున్నారు. డిజిటల్ కార్పొరేషన్ ఉద్యోగులను వైసీపీకి అనుకూలంగా వినియోగించుకున్నారని చెప్పారు. జడ్జిలకు వ్యతిరేకంగా కూడా పోస్టులు పెట్టారు. మహిళా నాయకురాళ్ల కుటుంబసభ్యులు, వారి పిల్లలపై కూడా పోస్టులు పెట్టారు. పోస్టులు పెట్టినవారిలో ఇప్పటివరకు 45 మందిని గుర్తించాం. నాయకుల ఫొటోలు మార్ఫింగ్ చేసి పోస్టులు పెట్టేవారు. నిందితులకు 40 యూ ట్యూబ్ ఛానళ్లు ఉన్నట్లు గుర్తించాం. యూ ట్యూబ్ ఛానళ్ల ద్వారా అసభ్యకర వ్యాఖ్యలు చేశారు. తాడేపల్లిలోని కార్యాలయం వైసీపీ కార్యాయం నుంచి ఇవన్నీ నడిపేవారు. వైసీపీ సోషల్ మీడియా బాధ్యుల ఆధ్వర్యంలో వీరంతా పనిచేసేవారు. తాడేపల్లిలోని పీవీఆర్ ఐకాన్ బిల్డింగ్ నుంచే పోస్టులు పెట్టేవారు. నిందితులు ఇచ్చిన వాంగ్మూలాన్ని లోతుగా పరిశీలించాల్సి ఉంది. నిందితులు పెట్టిన పోస్టులు చదవడానికి కూడా వీల్లేనంత అసభ్యంగా ఉన్నాయి. సభ్యసమాజం అసహ్యించుకునేలా వారి పోస్టులు ఉన్నాయి. మహిళలపై ఇలాంటి పోస్టులు పెట్టినవారు రాక్షసజాతికి చెందినవారుగా భావిస్తున్నామని డీఐజీ ప్రవీణ్ వివరించారు.



## మహనీయుడు మౌలానా కలామ్ ఆజాద్

మంగళగిరి (చైతన్యరథం) : దేశానికి స్వతంత్రమే లక్ష్యంగా హిందూ ముస్లింలను ఏకం చేసి ఆజాద్ నినాదంతో గాంధీ మార్గంలో భారతావనికి స్వేచ్ఛావాయుల సాధకు కృషి చేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం అజాద్ అని పలువురు టీడీపీ నేతలు కొనియాడారు. సోమవారం ఆయన జయంతి సందర్భంగా టీడీపీ కేంద్ర కార్యాలయంలో మౌలానా చిత్రపటానికి పూలమాలలు వేసి నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నేతలు ఆయన దేశానికి, దేశ ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేశారు. అబుల్ కలాం లౌకిక వాది అని భిన్నత్వంలో ఏకత్వం చూసిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. హిందూ, ముస్లింలు దేశానికి ఆయన చేసిన సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో షరీఫ్ ప్రభుత్వ సలహాదారు(మైనార్టీ ఎఫైర్స్), మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, స్వర్ణాంధ్ర మిషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, మాజీ మంత్రి జవహర్, తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి వహీద్, ఆహ్వాన కమిటీ ఛైర్మన్ హాజీ హసన్ భాష, మైనారిటీ స్పోక్స్ పర్సన్ మోసిన్, స్టేట్ మైనార్టీ అధికార ప్రతినిధి గోల్డ్ రఫీ, రాష్ట్ర మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ నూర్ తదితరులు పాలొన్నారు.

చైతన్యరథం

# ప్రజలకు ఆమోదయోగ్యంగా రాష్ట్ర బడ్జెట్

◆ విద్య, వైద్యానికి పెద్దపీట

◆ ఎమ్మెల్యే సత్యానందరావు స్పష్టీకరణ



కొత్తపేట (చైతన్యరథం): అభివృద్ధి, సంక్షేమాలకు వారధిగా రాష్ట్ర బడ్జెట్ ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. తెలుగుదేశం, జనసేన, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటిసారిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు, అలాగే అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఈ మేరకు ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజల ఆమోదయోగ్యంగా ఉందని చెప్పారు. గత జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచిందని, వైసీపీ ప్రభుత్వ చేతగాని పాలనలో రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలతో అస్తవ్యస్తమైన వ్యవస్థలను గాడిలో పెడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించే బాధ్యతాయుతంగా ప్రభుత్వం పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని వారికోసం బడ్జెట్ లో విద్య, వైద్యానికి పెద్దపీట వేశామని తెలిపారు. 2.94 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్‌లో బీసీలకు, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల మీద దృష్టి సారించిన ప్రభుత్వం పంచాయితీ రాజ్ శాఖకు 16 వేల 739 కోట్ల రూపాయలు కేటాయించిందని అలాగే రోడ్ల అభివృద్ధికి 9554 కోట్ల రూపాయలు కేటాయించారని చెప్పారు. విద్యా వ్యవస్థలో నూతన మార్పులు తీసుకొచ్చే విధంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేసిన కూటమి ప్రభుత్వం 30 వేల కోట్ల రూపాయలు కేటాయించిందన్నారు. మహిళా శిశు సంక్షేమం కోసం 4280 కోట్ల, ఎస్సీ ల సంక్షేమం కోసం 18497 కోట్ల రూపాయలు, ఎస్టీ అభివృద్ధి కోసం 7557 కోట్ల రూపాయలు, ఎస్టీ ల అభివృద్ధి కోసం 7557 కోట్ల రూపాయలు బడ్జెట్ లో కేటాయించినట్లు సత్యానందరావు చెప్పారు.



# ముఖ్యమంత్రిని కలిసిన పేరాబత్తుల రాజశేఖర్

అమరావతి (చైతన్యరథం): కూటమి బలపరిచిన తూర్పు - పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనకు అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి జీవితాంతం రుణపడి ఉంటానని పేరాబత్తుల రాజశేఖర్ తెలిపారు. సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని, పట్టభద్రుల ఓటరు నమోదుకు సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి పట్టభద్రులందరికీ అవగాహన కల్పించి నమోదు ప్రక్రియ వేగవంతం చేస్తున్నామన్నారు. నేటి వరకు 2 లక్షల 60 వేల ఓట్లు నమోదు అయ్యాయని అన్నారు. ఇచ్చిన అవకాశాన్ని బాధ్యతగా భావించి పని చేయాలని నమోదు ప్రక్రియ అనుకున్న లక్ష్యానికి చేరువలో ఉందని అభినందించి, త్వరితగతిన అనుకున్న లక్ష్యం పూర్తిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారని అన్నారు. తనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కూటమి ఇన్‌ఛార్జ్ మంత్రులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే, ఇన్‌ఛార్జ్‌లతో పాటు నేతలు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులకు పేరాబత్తుల రాజశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

# చంద్రబాబుకు రుణపడి ఉంటా: ప్రణవ్ గోపాల్



అమరావతి (చైతన్యరథం): వీఎమ్ఆర్డీఏ ఛైర్మన్‌గా తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి జీవితాంతం రుణపడి ఉంటానని టీడీపీ నేత ప్రణవ్ గోపాల్ వ్యాఖ్యానించారు. సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని, విశాఖ అభివృద్ధిని కృషి చేస్తానని చెప్పారు. పదవిని బాధ్యతగా భావించి ప్రజలకు సేవ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. తనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన వీఎమ్ఆర్డీఏ పరిధిలో ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు కూటమి నేతలు, కార్యకర్తలు, నాయకులు, శ్రేయోభిలాషులను కృతజ్ఞతలు తెలిపారు.



# సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

◆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన గుండుమల తిప్పేస్వామి

మడకశిర (చైతన్యరథం): నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలకు పార్టీ ఇన్ ఛార్జ్ గుండుమల తిప్పేస్వామి సూచించారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతిఒక్కరికి పార్టీ అండగా ఉంటుందని రూ.100 తో పార్టీ సభ్యత్వాన్ని తీసుకుంటే రూ.5 లక్షల ప్రమాధ బీమాతో పాటు సహజ మరణానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించడం జరుగుతోందన్నారు. సభ్యత్వ నమోదు ఉపయోగాలను ప్రజలకు తెలియజేసి ప్రతి ఒక్కరూ సభ్యత్వాన్ని తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, మండలాల కన్వీనర్లు, కార్యదర్శులు, అనుబంధ సంఘాల నాయకులు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కష్టపడ్డ నేతలకు నామినేటెడ్ పదవులతో గుర్తింపు

◆ శావల దేవదత్‌కు అభినందనలు తెలిపిన మాజీ మంత్రి నెట్టెం రఘురామ్



తిరువూరు (చైతన్యరథం) : టీడీపీలో దీర్ఘకాలంగా క్రియాశీలకంగా పనిచేస్తూ గత ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలవడానికి క్రియాశీలకంగా పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభించిందని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్ వ్యాఖ్యానించారు. గత శనివారం ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల్లో ఈ విషయం మరోసారి రుజువైందన్నారు. ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్‌గా తిరువూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడు శావల దేవదత్‌ను నియమించడం సంతోషంగా ఉందన్నారు. వైసీపీ పాలనలో దాడులు, కేసులు ఎదుర్కొని అనేక ఇబ్బందులు పడిన నేతలకు పదువులు ఇచ్చి అండగా ఉంటామనే భరోసా కల్పించడం జరిగిందన్నారు. సోమవారం ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీమంత్రి నెట్టెం రఘురామ్‌ని శావల దేవదత్ మర్యాదపూర్వకంగా కలిశారు. నామినేటెడ్ పోస్టు లభించేలా తనకు సహకరించిన రఘురామ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ... పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నియోజకవర్గం పార్టీ ఇన్‌ఛార్జ్‌గా రెండు సంవత్సరాల కాలం తిరువూరులో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని, పార్టీ అధిష్టాన నిర్ణయాన్ని గౌరవించి టిక్కెట్ దక్కపోయినా తిరువూరులో పార్టీ జెండా ఎగురవేయడంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. శావల దేవదత్ పార్టీకి అందించిన సహకారాన్ని గుర్తించిన అధిష్టానం సరైన సమయంలో కీలక బాధ్యతలు అప్పగించి గౌరవించిందన్నారు. ఆయన సేవలను గుర్తించి అధిష్టానం తగిన గుర్తింపు ఇచ్చి గౌరవించిందని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఈ సందర్భంగా అభిలాషించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చంద్రబాబు చిత్రపటానికి మైనార్టీల పాలాభిషేకం

◆ బడ్జెట్‌లో రూ.4,376 కోట్లు కేటాయింపుపై హర్షం

అనంతపురం (చైతన్యరథం) : రాష్ట్ర శాసనసభలో తొలి బడ్జెట్ సమావేశంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం మైనార్టీ సంక్షేమం కోసం రూ.4,376 కోట్లు కేటాయించిన



సందర్భంగా మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సైఫుద్దీన్ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజలందరికీ ప్రయోజనం పొందే బడ్జెట్ కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. అలాగే గత ప్రభుత్వం మైనార్టీలకు అన్యాయం చేసిందని హామీల పేరుతో మోసం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే మైనార్టీలకు పెద్దఎత్తున నిధులు కేటాయించడం దీనికి నిదర్శనమని, రాబోయే రోజుల్లో మైనార్టీలకు మరింత న్యాయం చేసే విధంగా కూటమి ప్రభుత్వం ఉంటుందని నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్ మైనార్టీలకు వెన్నంటే ఉంటారని తెలిపారు.

# వ్యవసాయానికి పెద్దపేట!

◆ ప్రజల నమ్మకానికి ప్రతిరూపమే ఈ బడ్జెట్

◆ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ స్పష్టీకరణ



అమరావతి, చైతన్యరథం: రాష్ట్రం ఆర్థిక కష్టాల్లో ఉన్నా. కూటమి ప్రభుత్వం ప్రజలకు నమ్మకం కలిగించేలా బడ్జెట్ ఉందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ అన్నారు. అమరావతిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకానికి ప్రతి రూపమే ఈ బడ్జెట్ అని అన్నారు. సాగునీరు, వ్యవసాయానికి భారీగా నిధులు ఇచ్చినందుకు ప్రభుత్వానికి ప్రజలు, రైతులు జైజైలు తెలుపుతున్నారన్నారు. రాష్ట్రం ఆర్థికంగా సంక్షోభంలో ఉన్నా అవకాశాలు వెతకడంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు కొత్తేమీ కాదన్నారు. ఐదేళ్లలో జగన్ లెక్కాపత్రం లేకుండా చేసిన ఖర్చులు, నిధులు మళ్లించిన వాటికి జవాబు చెప్పాల్సి వస్తుందని అసెంబ్లీకి జగన్ రావడం లేదని ఆయన విమర్శించారు. జగన్ అసెంబ్లీకి రాకుండా ఎమ్మెల్సీలను కౌన్సిల్‌కు పంపడమేమిటని ప్రశ్నించారు. చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. గత నాలుగు నెలలుగా రాష్ట్రంలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండే బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్రంలో వ్యవస్థలను సర్వనాశనం చేసిన జగన్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం దుర్మార్గం అన్నారు. జగన్ హయాంలో వైసీపీ ప్రభుత్వం రూ1.35 లక్షల కోట్లు బకాయిలు పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తోందని ఆయన తెలిపారు.

### వైసీపీ ప్రభుత్వంలో నమోదైన అక్రమ కేసులో

# విజయవాడ ప్రత్యేక కోర్టుకు హాజరైన మంత్రి రామానాయుడు



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టుకు సోమవారం మంత్రి రామానాయుడుతో పాటు పలువురు టీడీపీ నాయకులు హాజరయ్యారు. 2019 ఆగస్టులో వైసీపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించిన ఆశ వర్కర్లకు న్యాయపరంగా అండగా నిలిచిన మంత్రి రామానాయుడుతో పాటు పలువురు పార్టీ శ్రేణులపైన నాడు అక్రమ కేసులు నమోదయ్యాయి. అప్పటి నుంచి గత నాలుగు సంవత్సరాలుగా కోర్టుకు హాజరవుతూ, 2023 నుంచి విజయవాడ ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టుకు హాజరవుతున్నారు.ఆనాడు తమ న్యాయమైన కోర్కెల సాధనకై తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి ఆశ వర్కర్లు వెళుతుండగా పాలకొల్లు రైల్వే స్టేషన్లో బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు. ఎప్పుడూ పోలీస్ స్టేషన్ గుమ్మం తొక్కని మహిళలు, గర్భిణీలను సైతం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు స్టేషన్‌లోనే ఉంచడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురియ్యారు. పోలీస్ స్టేషన్లో నిర్బంధించిన ఆశ వర్కర్లైన మహిళలకు కనీసం భోజనం సదుపాయంతో పాటు న్యాయపరమైన సాయం అందించలేదు. అనాటి వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనపై పోరాటం చేస్తున్న నాడు ఎమ్మెల్యేగా ఉన్న రామానాయుడుపై అధికార పార్టీ ఒత్తిడితో పాలకొల్లు పోలీసులు అక్రమ కేసును బనాయించారు. ఈ నేపథ్యంలో మంత్రి రామానాయుడు సోమవారం విజయవాడ కోర్టుకు హాజరు కావాల్సి వచ్చింది.



# ఆదర్శప్రాయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్

◆నివాళులర్పించిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

మైలవరం (చైతన్యరథం): విద్యావేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు, లౌకికవాది డాక్టర్ మౌలానా అబుల్ కలాం అజాద్ స్ఫూర్తితో ప్రతిఒక్కరూ దేశాభివృద్ధికి కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆజాద్ జయంతిని పురస్కరించుకొని సోమవారం గొల్లపూడి కార్యాలయంలో స్థానిక నేతలతో కలసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవినేని ఉమా మాట్లాడుతూ... భారతరత్న కలాం భారతదేశ తొలి విద్యామంత్రిగా పనిచేస్తూ ఆయన రూపొందించిన విద్యావిధానం దేశాభివృద్ధికి ఎంతో తోడ్పడిందని చెప్పారు. సమైక్యతా వాది ఆజాద్ దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించారని, మతసామరస్యాన్ని ఆచరించి చూపించారని కొనియాడారు. గాంధీజీ అనుచరుడిగా అనేక ఉద్యమాల్లో పాల్గొనడంతో పాటు తన రచనల ద్వారా ప్రజల్లో స్వాతంత్ర్య ఆకాంక్షను పెంపొందించారన్నారు. ఇంగ్లీష్, హిందీ, పార్శి, అరబ్బీ, ఉర్దూ వంటి అనేక భాషాల్లో పాండిత్యం పొంది బహుభాషా కోవిదుడిగా కీర్తి పొందారని ఈ సందర్భంగా గుర్తు చేసారు.

# రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్

◆విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు పెద్దపీట

◆ఎమ్మెల్యే గళ్ళ మాధవి వ్యాఖ్య



గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ రూ.2.94 లక్షల కోట్లతో ప్రవేశపెట్టి, విద్యా, వైద్యా, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేశారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ప్రారంభమయిన బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి హాజరయ్యారు. సభాసమావేశం అనంతరం ఎమ్మెల్యే గళ్లా మాధవి మీడియాతో మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వనరులను దారి మళ్లించడం, ఆర్థిక వ్యవహారాల్లో దుర్వినియోగానికి పాల్పడటం, లిక్కర్, ఇసుక, గనులను వైసీపీ నేతలు ఇష్టానుసారంగా దోచుకోవటం వలన రాష్ట్ర ఆదాయానికి తీవ్ర గండిపడటమే కాక, రాష్ట్రానికి వచ్చిన కంపెనీలను జగన్ రెడ్డి తరిమికొట్టి రాష్ట్రాని సర్వనాసనం చేశారని మండిపడ్డారు. పరిమితికి మించి, రుణాలను అధిక వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి దోచుకున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టటం వంటి దుస్సాహసానికి వైసీపీ నేతలు పాల్పడి, కేంద్ర ప్రభుత్వ నిధులను దారి మళ్లించటం వంటి కారణాలతో రాష్ట్రం అప్పుల సుడిగుండంలోకి నెట్టారని దుయ్యబట్టారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో రాష్ట్రాన్ని కాపాడాలంటే అది కేవలం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని నమ్మి కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకున్నారని, వారి నమ్మకాన్ని నిలబెడుతూ... ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని అన్నారు. తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలకు నిధులను కేటాయించామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గుంటూరు వంటి ప్రధాన నగరాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించడం హర్షణీయమని, రజకులు, దూదేకులు, నాయి బ్రాహ్మణుల వృత్తుల వారికి జీవనోపాధిని పెంచడానికి కూటమి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడం, బీసీ సంక్షేమానికి రూ.39,007కోట్లు కేటాయించడంపై బీసీల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమౌతున్నాయని అన్నారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాల్సిన అవసరం ఉందని వైసీపీ నాయకులు మాత్రం కుంటిసాకులు చెబుతూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

# రాష్ట్ర అభివృద్ధికి అద్దంపట్టేలా బడ్జెట్

◆టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు హర్షం



జంగారెడ్డిగూడెం (చైతన్యరథం): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్ ఉందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు వ్యాఖ్యానించారు. సోమవారం ఏపీ అసెంబ్లీ వేదికగా ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా దాసరి శ్యామ్ చంద్రశేషు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రవేశపెట్టిన మొట్టమొదటి వార్షిక బడ్జెట్లో కేటాయింపులు ప్రాధాన్యాలుగా చూస్తే విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు మంచి కేటాయింపులు చేశారని, ఆరోగ్య రంగానికి రూ.19 వేల కోట్లు, వ్యవసాయ రంగానికి రూ.43,500 కోట్లు కేటాయించడం హర్షనీయమన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి కోసం రూ.17వేల కోట్లు, గ్రామాలాభివృద్ధి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. రోడ్లు, భవనాలకు సంబంధించి దాదాపు రూ.10వేల కోట్లు కేటాయించడం సంతోషించదగ్గ విషయమన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి దాదాపు రూ.55 వేల కోట్లు కేటాయించడం ఈ వర్గాల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శమన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో అటు ప్రాజెక్టులకు, పరిశ్రమలకు, క్రీడలకు, నైపుణ్యాభివృద్ధికి చేయూతనిచ్చే విధంగా ఉందని శ్యామ్ చంద్రశేషు వ్యాఖ్యానించారు.



# కార్యకర్తల సంక్షేమానికీ టీడీపీ ప్రాధాన్యత

◆నెల్లూరులో జోరుగా సభ్యత్వ నమోదు

నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు నగరంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతోంది. నగరంలోని 47వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ధర్మవరం సుజాతరావు ఆధ్వర్యంలో చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తుంది. స్థానిక గుప్తాపార్క్ సెంటర్, నారాయణరావుపేట తదితర ప్రాంతాల్లో టీడీపీ నేతలు ఇంటింటికి వెళ్లి సభ్యత్వ నమోదుతో కలిగే ప్రయోజనాల గురించి వారికి వివరించి డిజిటల్ సభ్యత్వాలను అందజేస్తున్నారు. ధర్మవరం సుజాతరావు మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం... కేవలం 2 వారాల్లో 20 లక్షల మందికి పైగా టీడీపీ సభ్యత్వాలు నమోదు చేసుకోవడం చూస్తే తెలుగుదేశం పార్టీపై ప్రజలకున్న అభిమానానికి నిదర్శనమన్నారు. రూ.100తో టీడీపీ నూతన సభ్యత్వం, పాత సభ్యత్వం పునరుద్ధరణ చేసుకోవచ్చునని, కార్యకర్తల సంక్షేమానికి కృషిచేసే ఏకైక పార్టీ తెలుగుదేశంపార్టీ అని అన్నారు. రూ.5 లక్షల ప్రమాద బీమా, కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం కోసం ఆర్థికసాయం అందిస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం 100 రూపాయలు చెల్లించి తీసుకుంటే రూ.5 లక్షల ప్రమాద బీమా, పిల్లల చదువుకి ఆర్థిక సాయం, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు వంటి ప్రయోజనాలు కల్పించనున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌ఛార్జ్ గణేష్‌కుమార్, కలవకుంట సుధా, నీలకంఠ మునికృష్ణ, కంచి కృష్ణ, సుభాష్ , షేక్ రఖియా సునీత, రమీజా, నారు బోయిన శోభ, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సమగ్రాభివృద్ధికి అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్

◆హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్



అమరావతి (చైతన్యరథం): అసెంబ్లీ సమావేశాలలో ఎన్టీఆర్ జిల్లా మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు సోమవారం పాల్గొన్నారు. ఈ సంధర్భంగా రాష్ట్ర బడ్జెట్ ను కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శాసనసభ్యులు కృష్ణప్రసాదు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి నేతృత్వంలో కూటమి ప్రభుత్వం జనరంజకంగా బడ్జెట్ ప్రవేశపెట్టిందని వ్యాఖ్యానించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు అనుగుణంగా సూపర్ సిక్స్ పథకాల అమలుకు కృషి చేస్తోందన్నారు. ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటూనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర అభివృద్ధితోపాటు పేద ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా బడ్జెట్ ఉందన్నారు. రూ.2,94,427.25 కోట్లతో 2024-25 ఆర్థిక సంవత్సర రాష్ట్ర బడ్జెట్ ను కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. ఎస్సీల సంక్షేమానికి రూ.18,497 కోట్లు, ఎస్టీల సంక్షేమానికి రూ.7,557 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ.39,007 కోట్లు, మైనార్టీ సంక్షేమానికి రూ.4,376 కోట్లు, మహిళ, శిశు సంక్షేమానికి రూ.4,285 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. పోలీస్ శాఖకు రూ.8,495 కోట్లు, పర్యావరణం అటవీశాఖకు, రూ.687 కోట్లు నైపుణ్యాభివృద్ధి శాఖకు రూ.1,215 కోట్లు, యువజన, పర్యాటక శాఖకు 322 కోట్లు, ఉన్నత విద్యకు రూ.2,326, ఆరోగ్య రంగానికి రూ.18,421, పంచాయతీరాజ్ శాఖకు రూ.16,739, పట్టణాభివృద్ధికి రూ.11,490, గృహ నిర్మాణానికి రూ.4,012 కోట్లు, జల వనరుల శాఖకు రూ. 16,705 కోట్లు, పరిశ్రమలు, వాణిజ్య రంగానికి రూ.3,127 కోట్లు, ఇంధన రంగానికి రూ.8,207 కోట్లు, రోడ్లు, భవనాలకు రూ.9,554 కోట్లు, రాయితీ విత్తనాలకు రూ.240 కోట్లు, భూసార పరీక్షలకు రూ.38.88 కోట్లు, విత్తనాల పంపిణీకి రూ.240 కోట్లు, ఎరువుల సరఫరాకు రూ.40 కోట్లు, పొలం పిలుస్తోందికి రూ.11.31 కోట్లు, ప్రకృతి వ్యవసాయానికి రూ.422.96 కోట్లు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# సభ్యత్వ నమోదులో భాగస్వాములు కావాలి

◆క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్ సోదరుడు పిలుపు

రాయచోటి (చైతన్యరథం): మండలంలోని పేమ్మడ పల్లెలో తెలుగుదేశంపార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి సూచనల మేరకు రాయచోటి మండలం యువనాయకుడు జంగంరెడ్డి గ్రామ నాయకుల అధ్వర్యంలో నిర్వహించారు. జంగంరెడ్డి గ్రామ నాయకులు ఇంటింటికి తిరుగుతూ సభ్యత్వం వలన కలిగే ఉపయోగాలు వివరిస్తూ ప్రజల చేత స్వచ్ఛందంగా సభ్యత్వం చేపించారు. జంగంరెడ్డి మాట్లాడుతూ... దేశంలో ఏ పార్టీకి లేనంత బలం తెలుగుదేశంపార్టీకి ఉందన్నారు. వంద రూపాయలతో పార్టీ సభ్యత్వం తీసుకొని ఐదు లక్షల వరకు ప్రమాద బీమా పొందవచ్చునని సభ్యత్వం తీసుకుంటే తెలుగుదేశం పార్టీ సమస్యలు ఉన్నప్పుడు ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు.



చైతన్యరథం

# నేటి నుంచి ధర్మవరం రెవిన్యూ డివిజన్ పరిధిలో గ్రామసభలు

◆ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక

◆ నాయకులు, ప్రజలు పాల్గొనాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన



అసెంబ్లీ ప్రాంగణంలో సహచర శాసనసభ్యులతో రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీత

రాప్తాడు (చైతన్యరథం): గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రామసభలు నేటి నుంచి ధర్మవరం రెవిన్యూ డివిజన్ పరిధిలో ప్రారంభం కానున్నాయి. ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ధర్మవరం నియోజకవర్గంతో పాటు, రాప్తాడు నియోజకవర్గం పరిధిలోని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో ఈ గ్రామ సభలు జరుగుతాయని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ, తహసీల్దార్, ఇతర మండల అధికారులంతా హాజరవుతారని... గ్రామంలో సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పై గ్రామసభలు జరగనున్నాయని.. ప్రజలు తమ సమస్యలు వచ్చి నేరుగా చెప్పుకోవచ్చు అని అన్నారు. రెవిన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్ కు వెళ్లి విన్నవించుకుంటారని... అయితే ఇది చాలామందికి వ్యయ ప్రయాసలతో కూడుకున్నదిగా మారిందన్నారు. అందుకే అధికారుల సేవలు మరింత విస్తృతం చేసే విధంగా గ్రామాల్లోనే గ్రామసభల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. మండలంలో నేటి నుంచి ఈనెల 28వ తేదీ వరకు గ్రామసభలు జరగనున్నాయని... దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధి కోసం, అలాగే గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా సునీత అన్నారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారానికి కూడా ప్రత్యేకంగా చొరవ చూపుతోందన్నారు.

# ఆర్థిక కష్టాల్లోనూ నమ్మకం కలిగించేలా రాష్ట్ర బడ్జెట్

◆ సంక్షోభంలో అవకాశాలు వెదకడం చంద్రబాబుకు కొత్తేమీ కాదు

◆ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్పష్టీకరణ



వినుకొండ (చైతన్యరథం): ఎన్నో అంచనాల మధ్య వచ్చిన కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్ ఆర్థిక కష్టాల్లోనూ రాష్ట్రం, ప్రజలకు సానుకూల నమ్మకం కలిగించేలా ఉందని తెలుగుదేశంపార్టీ సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వ్యాఖ్యానించారు. సంక్షోభంలో అవకాశాలు వెదకడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు కొత్తేమీ కాదన్న ఆయన... ప్రస్తుత బడ్జెట్ ద్వారా కూడా అదే మరోసారి చాటిచెప్పారని అన్నారు. సోమవారం కూటమి ప్రభుత్వం తీసుకుని వచ్చిన బడ్జెట్‌పై ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగానే అయిదేళ్లుగా జగన్ ధ్వంసం చేసిన రాష్ట్ర పునర్నిర్మాణానికి బలమైన పునాదులు వేసేలా ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ప్రవేశ పెట్టిన బడ్జెట్లు ఉన్నాయన్నారు. సీఎం చంద్రబాబు తలపెట్టిన స్వర్ణాంధ్రప్రదేశ్ సంకల్పానికి కూడా ఈ బడ్జెట్ నాందిగా చరిత్రలో నిలిచిపోతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అన్ని రంగాలకు ప్రాధాన్యతా క్రమంలో భారీగా నిధులు ఇచ్చారని, మరీ ముఖ్యంగా సాగు నీరు, వ్యవసాయంపై ప్రత్యేకశ్రద్ధ చూపినందుకు, నిధులు ఇచ్చినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. చంద్రబాబు తలపెట్టిన నదుల అనుసంధానం పూర్తయితే కరవు విముక్త ఆంధ్రప్రదేశ్ సాకారమౌతుందన్నారు. మొత్తంగా చూస్తే మాత్రం కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకానికి ప్రతిరూపంగా రాష్ట్ర బడ్జెట్‌ను తీర్చిదిద్దినట్లు కనిపించిందన్నారు. 1995 సీఎంను చూస్తారన్న చంద్రబాబు మాటలు బడ్జెట్ రూపంలో స్పష్టంగా అర్థమౌతోందని, రానున్న రోజులంతా రాష్ట్రానికి ఉజ్వలభవిష్యత్ ఉండనుందని నమ్మకం కలిగించే ప్రయత్నం చేశారన్నారు. ఇదే సమయంలో మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి చేసిన ఆర్థికవిధ్వంసంపై 7 శ్వేతపత్రాల్లో సవివరంగా చెప్పామన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు.. చేసిన ఆ పాపాలపై సమాధానం చెప్పాల్సి వస్తుందనే జగన్ అసెంబ్లీకి ఎగ్గొట్టి దాక్కున్నారని ఎద్దేవా చేశారు. గడిచిన అయిదేళ్లు లెక్కపత్రం లేకుండా ఖర్చులు, నిధులు మళ్లింపులు చేశారని ఎప్పటికైనా జగన్ వాటికి సమాధానాలు చెప్పి తీరాల్సి ఉంటుందన్నారు.



# గుండ్లకమ్మ నదిలో గల్లంతైన ఫొటోగ్రాఫర్ కుటుంబానికి బాసటగా నిలిచిన గొట్టిపాటి లక్ష్మి

◆ ఇచ్చిన మాట ప్రకారం గర్భవతైన ఫోటోగ్రాఫర్ భార్యకు ఉచిత ఆపరేషన్

◆ కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబ సభ్యులు

దర్శి (చైతన్యరథం): ఇటీవల గుండ్లకమ్మ నదిలో గల్లంతైన స్థానిక ఫోటోగ్రాఫర్ నారాయణ కుటుంబానికి నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మి బాసటగా నిలిచారు. ఇచ్చిన మాట ప్రకారం గర్భవతైన ఫోటోగ్రాఫర్ భార్యకు ఉచితంగా ఆపరేషన్ చేసి తల్లి, బిడ్డలను ఆదుకున్నారు. మృతుడైన ఫోటోగ్రాఫర్ వెంకట్ నారాయణ భార్య పద్మ నిండు గర్భవతితో ఒంగోలు ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్ళింది. ఆమెకు ఆపరేషన్ చేసి తల్లి బిడ్డను కాపాడగలమని అక్కడి వైద్యులు తెలిపారు. ఆపరేషన్‌కు లక్ష రూపాయలకు పైగా ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో, అంత స్తోమత మా దగ్గర లేదంటూ వారి కుటుంబ సభ్యులు గొట్టిపాటి లక్ష్మికి తమ ఆవేదనను చెప్పుకున్నారు. దీనిపై చలించిన గొట్టిపాటి లక్ష్మి ఉచితంగా వైద్య సేవలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం సోమవారం నరసరావుపేటలోని కడియాల హాస్పిటల్ నందు ఉచితంగా ఆపరేషన్ చేసి తల్లిని, బిడ్డని కాపాడారు. వైద్య ఖర్చులకు అయ్యే లక్ష రూపాయలను పుట్టిన ఆడబిడ్డ పేరుతో డిపాజిట్ చేసి భవిష్యత్తులో ఆమె చదువులకు ఉపయోగించాలని గొట్టిపాటి లక్ష్మి కుటుంబ సభ్యులకు సూచించారు. దర్శి ప్రజల బాగోగులు చూసుకునే బాధ్యత తాను తీసుకుంటానని, ఆపదలో ఉన్నవారు ఎవరైనా కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా ఏదైనా వైద్య సేవలు అవసరమైతే తనను సంప్రదించాలని గొట్టిపాటి లక్ష్మి కోరారు.

# పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఎప్పుడూ ఉంటుంది

◆ గొట్టుముక్కల రఘురామరాజుకు అభినందనలు తెలిపిన టీడీపీ నేతలు



విజయవాడ (చైతన్యరథం): శ్రామిక, కార్మిక హక్కుల కోసం టీఎన్టీయూసీ తరుపున అలుపెరుగని పోరాటం చేసిన గొట్టుముక్కల రఘురామరాజు "ఏపీ స్టేట్ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్"గా నియామకమైన సందర్భంగా 30వ డివిజన్ తెలుగుదేశంపార్టీ కమిటీ అభిమానుల సమక్షంలో రఘురామరాజుకి సన్మాన కార్యక్రమం నిర్వహించి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, మాజీ ఏఎమ్‌సీ డైరెక్టర్ ఘంటా కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా నవనీతం సాంబశివరావు మాట్లాడుతూ... టీడీపీ రాష్ట్ర నాయకత్వం గొట్టుముక్కల రఘురామరాజును ఏపీ స్టేట్ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా నియమించడం చాలా సంతోషంగా ఉందని, నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్రంలోనే కార్మికుల కోసం నిరంతర కృషి చేసిన వ్యక్తి రఘురామరాజు అని వ్యాఖ్యానించారు. 20 ఏళ్లుగా టీడీపీలో డివిజన్ స్థాయి కార్యకర్త నుంచి నిరంతరం ప్రజాసేవ చేస్తూ అంచెలంచెలుగా ఎదిగారన్నారు. వైసీపీ పాలనలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ కార్మికులను సంఘటితం చేశారని అన్నారు. కార్మికుల భవిష్యత్తు నాశనం చేస్తున్న సమయంలో వారి హక్కుల కోసం ఉద్యమించారని అన్నారు.

ఏపీ బిల్డింగ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా గొట్టుముక్కల రఘురామరాజును నియమించడం అభినందనీయమని మాజీ ఏఎమ్‌సీ డైరెక్టర్ ఘంటా కృష్ణమోహన్ వ్యాఖ్యానించారు. పార్టీలో నిబద్ధతతో క్రమశిక్షణతో ముందుకు సాగిన రఘురామరాజు పని విధానాన్ని గుర్తించి టీడీపీ అధిష్టానం నామినేటెడ్ పోస్టు కట్టబెట్టిందన్నారు. కార్మికుల భవిష్యత్తు కోసం కృషిచేసి మంచి భవిష్యత్తును కల్పించడంతోపాటు ప్రభుత్వపరంగా అందించే ప్రతిఒక్క పథకాన్ని ప్రజలకు అందించేలా పనిచేయాలని ఘంటా కృష్ణ మోహన్ కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు చౌదరి సూర్యనారాయణ, గొట్టుముక్కల శేషం రాజు, గొట్టుముక్కల వెంకటేశ్వరరాజు (వెంకీ), వెలగపూడి శ్రీను, రామకృష్ణ,రెడ్డి శంకర్, వేపడ రమణ, శేషు, ఎస్.కేజిల్లు, రాంబాబు, కుమారి, అనురాధ, సరోజినీ, కోటేశ్వరమ్మ, భవాని, శారద, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన పక్షపాతి చంద్రబాబు

◆ బడ్జెట్ కేటాయింపులపై హర్షం వ్యక్తం చేసిన ఎం. ధారు నాయక్



అమరావతి (చైతన్యరథం): గత వైసీపీ ప్రభుత్వంలో గిరిజన బిడ్డల అభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయింపులు తూతూమంత్రంగా చేసి గిరిజనులను అభివృద్ధికి దూరం చేశారని, కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదే ఎస్టీలకు రూ.7,557 కోట్లు బడ్జెట్లో కేటాయించడం అభినందనీయమని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.ధారునాయక్ వ్యాఖ్యానించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎస్టీ కార్పొరేషన్, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ఊసేలేదని, వైసీపీ ప్రభుత్వం రోడ్ల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం చేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో సరైన రోడ్లు లేక ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో డోలీలు కట్టుకొని కొండలు, గుట్టలు దాటల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిపుత్రులు అభివృద్ధికి శ్రీకారం చుట్టాతూ సరైన రహదారి నోచుకోని గ్రామాలకు కచ్చా రోడ్ల స్థానంలో తారు రోడ్లు నిర్మించన్నారు. రాష్ట్రంలో వందకు పైగా జనాభా కలిగిన 130 గిరిజన తండాలలో తొలి దశలో 130 రోడ్ల నిర్మాణనికి అంచనా వ్యయం లో కేంద్రం 60% రాష్ట్రం 40% నిధులను సమకూరుస్తుందని, గత వైసీపీ ప్రభుత్వంలో గిరిజనలకు సంబంధించిన 16 పథకాలను రద్దు చేసి జగన్‌రెడ్డి గిరిజన ద్రోహిగా మిగిలాడన్నారు. గాడి తప్పిన ప్రజా పరిపాలనను తిరిగి గాడిలో పెడుతూ... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పనిచేస్తుంటే జగన్‌రెడ్డి మాత్రం ప్రభుత్వంపై బురదచల్లుతూ తన సైకో నైజాన్ని చూపెడుతున్నారని అన్నారు. తల్లికి, చెల్లికి సున్నం పెట్టిన జగన్... రాష్ట్ర ప్రజల గురించి ఏం ఆలోచిస్తాడని మండిపడ్డారు.